తెలంగాణ జాగృతి

# తంగేడు

తెలుగు సాహిత్య పక్ష పత్రిక

## మహిళా దినోత్సవ ప్రత్యేక సంచిక

మార్చి 01-15, 2021

సంపుటి 01, సంచిక 10

*Complimentary Copy - 10*





*Printed, Published and Owned by :* ***KALVAKUNTLA KAVITHA***
Printed at : **HARSHITHA PRINTERS**, Khairatabad, Hyderabad - 500 004.
Published at : **TELANGANA JAGRUTHI,** Pasham Amruthaaram Residency, H.No. 1-2-234/13/46/4, 3rd Floor,
Near NTR Stadium  Aravind Nagar, Domalguda, Hyderabad - 500 029. Telangana State.
Editor : **KALVAKUNTLA KAVITHA**

# విషయ సూచిక




30 నాటి కవయిత్రుల రచనా సంవిధానం మనకు తెలియజేసే నాటి కవిత....



04 నాటి **అరుగుల్ని** కళ్ళముందు నిలిపిన **వేముల ప్రేమలత** కవిత...



46 పురుషదృక్పథంలోని సహాయ గుణాన్ని తెలియజేసే **రోహిణి వంజరి** కథ... **'చెల్లె'**



23 **'బొమ్మ హేమాదేవి'** కథా శిల్పాన్ని విశ్లేషిస్తున్న **అఫ్రీన్ బేగం**



15 అనివార్యంగా తల్లికి, కుటుంబ ప్రేమకు, దూరమైన విదేశాల్లో స్థిరపడ్డ నేటి యువకుని కథ, **సి. భవానీ దేవి... 'చివరి వలస'**



37 **'మార్చి 8'** స్త్రీ అస్తిత్వాన్ని తన దృక్కోణంలో విశ్లేషించిన **జూపాక సుభద్ర** వ్యాసం...**'మట్టి మహిళదే....'**



41 లంబాడి సంస్కృతిని జీవన విధానాన్ని తెలిపే **జ్వలిత కథ... 'సంకల్పం'**



29 నేటి మహిళకు ఉండవలిసిన సాహసాన్ని చిత్రించిన **ఏదునూరి రాజేశ్వరి** కథ... **'తెగింపు'**

05 పరిస్థితిని తనకు అనుగుణంగా మలుచుకొని బావ మనసు గెలుచుకున్న **ఎల్లాప్రగడ సీతాకుమారి** నాటి యువతి కథ... **'ఈ రాధేనా?'**

09 కరోనా సమయంలో రచయిత్రులు నిర్వహించిన కర్తవ్యం తెలిపే డైరీ **ప్రతిభారత్న రాజ్యలక్ష్మి 'అవలోకనం'**

నాటి కవయిత్రుల రచనా సంవిధానం మనకు తెలియజేసే **'నాటి కవిత'.... 12వ** పేజీలో

అన్ని ప్రక్రియలు సృజించగలిగిన సాహితీవేత్త **స్వాతిశ్రీపాదతో 'ముఖాముఖి'.... 19వ** పేజీలో

సమ్మెట ఉమాదేవి **'జమ్మిపూలను'** తన వ్యాసంలో **'కన్నీటి పూలు'**గా అభివర్ణించిన **నెలుట్ల రమాదేవి... 27వ** పేజీలో

నాటి కవనమణుల రచనాప్రాభావాన్ని విశ్లేషించిన **కొండపల్లి నీహారిణి** వ్యాసం.. **'కవిత్వ ప్రాభవం'... 31వ** పేజీలో

సమాజంలో ప్రశ్నించే తత్వం పెరగాలంటున్న గోగు శ్యామల వ్యాసం... **'ప్రశ్నించే గొంతుకలు'... 13వ** పేజీలో

స్త్రీ అణచి వేత మీద **తిరుగబడితేనే** మనగలదనే స్ఫూర్తి నింపే **డా॥ సరోజ 'వింజామర'** కవిత... **48వ** పేజీలో

నిరంతరం అలుపెరుగక ప్రయాణించే మహిళను చిత్రించిన కవిత **"నేటి మహిళ"... 22వ** పేజీలో

పురా స్మృతిలో **'తాతయ్య'**ను వెతికే **'భవానీ శ్రీనివాస్'** కవిత... **26వ** పేజీలో

**పెద్దర్వాజ** రాజసాన్ని చిత్రించిన **వకుళ వాసు** కవిత... **30వ** పేజీలో

స్త్రీలోని భిన్న పార్శ్వాలను ఆవిష్కరించిన **కిరణ్ కుమారి గజల్** కవిత... **45వ** పేజీలో

స్త్రీని చైతన్య పరిచే **షహనాజ్ ఫాతిమా మృత కణం** కవిత... **30వ** పేజీలో

ఇంకా.. స్వీకారం.... సాహితీ శిఖరం... మరెన్నో...

# తంగేడు సంచికకు స్పందన...

"తంగేడు" పత్రిక సుందరంగా, కనులకు మనసుకు కూడా విందు చేస్తోంది.
**- యలమర్తి అనూరాధ, రచయిత్రి**

తంగేడు వ్యాసాలు, కథలు, కవితలు అలరిస్తున్నాయి. సంపాదకీయాలు ఆలోచింపచేస్తున్నాయి.
**- ఎస్వీ సత్యనారాయణ, మాజీ వైస్ ఛాన్సలర్**

తంగేడు క్రమం తప్పకుండా కనువిందు చేస్తున్నది. కమనీయంగా పరిమళిస్తున్నది. అభినందనలు.
**- నందిని సిధారెడ్డి, మాజీ ఛైర్మన్, సాహిత్య అకాడమీ**

తంగేడులో సాహిత్యం పొంగులై పారుతుంది. సాహిత్య పత్రికలేని లోటు తీరుతుంది.
**- ప్రొ॥ కసిరెడ్డి వెంకట రెడ్డి**

నాటి భారతిని స్ఫురింపజేస్తూ వస్తున్న సాహిత్య పత్రిక మన 'తంగేడు'... అభినందనలు.
**- ప్రొ॥ ఎస్.వి. రామారావు**

ఈ పక్షం సంచిక కవర్ పేజీ బాగుంది. అభినందనలు...
**- బైస దేవదాస్, ఎడిటర్, నేటినిజం**

అన్ని వర్గాలకు సమాహారంగా తంగేడు వెలువడుతుంది. దినదినాభివృద్ధి చెందుతుంది.
**- ఏదునూరి రాజేశ్వరి, కథా రచయిత్రి**

వైవిధ్య భరితంగా ముస్తాబవుతున్న పత్రిక తంగేడు. సంపాదకీయాలు నన్ను బాగా ఆకర్షింప చేస్తున్నాయి. పత్రిక సత్తా తెలిపేవి అవే కదా....
**- అనుమాండ్ల భూమయ్య, మాజీ వైస్ ఛాన్సలర్**

## రచయితలకు సూచనలు

- ✓ సమీక్ష కోసం పుస్తకాలు పంపేవారు విధిగా రెండు కాపీలు పంపాలి.
- ✓ పత్రిక కోసం రచనలు పంపించే వారు యునిక్ కోడ్‌లో ఉంటే ఓపెన్ ఫైల్ మరియు పిడిఎఫ్‌లో మెయిల్ చేయండి.
- ✓ మా పత్రికకు రచనలు పంపినవారు ఇక్కడ అచ్చయాకనే ఫేస్ బుక్‌లో బ్లాగ్‌లో పెట్టండి.
- ✓ ప్రతి రచనకు ఇది ఎక్కడా ప్రచురణ కాలేదని, ఏ బ్లాగ్‌లో పోస్ట్ చేయలేదని, ప్రచురణ ప్రసారం కోసం ఎవరికీ పంపి ఉండలేదని హామీ పత్రం జత చేయండి.
- ✓ పత్రికలో ఒక కథ లేదా వ్యాసానికి నాలుగు పేజీలు మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ లెక్కన పదమూడు వందల పదాలకు మించకుండా వ్యాసం, కథ పంపించండి.
- ✓ కవితలు 15 పాదాలకు మించకుండా పంపించండి.
- ✓ వ్యాసాలు, కథలు, కవితలు ఏవైనా పోస్ట్‌లో కూడా ఈ క్రింది చిరునామాకు లేదా ఇ-మెయిల్‌కు పంపవచ్చు.
- ✓ ప్రచురణకు స్వీకరించిన రచనల్ని పత్రికనుగుణంగా మార్పు చేసుకునే హక్కు సంపాదకవర్గం కలిగి ఉంటుంది.

**తెలంగాణ జాగృతి**
పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం. 1-2-234/13/46/4, 3వ అంతస్తు, ఎన్.టి.ఆర్. స్టేడియం దగ్గర, అరవింద్ నగర్, దోమలగూడ, హైదరాబాద్ - 500 029. తెలంగాణ. E-mail : editor@thangedu.co.in

సంపాదకీయం


తంగేడు

తెలంగాణ జాగృతి
తెలుగు సాహిత్య పక్ష పత్రిక

01-15 మార్చి, 2021

సంపుటి 01 సంచిక 10




శ్రీమతి కల్వకుంట్ల కవిత
ఎడిటర్



డా॥ కాంచనపల్లి గో.రా.
అసోసియేట్ ఎడిటర్
9676096614

# మరింత నూతనంగా...

మార్చ్ 8, 1910లో అంతర్జాతీయ మహిళా సదస్సులో కారీ జ్యాట్కిన్ చేసిన ప్రకటన మహిళా దినోత్సవానికి మూలంగా నిలిచింది. తరువాత ఈ ఉత్సవ దినం ప్రపంచంలోని అనేక దేశాలలో అనేక విధాలుగా రూపాంతరం చెందింది. భారతదేశంలో కూడా మహిళలు ఈ స్ఫూర్తిని అందుకొంటున్నారు. సామాజిక పురోభివృద్ధిని అన్ని రకాలుగా ఆవాహన చేసుకొంటూ అన్ని రంగాలలో పురోగమిస్తున్నారు. మహిళలకు సమాన హక్కులు లక్ష్యంగా చేసుకున్న భావజాలంతో స్త్రీ వాదం అడుగు పెట్టింది. 1902లో ఎలిజిబెత్ కాడిస్టాంటన్‌తో ప్రారంభమైన ఈ ఉద్యమం అనేక విధాలుగా విస్తరిల్లింది. 19, 20 శతాబ్దాల ఫెమినిజం చట్టపరమైన అసమానతలను తొలగించడంపై దృష్టి పెట్టింది. 1960, 80ల మధ్య వచ్చిన రెండవ వేవ్ ఫెమినిజం సాంస్కృతిక అసమానతలపైన దృష్టి పెట్టింది. 1990, 2000 మధ్య ఫెమినిజం విభిన్న జాతులలో దేశాలలో ఈ భావజాలాన్ని బలంగా ప్రోది చేయడానికి దోహదపడింది. సుమారుగా 1990 ప్రాంతంలో తెలుగు సాహిత్యంలో ప్రారంభమైన స్త్రీవాదం సాహిత్యానికి కొత్త సౌందర్యదృక్పథాన్ని ప్రతిపాదించింది. అదివరకు సాహిత్యంలో లేని ప్రతీకలను, సరికొత్త నిర్మాణ పద్ధతులను తెరమీదకు తెచ్చింది. ఇదే సమయంలో తెలంగాణ స్త్రీ పరిస్థితులను కొంత విభిన్నతతో చూడవలసిన అవసరం ఉంది. పితృస్వామిక భావజాల పంజరం నుండి విడివడినంత మాత్రాన స్త్రీ సమస్యలు పూర్తిగా పరిష్కారం కావు. ఇక్కడి దళిత బహుజన వర్గాల స్త్రీల సమస్యలు వేరుగా చూడవలసి ఉంది.

ఎన్ని వాదాలు ఆదర్శాలు వచ్చినా స్త్రీలపై వివక్ష, హింస అట్లాగే కొనసాగుతున్నవి. ఎన్ని చట్టాలు సంస్కరణలు వచ్చినా మానవ దృక్పథంలో స్త్రీకి రావలసిన సముచిత స్థానం ఇంకా ప్రశ్నగానే ఉండిపోయింది.

ఈ విషయాన్ని సాహిత్యంలో బలంగా ప్రతిపాదించవలసిన సందర్భం ఇది. నాటినుండి స్త్రీ సృజనకారుల సాహిత్య సృష్టిని స్మరించుకోవలసిన వేళ ఇది. మన దేశం నుండి ప్రాంతం వరకు ప్రశ్నించగలిగిన స్త్రీ గొంతుకలను అంచనా వేయవలసిన సందర్భం ఇది. తంగేడు ఈ సంచికలో తన పరిధి మేరకు ఈ ప్రయత్నం చేసింది. జాగృతి పక్షాన స్త్రీల ప్రత్యేక కవి సమ్మేళనాలు సంకలనాలు వాళ్ళ సమస్యల స్పందన మొదటినుండి జరుగుతున్నదే. ఇందులో భాగంగానే ఈ ప్రత్యేక సంచిక.

ప్రత్యేక సంచిక కోసం మా సంపాదక వర్గం అడిగినవెంటనే రచనలు అందజేసి సహకరించిన (విదేశాలలో ఉండికూడా) సృజన కారిణులకు మా ధన్యవాదాలు. స్త్రీ చైతన్యాన్ని పునరుత్తేజ పరచడానికి మేం చేసిన చిరు ప్రయత్నం ఇది. ఇట్లాంటి ప్రయత్నాలకు ఎల్లవేళలా సృజనకారుల, పాఠకుల అభిప్రాయాలను, ప్రోత్సాహాన్ని కోరుతున్నాం.

ఆకాశంలో సగమైన మనం మరింత నూతనంగా వికసిద్దాం.

జై తెలంగాణ, జై జాగృతి...

కవిత కల్వకుంట్ల

కవిత

# అరుగులు... నా జ్ఞాపకాలు

అక్కడొక మైదానంలా కనిపిస్తుంది
ఇక్కడ ఒక ఇల్లుండాలి కదా!
ఏమైంది? ఆ ఇల్లు ..నా జీవితం.

అందమైన నా బాల్యం అంతా
అక్కడే గడిచింది..
అన్నీ మధుర స్మృతులే

ఆ ఇంటితో ఇరవై రెండేళ్ల అనుబంధం మరి..
ఇంటిముందు ఉన్న జామ చెట్టు.
నీడనే కాదు తీయని పళ్ళను కూడా ఇచ్చేది

ఆ ఇంటి అరుగులతో ఎన్నెన్నో జ్ఞాపకాలు
ఊరికి చివరన ఇల్లు ఉండడం తో
ఆ అరుగులు ఎప్పుడూ పొలాలకు
వచ్చి పోయే కూలీలతో కళకళలాడుతు ఉండేవి

స్నేహితులతో ఆడే అష్టాచెమ్మా, పులి మేక,
గచ్చకాయలు, పచ్చీసూ,కైలాసం
అన్ని వాటి మీదే..

ఇక సాయంత్రాలు చదువుకోవడం,
హోంవర్క్‌లు, ఇంటిముందు పూసే
కనకాంబరాలు, మల్లెలు, మూడు రంగుల
డిసెంబరు పూలు, దవనంతో
కలిపి మాలలు అల్లడం అన్నీ
ఆ ఇంటి అరుగుల మీదనే

నాకింకా జ్ఞాపకం ప్రతి గురువారం
ఊళ్లో జరిగే సంతకు చుట్టుపక్కల
ఊర్ల నుండి వచ్చే వారందరికి
ఆ ఇంటి అరుగులే సేద దేర్చేవి.

ఆ ఇంటి అరుగుల పైనే కూర్చుని
వాళ్ళు తెచ్చుకున్న సద్ది తిని
నీళ్ళు ఇప్పించుకుని తాగి వెళ్తుండే వారు..

కొందరు సద్ది లేకుండానే వచ్చే వారు.
వాళ్లకు అమ్మ అన్నం, రొట్టెలు, కూరలు పెట్టేది ..

ఎంతమందికని అలా పెడతావు అమ్మా !
మనకు కూడా కావాలి కదా అనే వాళ్ళము మేము..

పోనీలే తల్లీ, పాపం ఎండన పడి వెళ్తున్నారు
మీకు మళ్లీ చేసిపెడ్తాలే అనేది..
నాన్న కూడా ఏమీ అనేవాడు కాదు
వారానికి ఒక్కరోజే కదా!
పోనీలే అమ్మా అనేవాడు.

వాళ్ళు తిని, నీళ్లు తాగి వెళ్తూ వెళ్తూ
మాకు దీవెనలిచ్చి వెళ్తుంటే
కలిగే ఆనందం కోసమేనేమో మేము
ఐదుగురం నేను ఇస్తా అంటే నేను ఇస్తా
అని చిన్నగా గొడవలు కూడా పడేవాళ్ళము.

ఉదయం నుండి సాయంత్రం దాకా
డ్రమ్ముల కొద్ది నీళ్ళతో వచ్చి పోయే వారి
దాహాన్ని తీర్చడం ఏదో తెలియని
ఆనందాన్ని సంతృప్తిని ఇచ్చేది.

ఆదివారాలు, సెలవు రోజులు వస్తే చాలు
సాయంత్రాలు ఆ అరుగులపై
కూర్చునే అమ్మ మాకందరికీ
వరుసగా చక్కగా నూనె రాసి..
రెండు జడలు వేసి పూలు పెట్టేది.

ఇప్పుడా ఇల్లు లేదు.. అరుగులు లేవు...
మా గుండెల్లో జ్ఞాపకాల రూపంలో కదలాడుతూ..
అప్పుడప్పుడు కంటినీరై కనిపిస్తుంటాయి.



వేముల ప్రేమలత



నాటి కథ

# ఈ రాధేనా?

పంతం గెలుచుకున్న స్త్రీ చైతన్యం...

ఎల్లాప్రగడ సీతాకుమారి

సాయంకాలం అయ్యేటప్పటికి రెసిడెన్సీ చమను, గాలిమేతకు వచ్చిన యువకులతోటి , ఆటలకు వచ్చిన పిల్లలతోటి కిటకిట లాడిపోతుంటుంది. అందులో ముందువైపు స్క్వేరులో రాజారావు కూచొని, అఖిలాంధ్రకథక సమ్మేళనానికి పంపడానికి ఏమి కథ రాద్దామా అని ఆలోచన చేస్తున్నాడు. కథకు ఎన్ని విధాల చూచినా మంచి 'థీము' దొరకడములేదు. అందులో టూకీగా రాశామా అంటే పాఠకులు సందర్భాలు వివరంగాలేవు అంటారు. పోనీ వివరంగా రాస్తే చాలా దీర్ఘం అయింది. మాకక్కర్లేదంటారు సంపాదకులు. పైగా చిన్న కథకు పాతవిషయాలేమీ పనికిరావు. కొత్త పోకడలు ఏం పోదాము ? ప్రణయరంగాలేమన్నా తీసుకుందామా. అబ్బే, ప్రణయమంతా పాతబడిపోయింది. పోనీ కర్షక కార్మిక సమస్యలో? చెత్త. ఎందుకూ మన కర్షక కార్మికులేమో రష్యాలోలాగ చదువుకోరు. ఇతర్లు చదివినా కార్యం శూన్యం. ఏదో కాస్త చదువుకున్న ఆడవాళ్లను తీసుకొని అవి ఇవి తగిలించిరాస్తే.... బాగానే ఉంటుంది కాని. ఇప్పటి స్త్రీలు ఊరుకోవడం లేదు. మా తెలుగువాళ్ల డాబులూ, ఇంట్లో కోతలూ, బయట పిరికితనమూ... ఊహూ. ఈ కుళ్లంతా పేపర్లకెక్కిస్తే బయటి వాళ్ళు ఎగతాళి పట్టించరూ!! పోనీ మా యువకుల్లో.....

ఆకస్మికంగా అతని ఆలోచనలకి అంతరాయం కలిగింది. ఎదురుగా ఒక పదహారేళ్ల అమ్మాయి పమిటచెంగుతో కన్నీళ్లు తుడుచుకుంటూ నిలుచొని ఉంది. ఆమె చూడ్డానికి ఎక్కువ సౌందర్యవతి కాదు.

చామనఛాయా, సామన్యమైన పొడగూ, పల్చని చెంపలూ, కొద్దిగా ముందుకు వాలిన నుదురూ చూడ్డానికి చాలా సామాన్యంగా కనిపిస్తుంది. కాని ఆ కళ్ళూ ఆ జుట్టూ.... అవి రెండే అమ్మాయిని మనిషిని చెయ్యడానికి తోడ్పడ్డాయి. ఆ కళ్లు గూడా చాలా పెద్దవి కావు గాని నల్లగానూ, తీక్షణంగానూ ఉండి ఒక విధమైన వశీకరణ శక్తితో ప్రకాశిస్తూ ఉన్నాయి. జుట్టుకూడా బిరుసుగానూ, వంకరలుగానూ ఉండి, ఆమెలోని దృఢనిశ్చయాన్ని తెలియజేస్తున్నాయి.

రాజా ఆ అమ్మాయిని ముందుగా పలకరించడం ఎందుకని ఊరుకున్నాడు. కాని ఆమె మరికొంచెం సమీపానికి వచ్చి "క్షమించాలి, మీ పరిచయం లేకపోయినప్పటికీ, మీ వేషాన్ని బట్టి ఆంధ్రులేనని గ్రహించి మాట్లాడుతున్నాను. ప్రస్తుతము నేను కొంచెం ఇబ్బందిలో ఉన్నాను. ఇప్పుడెవరయినా ఒక పురుషుడి సాయం కావలసి వుంది. కనుక మీరెవరయినా నాకు చెయ్యగలిగితే...." సగంలోనే అందుకొని రాజా "తప్పకుండా నా ప్రాణాల్నిచ్చైనా రక్షిస్తాను. మీకు వచ్చిన ఆపద ఏమిటో చెప్పండి. మనం కాకపోతే మరెవరు తోడ్పడుతారు?" అంటూ పొంగిపొయ్యే ఉత్సాహంతో తొందర పెట్టాడు.

కృతజ్ఞురాలిని, నా స్థితి. అంతా ఇప్పుడు చెప్పాలంటే చాలాకాలం పడుతుంది. టూకీగా చెబుతాను. మా వాళ్లు నన్ను ఇప్పుడొక ముసలివాడికిచ్చి పెళ్లి చెయ్యాలని చూస్తున్నారు. నా కది ఇష్టం లేక, ప్రస్తుత మా ముహూర్తం తప్పించాలని వీలయినంత వరకు ఒక వంద రూపాయలవరకూ దొరికించుకొని ఇలా వచ్చాను. మీరు దయవుంచి నన్ను ఒక సురక్షిత స్థానంలో జేరిస్తే కొన్నాళ్లుండి మళ్లీ వస్తాను.. ఏమంటారు..?

మీ ధైర్యానికి నా అభినందనలు. ఇలాంటి అసందర్భపు బలత్కార వివాహాలను బలవంతంగా ఫోర్సు చేసి అయినా తప్పించాలని మా యువకుల ఉద్దేశం తప్పకుండా మీరు కోరిన చోట మిమ్మల్ని దిగబెట్టివస్తాను.

ఆ అమ్మాయి సంతృప్తనయనాలతో "అలాగైతే మనం షాదునగరం వెళుదాము. ఈ రోజుల్లో అక్కడ కొంచెం చల్లగా కూడా ఉంటుందిట..." అంటూ

వీధిలోపోతున్న ఒక మనిషిని చూచి కొంచెం భయంతో ముఖం పక్కకు తిప్పుకొని "చూచారా, ఆ ఎర్రకోటు మనిషి మా పక్కఇంట్లోని వాడే. మనల్ని చూచినట్లు మా వాళ్లతో చెప్పాడాఅంటే మళ్లీ ప్రమాదంలో ఇరుక్కుపోతాము. సాధ్యమైనంత త్వరగా మనం వెళ్లిపోతే మంచిది" అంది.

రాజా కూడా కొంచెం తడబడి, "మీరు ఇక్కడే చెట్ల చాటున కొంచెం నిలబడండి. నేను వెళ్లి టాక్సీని తెస్తాను" అని గబగబా క్లాకుటవరు దగ్గరకు వెళ్లి ఐదు నిమిషాల్లో ఒక కారు తీసుకువచ్చాడు. ఇద్దరూ కట్టుబట్టల్తో అందులో ఎక్కి కూచోని కాచీగూడెం స్టేషనుకు పోనిమ్మన్నారు.

"ఇక్కడ నుంచీ సౌకర్యంగా ఉండటానికి మీ పేరేమిటో చెప్పండి. నన్ను రాజారావు అంటారు" అన్నాడు రాజా.

అమె కొంచెం నెమ్మదిస్తున్న తొట్రుపాటుతో "రాధ అంటారు" అంది.

- రైలు కదిలింతరువాత ఇద్దరూ సంభాషణలోకి దిగారు. "ఐతే మీ వాళ్లు ఎందుకిస్తున్నారు అంత పెద్దవాడికి."

"ఏమి లేదు, ఎక్కడ చూచినా పెద్ద పెద్ద కట్నాలు కావాలెననేవాళ్లే, పోనీ కాలేజీ స్టూడెంట్లెవరన్నా కట్నం లేకుండా వప్పుకుంటారేమోనంటే, వాళ్ళ రేటు మరీ ఎక్కువగా ఉంది. అభివృద్ధిపక్షంలో యువకులెవరన్నా కుదురుతారేమోనంటే వాళ్లకి నా చదువూ, చక్కదనమూ సరిపోలేదు. ఏంచేస్తారు మరి".

"ఐతే మరి మీరు పారిపోయి మాత్రం ఏం లాభం"?

"ఏదో తొందరపడకుండా విచారిస్తే, ఎవరైనా సంస్కార బుద్ధి ఉన్నవాళ్లు దొరక్కపోతారా అని... మీ రేంచేస్తున్నారిప్పుడు?"

ప్రస్తుతం ఖాళీగానే ఉన్నాను. ఈయేడే ఎమ్.ఏ. అయిపోయింది. మా నాన్నగా రెక్కడన్నా ఉద్యోగంలో ప్రవేశించమంటున్నారు. నాకేమో జర్మనీ వెళ్లి డాక్టరేటు తెచ్చుకుందామని ఉంది కాని ఏదో ఆర్థికపుచిక్కుల్తో అనుకూలపడ్డంలేదు."

**ఆ రాత్రి రాజాహృదయంలో పెద్ద తుఫాను రేగింది. "ఈ అమ్మాయి ఇదివరకు నేను భావన స్వప్నాల్లో తిలకిస్తున్నంత చక్కంది కాదుకాని ఎందుకో నన్ను ఆకర్షించివేస్తున్నది.. ఏమో గృహిణిగా ఉండటానికి ఈ చక్కదనం చాలదా ఏమిటి?.... ఐనా మనిషి నడకలో మంచి చక్కదనం ఉంది. మాటలు చాలా పొంకంగానూ, పొదుపుగానూ వాడుతుంది.**

"బహుశా వివాహం అయిందనుకుంటాను." "ఇంకా లేదండి, అదంతా ఓ రామాయణం, అసలు నాకు పెళ్లంటేనే ముందు అదో వికారం. అందులో నా ఉద్దేశాలకు తగిన ఆమె దొరకడం అంటే, కుందేటి కొమ్ము సాధించడమన్నమాట! "

"అలాగా, అయినా ఎలాటి ఊహలుండేవో.........

" అసలు నాకు మన తెలుగుపిల్లలంటేనే అసంతృప్తి, ఎక్కడైనా మగాడి మాట వినబడితే తుర్రున పారిపోవడమూ, ఏ సందర్భంలోనన్నా కాస్సేపు నలుగురు మగవాళ్లల్లో నుంచో వలసివస్తే ఈ తొట్రుపాటు, పమిటెసర్దుడూ, బెదురుచూపులూ ఇలాంటి వాళ్లతో మనకేం రొమాన్సు దొరుకుతుంది? ఏదో సందర్భపడితే జర్మనీనుంచే..."

"పోనీ, మంచి చదువులు చదివినవాళ్ళెరూ దొరకలేదూ ఇక్కడే?....."

"ఇక్కడ ఒకటుంటే ఒకటుండదండీ. చదువుంటే చక్కదనం ఉండదూ. హైద్రాబాదులోనే ఎన్నో సంబంధాలున్నాయి. నాకొక్కటి నచ్చలేదు. మా మేనమాను కూతురే ఓ అమ్మాయి ఉంది. చిన్నప్పుడొకసారి చూసాను. తోక ఒకటి తక్కువగా ఉంటుంది. మా వాళ్లంతా చేసుకోమన్నారు. కాని నేను ఒద్దుపొమ్మన్నాను. నా సంగతి విన్నారుకాదూ, ఏదోకాస్త ఉద్యమం అనీ, వైతాళిక సమితి అనీ, సమ్మేళనాలనీ..... ఏదో ఒక ఉద్యమం నడిపిస్తూ ఉండాలిసిందే కాని ఊరికే ఉండే ఘటం కాదు. ఇక తీరా చేసుకున్న తరువాత అవతలి మనిషి కూడా కాస్త మనకు సరిపొయ్యేటట్లుండాలెనా....."

ఏదో స్టేషనులో బండాగింది. ఎవరో తెలుగువాళ్లే మొగుడూ పెళ్లాము పిల్లల్తో వచ్చి ఎక్కారు. రాజా కొంచెం సర్దుక్కూచున్నాడు. రాధమాత్రం బెరుకు లేకుండానే ఆ వచ్చినవాళ్ల నడిగి ఒక చెంబు పుచ్చుకొని చూడండీ అక్కడ నల్లా ఉంది. మీరు కొంచెంతాగి నాక్కొంచెం తెచ్చిపెడుతారూ....?" అంది.

రాజా నీళ్లు తీసుకవచ్చాడు. ఇంతలో రాధ అక్కడికి వచ్చిన పూరీ, సేరూ కొని ఉంచింది. ఇద్దరూ ఫలహారం మొదలెట్టారు.

రాజా తల్లో ఆలోచనశకటాలు పరుగెత్తుతున్నాయి... "పాపం ఎప్పుడు తిన్నదో, ఏమో.....! ఐనా ముఖంలో ఇందాకటి దైన్యం కొంచెం తగ్గింది. ఇప్పుడు మనిషిలో కాస్త చురుకుదనం కూడా కనిపిస్తున్నది..... నేను కొత్తవాణ్ణే అయినా ఎవరికీ అనుమానం కలక్కుండా ఉండడానికేమో, ఎంతో చనువుగా ఉంటున్నది...? ఈ మోస్తరు"

షాదునగరంలో దిగి ఇద్దరూ బండిచేసుకొని వెళ్లి ఒక ఇంట్లో దిగి కావలసిన సామాన్లనీ కొద్దికొద్దిగా తెచ్చుకున్నారు.

మర్నాడు సాయంత్రం రాజా ప్రయాణం అయినాడు. కాని రాధ విచారంతో వేడుకుంది. "ఈ కొత్తవూళ్లో నేనొక్కదాన్నీ.... ఇంకో రెండు రోజులుంటే.... ఎల్లుండే మావాళ్లు పెట్టిన సుముహూర్తం అదయిపోతే మళ్లీ మనం ఇంటికి వెళ్లిపోవచ్చును."

నిజంగా రాజా కూడా వెళ్లలేకపోయినాడు. ఆ రాత్రి రాజాహృదయంలో చిన్నకదలిక కలిగింది. రాధ నడత అతన్ని చాలా ఆకర్షించేస్తున్నది. ఆమె మాటల్లోనూ, నడతలోనూ, ఎక్కువ అనురాగమూ, పరిపూర్ణమైన జాగ్రత్తా, సూక్ష్మ మైన

నాటి కథ

విధేయతా, తొలుకాడుతూ కనిపించేవి. ఆమె అంటే అతనికీ ఒక విధమైన అవ్యక్తభావం ఎక్కువౌతూ ఉన్నది. పాపం కష్టాల్లో ఉంది కదూ, సానుభూతేమో... ఏమో.... త్వరగా వెళ్లిపోతే బాగుండును.

నిద్రలేచేటప్పటికి రాధ ఫలహారమూ, కాఫీ తయారుచేసింది. చిన్న వయసే కాని చాలా రుచిగా ఉన్నయి. రాజా కొద్దికొద్దిగా సంకోచం వదిలిపెట్టి, అడిగివేయించుకోడం మొదలు పెట్టాడు.

"పాపం నా నుంచి మీకు చాలా కష్టం కలిగింది. అక్కడేమన్నా తొందరపనులున్నాయో ఏమో అంది రాధ కాఫీ కలుపుతూ.

"అంత చెడిపొయ్యే పనులేమీ లేవులెండి. వచ్చే శుక్రవారం నాడు కథక సమ్మేళనం ఉంది. దాని కందుకుంటే సరి. కష్టం మాత్రం ఏముంది నాకు. నాలుగు ఉపన్యాసాలిచ్చే కంటే, ఒక అబలను కష్టాల్లో నుంచి తప్పిస్తే మంచిదికాదా?"

గంభీరమయిన రాధ ముఖంలో నుంచి ఒక విశ్వాసంతో కూడుకున్న మందహాసం బయటికొచ్చింది. "నిజంగా ఆ కష్టసమయంలో మీరూ దొరికినందుకూ...మీలో యిన్ని ఆదర్శకోద్దేశాలు ఉన్నందుకూ.. ఆ భగవంతుడికి పదివేల నమస్కారాలు."

"అబ్బే, అట్టే పొగడకండి నాకు కష్టంగా ఉంటుంది. ఎలాగైనా మిమ్మల్ని నిర్విచారంగా ఇంటికి చేరిస్తే...."

రాధ సంతృప్త హృదయంతో వంటకు వెళ్లిపోయింది.

సాయంకాలం రాజా అక్కడక్కడ తిరిగి ఇంటికి వచ్చేసరికి రాధ తలంటి పోసుకొని క్రిందటిరోజే తెప్పించిన ఔరంగాబాదు తెల్లపట్టుచీర కట్టుకొని ఉతికి ఆరవేసిన పెద్ద పోలో కాలరు జంపరు వేసుకొని ఇంకా సొమ్మేమి పెట్టుకోకుండానే లోపలి వాకిట్లో పారిజాతం చెట్టుకింద చాపవేసుకొని జడ అల్లుకుంటూ కూచున్నది. రాజాను చూడాగానే లేచి స్వాగత సూచకంగా చిన్న మందహాసంతో "పూరుచూడడానికి వెళ్లారు కాబోలు, చాలా సేపయింది. ఏమయినా విశేషాలున్నాయా ఇక్కడ చూడదగినవి?" అంటూ పలకరించింది.

రాజా కోటూ చెప్పులూ విప్పి వచ్చి కూచొని "అట్టే విశేషాలేమీ లేవుకాని రెండు మూడు ఫర్లాంగుల దూరంలోనే చిన్నగుట్ట ఒహటుంది. దానిమీద కూర్చొని చుట్టూ ఉన్న మబ్బుల్నీ పొలాల్నీ చూస్తూ ఉంటే బాగా సాయంకాలమైపోయిన సంగతే తెలీలేదు" అన్నాడు.

"ఎక్కడానికి బాగా వీలుగా ఉంటుందా."

ఫరవాలేదు. ఒక మోస్తరుగా ఉంటుంది కొంచెం కష్టంగానే అయినా పైకి గనక వెళ్లితే.... మాలాంటి వాళ్లకి కాస్త మనోహరమైన దృశ్యాలు కనిపిస్తాయి.

'వంటయింది భోంచేద్దామా."

ఆ రాత్రి రాజాహృదయంలో పెద్ద తుఫాను రేగింది. "ఈ అమ్మాయి ఇదివరకు నేను భావన స్వప్నాల్లో తిలకిస్తున్నంత చక్కంది కాదుకాని ఎందుకో నన్ను ఆకర్షించివేస్తున్నది.. ఏమో గృహిణిగా ఉండటానికి ఈ చక్కదనం చాలదా ఏమిటి?.... ఐనా మనిషి నడకలో మంచి చక్కదనం ఉంది. మాటలు చాలా పొంకంగానూ, పొదుపుగానూ వాడుతుంది. వంట మహారుచిగా చేస్తుంది. సాయంత్రం చెవులకీ, ముక్కులకీ గూడా ఏమీ సొమ్ములు లేకుండా ఉంటే నిజంగా కళ్లల్లో కాంతి, చెంపల్లోవున్న స్నిగ్ధత్వమూ బయటబడ్డాయి. ఈ ఆడాళ్లంతా సొమ్ములూ, పూలూ, రంగు చీరలూ వదిలి పెడితేనేకాని అసలు అందమనేది వాళ్లలో కొంచమయినా ఉందా లేదా అనే విషయం తేలదు.... పెగా రాధకు నేనంటే ఎంతో ఇష్టం లాగా ఉన్నది. కాస్త బయటకి పోతే సరి. ఎంతో సేమయిఉండటుంది. కృతజ్ఞతేమో.. కాకపోయినా కష్టాల్లో నుంచి తప్పించడానికి తీసుకువచ్చి ఇప్పుడిలా అనుకోవడం..?"

సగం రాత్రయింది రాజాకు నిద్ర రాలేదు. రాధకు గూడా బహుశా నిద్ర రాకుండవచ్చు. లేచి రాధపడుకున్న వరండావైపు వెళ్లి చూచాడు.

రాధ నిర్విచారంగా నిద్రపోతూవున్నది. ఏ సుఖస్వప్నం చూస్తున్నదో ఏమో, పెదవుల్లో చిన్న మందహాసం, ముఖంలో సంతృప్తి, చెంపల్లో వికాసమూ తొలకాడుతూ వున్నాయి.

నిశ్శబ్దంగా రాజా తన గదిలో కెళ్లి పడుకొని ఆలోచనల్లో మునిగిపోయినాడు.

మర్నాడు సాయంత్రం రాధచేసిన క్యాబేజీ పకోడీలు ఫలహారంచేస్తూ రాజా "చూడాలని ఉంటే, ఇవ్వాళ నువుగూడా రా, రాధా! నిన్నటికొండ చూచి వద్దాము. చిన్న దేవాలయం కూడా ఒకటుంది అక్కడ, నీకు దేవుడు కావాలెనంటే" అన్నాడు.

ఇద్దరూ కాఫీ ముగించి



బయలుదేరారు. ఆ ఎగుడుదిగుడు కొండరాళ్లను, రాధ కూడా అనాయాసంగానూ, ఉత్సాహంగానూ పమిట బిగించి ఎక్కుతూఉంటే రాజాకళ్లు, కొత్త ఆశల్తో నిండిపోతున్నాయి. రేగిపోతూ ఉన్న ఆమె జుట్టూ, జారిపోతున్న ఆమె పూలు, అలిసిపోతూ వున్న ఆమె ముఖమూ రాజా భావాలను తేలగొడుతూవున్నాయి. ఆమెతో ఎక్కలేక అడుగడక్కీ, తానే వెనకబడి పోతూవచ్చాడు. ఇక పైకి పోలేక ఇద్దరూ పడమటి వైపున ఉన్న ఒక సమ ప్రదేశాన కూర్చున్నారు. అక్కడ నుంచి చూస్తూ చాలా దూరం దాకా పరుచుకొన్ని వున్న వరిమళ్లు పచ్చీసు గళ్లలాగా కనిపిస్తున్నాయి. అక్కడక్కడ కాపువాళ్లు స్త్రీ పురుష భేదం లేకుండా కలిసి పాటలు పాడుకుంటూ పనిచేసుకుంటున్నారు. ఉండటానికి కొంచెం దూరంలోనే వున్నా పంటచెరువు చూడ్డానికి కొండ కిందనే ఉన్నట్లుంది. నిర్మలంగా ఉండడంచేత రంగురంగుల పశ్చిమాకాశాన్నీ, అస్తమించబోతున్న రక్త సూర్యుణ్నీ ప్రతిఫలింపచేస్తున్నది. ఆ నిండుచేలల్లో గాలిపిల్లలు హృద్యంగా ఈల పాటలు పాడుతున్నాయి. ఆయాసంచేత కొంచెం తీవ్రంగా వస్తూన్న నిశ్వాసాలతో రాధ "చాలా హాయిగా వున్నదండీ ఇక్కడ. మీరు చెప్పిన మాటల్ని బట్టి ఏదో భావకవులకేగాని నాలాటి వాళ్లకేమీ బాగుండదేమోననుకున్నాను. కాని తీరా వచ్చి ఆ దృశ్యాల్ని చూస్తుంటే చెప్పలేనంత తృప్తీ హాయీ  కలుగుతూ ఉన్నాయి." అని సంభాషణ ప్రారంభించింది.

"నేనూ అలాగే అనుకున్నాను సుమండీ మొదట్లో. ఆ తెల్లని మేఘాలన్నీ కరుళ్లు కట్టి పాలసముద్రం ఇదేనా అనిపిస్తున్నాయి." అన్నాడు రాజా, రాధలో కూడా కొద్దిగా కళాపిపాస ఉన్నందుకు సంతృప్తిజెందుతూ.

ఐతే రాధా, "మరి మీ వూరు వెళ్లడం ఎపుడూ"

"వెళ్లాలి మరి త్వరగానే, డబ్బుకూడా అయిపోతున్నది".

"వెళ్లితే మరి మీ వాళ్లు ఏమీ అనకుండా ఊరుకుంటారా?"

"ఆ విషయం తలచుకోడానికే భయానకంగా ఉంది. కోప్పడుతారని నాకు పెద్ద భయంగా లేదుగాని మళ్లీ ఆ బండతనికే ఇచ్చే ప్రయత్నం చేస్తారని దిగులుగా ఉంది".

పాపం రాధకళ్లు మళ్లీ మొదటిరోజున లాగే దిగులుతో నిండిపోయాయి. రాజా హృదయం నీరయిపోయింది. తన రాధను వివాహం చేసుకుంటే ఇక చిక్కేమీ ఉండదు కాని తన మహదాశ యాలన్నీనో..... ఇంతకూ రాధ తన్నా ఉద్దేశంతో చూస్తున్నదో లేదో....?

ఆమె "ఏ ఐ.సి.యస్ ఆఫీసర్ని చేసుకుందామనుకుంటున్నదో!" రాధ తన హృదయ పరివర్తనాన్ని ఎంతవరకు కనిపెట్టుతున్నదో ఏమో గాని ముఖంలో మాత్రం ఏమీ కల్లోలం కనిపించడము లేదు. చివరకు రాజా ధైర్యంచేసి గొంతు సవరించుకొని చెప్పడానికి ఉపక్రమించాడు. " పోనీ రాధా! నీ కిష్టమైతే.... మీవాళ్లతో చెప్పి.... నేనే....మరి మన వివాహం... నీకిష్టమేనా..?

రాధ ఆకస్మికంగా 'షాకు' తగిలినట్టయి పోతుందనుకున్నాడు రాజా. కాని రాధ సామాన్యమైన ముఖంతోనే కొంచెం నిరాశకంఠంతో, "ఏం లాభం, మీకు మాత్రం వెయ్యీ, రెండువేలూ కట్నం మా వాళ్లెక్కడ నుంచి తీసుకురాగలరు.....?" అంది.

రాజా ఉద్వేగంతో కట్న మెవరిక్కావాలి, పిల్ల నాకు అన్ని విధాలా నచ్చాలి. నా కళోపాసనకు తోడ్పడాలి అని గానీ.... అసలు నీకు నేను తగినవాణ్ణో, కాదో..... చూసుకో...." అన్నాడు.

కళవరపాటేమిలేకుండానే రాధ స్థిరస్వరంతో "ఇప్పటికైనా మీకు నేను అర్హురాలినని తోస్తే.....?"

క్షణం ఆలస్యం చెయ్యకుండా రాజా ఆమెను వొళ్లోకి తీసుకున్నాడు. విజయగర్వంతో రాధ వణికిపోయింది. గుండెలు ఆగిపోతాయేమోన్నంత తీవ్రంగా కొట్టుకున్నాయి.  కళ్లు ఉద్రేకభాష్పాలతో నిండిపోయినాయి. రెండుచేతుల్తో రాజా తలను తన హృదయంలో చేర్చుకొని' కంఠాన్ని పెనేసుకపోయింది.

విజయధ్వజంలాగా పంచమిచంద్రరేఖ బయటికి వచ్చింది. తేలికబడ్డ హృదయాలతో ఇద్దరూ కిందికి దిగి వచ్చారు. ఆ మర్నాడు సాయంత్రం హైద్రాబాదు స్టేషనులో, రాజా రాధతో గూడా దిగేటప్పటికి, ఎందుకొచ్చారో తెలీదుగాని వాళ్ల వాళ్లంతా కనిపించారు. తన తండ్రి తమ్ముడూ ఇంకో పెద్దమనిషీ.. తెలుసు మేనమామే... మరో యువకుడూ... అవును మేనమామ కొడుకే... మరికొందరూ తమ పెట్టిదగ్గరకే వచ్చారు. తన కోసమేనేమో.....?

ఆశ్చర్యంతో చూస్తుండగానే ఆ మేనమామ దగ్గరకు వచ్చి, కొడుకు చేతుల్లోని చెంగేరి' అందుకొని, రెండుపూలహారాలు తీసి ఇద్దరిమెళ్ళో చెరొకటీ వేసి రాజాను గట్టిగా కావలించుకొని, "మారాజి ఇప్పటికి దారికి వచ్చావా?" అని, రాధను దగ్గిరకు తీసుకొని "ఇప్పటికి నీపట్టు నెగ్గించుకున్నావా! తల్లీ" అని బుజ్జగించి, "సరీగా ముహూర్తాని కందుకున్నారు" అన్నాడు.

రాజా విభ్రమంలో పడిపోయినాడు, "ఏమిటిది? తన మేనమామకూతురేనా! ఈ రాధ? ఈ రాధనేనా చిన్నప్పటి నుంచీ ఎంతమంది చెప్పినా చేసుకోనని కూచున్నది!! రాధ చేసిన పన్నాగమంతా అందరికి తెల్సిందేనా!! రాధ ఎంత మేధావి!! నిజంగా ఈ రాధే తన చేతినుంచి జారిపోయినట్టయితే.. తనంత నిర్భాగ్యుడు ఇంకోడుండడు!! విధాతకు కృతజ్ఞుణ్ణి"

రెండోనాటి సాయింత్రం రాజా వాకిట్లో ఈజీ చైర్లో కూచొని అభిలాంధ్ర కథక సమ్మేళనానికి పంపడానికి అఘటనాసంఘటితమైన తన వివాహాన్నే కథగా రాస్తున్నాడు.

వ్యాసం

# ఆపద సమయంలో “అవలోకనం”

స్త్రీ మేధావులకు సమయం లభిస్తే....



ఎ. ప్రతిభారత్న రాజ్యలక్ష్మి

మార్చిలో మొదలు కరోనా కవితలు రచనలు భీకర సాహితీరంగ పోరాట కసరత్తులు.

దైనందినమే దైన్యమై ప్రశ్నార్థకంగా మారి మనుషులు కుదుళ్ళలో కుదింపై పోయేంతగా బతుకు కుదేలయ్యింది. ఈ పరిస్థితిలో డైరీలేమి రాస్తారు అన్న ఆలోచన వచ్చుంటే ఈ సమీక్ష రాసే అవకాశమే లేదు.

ఈ మొత్తం కాలగమనంలో క్షణాలు నిముషాలయి, నిముషాలు గంటలూ రోజులయి,

అవీ ఆనవాయితీగా వారాలు పక్షాలు నెలలుగా సాగి సాగి దినచర్యలను కబళించే ప్రయత్నం విశృంఖలంగా తలలు విరబోసుకుని మరీ చేస్తుంటే ఓ జ్వాలా కీల ఎగసింది. ‘జ్వలిత’ రూపంలో మానవత్వం తలెత్తింది, గొంతు సవరించుకుని, వ్యాధి గణాంకాల మధ్య వేదనల రోదనల మధ్య ఓ సుధీర్ఘ ఆలాపన గళం విప్పింది.

ఈ రుగ్మయుగంలో రచయిత్రుల మనసుల పొరల్లో రాయబడుతున్న రాతలేమిటి? వైతాళికులైన సృజనకారులు చేతులు కట్టుకుని ఏనాడు నిలబడరు. పైగా నిలదీస్తారు. ఈ భీభత్సాన్ని అక్షరీకరించేందుకు తమ నైపుణ్యాలతో ఈ విశృంఖల విజృంభణని, దాన్ని కట్టడి చేసేందుకు, బాధితుల బాధలను సమాయత్తం అయ్యారు.

మనసుకు ఆశ్వాసమిచ్చి చిరునవ్వు తెప్పించే వినమ్ర ప్రయత్నమేదో చేస్తూనే ఉంటారు. రవి గాంచని చోటు కవి కాంచునన్నది పాత కాలం నుంచే వస్తున్న పలుకుబడి. ఇప్పుడూ అది ఫలవంతంగా పని చేస్తుంటుంది. ఈ రచయిత్రులూ కవయిత్రుల మనసు తెలుసుకోవడం వారిలో జరిగిన మథనం సాకారమై అక్షర రూపాన అందరికి అందించడం ముందు తరాలకొక వారసత్వపు పెన్నిధిని మాతృ భాషలో పేర్చిన పెన్నిధిగా ఆలోచనల అనుభవాల ఆరాట పోరాటాల చిలికిన మీగడ తరకల మైత్రీ భావంతో అందించడమే ఈ అవలోకనపు ముఖ్య ఉద్దేశ్యం అనిపిస్తుంది.

భీరుత్వం ఎక్కడా కనబడకపోవడం ఇందులో ఉన్న విశిష్ట లక్షణం. ఏకధాటిగా పొడిగింపబడుతూ లాక్డవును ఏడిపిస్తున్నదనుకుంటే, అయిన కాడికి అవకాశాలుగా మార్చుకుంటూ తాము జీవిస్తూ తమ కందుబాటులో ఉన్న రోగులకూ, వారి దగ్గరి వారికీ సాయమందిస్తూ, వారి ఇబ్బందుల తగ్గించే అవిశ్రాంత సేవలో నిమగ్నమయిన సోదరీమణుల దైనందిన దినచర్య ఈ కరోనాడైరీ పేజీలన్నింటా మనకు కళ్ళకు కట్టినట్టే కనబడుతుంది.

రచయితగా పరిణామాలను గమనిస్తు మనిషిగా ప్రతిస్పందిస్తూ అడ్డంకులనూ అధిగమిస్తూ ఆలోచన వివేకంతో ముందుచూపుతో రాబోయే సమస్యలను తీవ్రతల తగ్గింపజేస్తూ ఉపశమనాలనే ఉధృతంతో కార్యభూతంగా పాటుపడిన మహిళ మనకు ప్రతి డైరీ పేజీలో ప్రత్యక్షంగా సాక్షాత్కారమిస్తుంది.

ఇందులో రాసిన వారందరూ మహిళలే. వివిధ రంగాలలో పనిచేస్తూ అదనంగా రచనా వ్యాసంగం చేస్తున్న వారే ఎక్కువ మంది. ముఖ్యంగా ఉపాధ్యాయినులు అధిక సంఖ్యలో రాశారు. ప్రతి రచనలోనూ సమాజాన్ని జల్లెడ పట్టి మనలో దాగున్న స్వార్థపు వెకిలితనాన్నీ, వ్యాధి గ్రస్తుల పట్ల కొందరు ప్రవర్తించిన అమానవీయ కోణాన్ని వదలకుండా చూపిస్తూ, అవసరమైన సంస్కరణలు సవరణలు చేసి చూపించి తమ డైరీలో పేజీల భాగంగా అందరితో పంచుకున్నారు. అసహాయతలను వివరిస్తూ ఆదుకోగలిగిన అవకాశాలు మననం చేయడానికి ఉన్న ఆస్కారాల వైపూ దృష్టి సారించారు.

ముఖ్యంగా చూడగలిగింది, ఏ ఒక్క మహిళా, నైరాశ్యం వైపు దారి మళ్ళలేదు. కష్టాల పట్ల కన్నీరు రావడం సహజమైనా, ఓటమి విరక్తి ఏ ఒక్క పేజీలోనూ కనబడదు. తమ ఇక్కట్టైన పరిస్థితిని ఎదుర్కొన్న విధాలు, ఆ తహతహలో అనుభవించిన మానసిక వేదనలను

ధీరోద్ధాత్తంగా వెలికి అలవోకగా చెప్పిన వైనాలే కనిపిస్తాయి. నేటి సమాజంలో మహిళలు ఇంత పట్టుదల, గుండె ధైర్యాలతో జీవితపు ఒడిదుడుకులను ఎదుర్కొంటూ రాజీ పడకుండా సజావుగా పయనం సాగించడం చూస్తుంటే, గురజాడ వారి ధీమా నెరవేరినట్టే. ఇందులో రాసిన ప్రతి మహిళా 'ఆధునిక స్త్రీ చరిత్రను తిరిగి రాస్తుందని' అన్న గురజాడ వారి మాట గురి తప్ప లేదని నిరూపణే.

మగువ మనసు అతి నిగూఢమని అంటుంటారు. ఆడవారి మాటలకు అర్థాలు వేరనీ అంటారు. ఈ పుస్తకంలో రచించిన వారిని అలా మహిళా సగటు మూసలో పోసే అవకాశం లేదు. ధైరీతనంగా రాయడం వలన మాటలలో తమను తాము ఆ యుగాన నిర్వహించుకున్న తరహాలో నిజాయితీ వాస్తవిక వాదం. గడ్డు పరిస్థితులను సహనం, ఓపికలతో తాము ఎదుర్కొంటూ, తమ వారికి సాయపడ్డ సామాజిక నేపథ్యంలో నిష్ణాతులయ్యారనే సంకేతమే వస్తుంది.

ఈ పుస్తకం చదవడం మన బాధ్యత. ఆడవాళ్ళూ చీర షాపింగులని అస్తమానం ఎగతాళి చేసే మన సమాజం ఈ కాలంలో మహిళలు ఎంత చాతుర్యంగా ఎదురీదారన్న విషయం తేటతెల్లమవుతుంది.

ఇంకో ముఖ్య విషయం మన దేశాన సునామీ వచ్చింది అది ఒక్క రోజు చేసిన భీభత్సాన్ని అందరం ఎదుర్కొన్నాము. ఎలాంటి సంసిద్ధత లేని నేపథ్యంలో ఆ సందర్భాన్ని ఎదుర్కొన్నాము. కరోనా విశ్వాన్నంతటినీ కబళించే విధంగా విజృంభిస్తే సునామీ కొంత జనాభానీ సముద్ర తీర ప్రాంతాలనే అతలాకుతలం చేసింది. కొన్ని ప్రాంతాలే ఇబ్బందులకు గురైన కొన్ని గంటల భీభత్సం ఎన్నో జీవితాలను దెబ్బ తీసింది. బహుశా ఆ సందర్భంలోనూ ఇలాంటి సునామీ తాకిడి ఆరాట కెరటాలను నిక్షిప్తం చేస్తుంటే వేదనల వెతలు భావితరాలకు బలమై ఉండేది. రవి కాంచనిదీ కవి కాంచునని జారవిడుచుకున్న గతం తప్పిదమైతే ప్రస్తుతానికి అద్దం పట్టించిన ఈ అవలోకనం సమాజం గురించిన పారదర్శకమైన ప్రజారీతుల దర్పణమే.

చదవడం మంచి అలవాటు. ఇలాంటి సహజ స్పందనల కెరటాలనూ చదవడం గొప్ప సదవకాశం..

ఇందులో అంతా సకారాత్మకతేనా చేదెక్కడా లేదా అని పరిశీలిస్తే ఈ అవలోకనం పుస్తక రూప పురిటి నొప్పులు ప్రత్యక్షంగా చూసిన వ్యక్తిగా నాకనిపించినది. మనో సాగర మథనంలో వాట్సాప్ సమరాల ఆటుపోట్లు వాయిస్ మెసేజుల గర్జనలనే హాలాహలమే ముందు వచ్చినా వందల చేతులు 126 మనోస్థైర్యాల పటిష్టమైన చేతులు తమ మనో వీచికల కాంతులను లోకాని కందించే విజయకేతనాన్ని అంది పుచ్చుకున్నారు. పట్టుదల లక్ష్యంపై గురి తప్పని దీక్షగా సాగిన ఈ రచనలు సంఘటిత శక్తి విజయానికి తార్కాణాలు. దారిలో వచ్చిన అడ్డంకులు దూది పింజల్లా తేలిపోయాయి. మానవత్వం సమాజానికి పట్టిన చీడను ఎడమ చేత్తో తీసి వేస్తుందని కవరు పేజీలోనే స్పష్టపరచడంతో ఒక దరహాసరేఖతోనే పుస్తకం చదువు వారికి అవలోకనపు తలుపు తీస్తున్నది. మహిళల సాధికారత సావిత్రి బాయి పూలేతోనే సాకారమయిన విషయాన్నీ ప్రతీకిస్తూ ముఖచిత్ర మహిళ పూలేగారిని పుణికి పుచ్చుకున్నది. పైగా అటు చిన్నది మరీ పెద్దది కాకుండా చదవడానికి అనువైన అక్షరాల వరుసలు అందరినీ ఆహ్లాదకరంగా చదివించేస్తాయి.

**అతివల అవలోకనం...**

కరోనా కాలంలో ఏం చేసానంటూ ప్రారంభించిన అత్తలూరి విజయలక్ష్మిగారు ఎప్పుడో భూస్థాపితం అయిన అంటరానితనం ఆరోగ్యపు అవసరంగా దేవుడు మళ్ళీ తవ్వి తీశాడా అన్న సందేహం చెబుతూనే సాంకేతికలతో ఈ

**మగువ మనసు అతి నిగూఢమని అంటుంటారు. ఆడవారి మాటలకు అర్థాలు వేరనీ అంటారు. ఈ పుస్తకంలో రచించిన వారిని అలా మహిళా సగటు మూసలో పోసే అవకాశం లేదు. ధైరీతనంగా రాయడం వలన మాటలలో తమను తాము ఆ యుగాన నిర్వహించుకున్న తరహాలో నిజాయితీ, వాస్తవిక వాదం. గడ్డు పరిస్థితులను సహనం, ఓపికలతో తాము ఎదుర్కొంటూ, తమ వారికి సాయపడ్డ సామాజిక నేపథ్యంలో నిష్ణాతులయ్యారనే సంకేతమే వస్తుంది.**



వ్యాసం

సమయాన్ని సదుపయోగమూ చేసుకున్నామన్నారు. రోడ్లో అడ్డమున్న తాటి చెట్ల మీది నుండి గాలి పోయిన టైరును అందించి సాహసాలు చేయడం ఆత్మీయులను చేరడానికై అరుణజ్యోతిగారి అనుభవాలలో అలా మిగిలిపోతుంది. రాజ్యలక్ష్మి.ఎ గారి డైరీ లోనిదే "హా కరోనా అనకొండా చుట్టు పెట్టడం నుంచి అందరం తప్పించుకోవాలనే అహర్నిశం ప్రయత్నం "అందరి మనసులో స్థిరపడ్డ అత్యంత నిజమైన వాస్తవం. ఇంటికి ఎవరొచ్చినా బయట నుంచే పంపేయడం అసలు రావద్దని చెప్పేయడం అలవాటైందన్న కన్నేజు ఫణిమాధవిగారి మాటే మనందరి నోట. శుచి శుభ్రం అని పాత పద్ధతులు అలవాట్లు మళ్ళీ మొదలెట్టినా మనసులోని మాట "ఈ ప్రపంచం ఏం కాబోతున్నదన్న దిగులు" చల్లా సరోజిని దేవి మాట అందరి ఆలోచనల రింగారమే. రేపేమౌతున్నదని నిన్న నేడు వణకడమే.

జ్వలితగారి డైరీ గురించి అరపేజీకి పైగా రాయొచ్చును. ప్రతి రోజును పరీక్షార్థకంగా ఎదుర్కొంటూ అదే సమయం ప్రతి రోజు చివరాఖరు రోజే మోనని రేపు రాకున్నా ఆ పని నేడే పూర్తి చేయడానికి ఉద్యమించి ధీరత్వాన్ని చూపి మరో 125 చేత డైరీ రాయించి మరీ పట్టు సాధించారు.

స్రవంతి ఈ తరపు మహిళ. ఈ రుగ్మ యుగం age of limbo అని తీర్మానించి ఆఫీసు కెళ్ళే సాహస ప్రయత్నంలో అసలు ఎందుకు వెళ్ళారో కూడా మరిచేంతగా ఉన్న అయోమయ పరిస్థితి. ఇంకో వైపు అసలు లక్ష్యపెట్టని వితండవాదులు భయం భయంగా అడుగులేస్తున్న ఆలోచనాపరులు ఇరువర్గాల విధానంలో నిర్ణయాలు తీసుకున్నా కరెక్టే... తీసుకోకున్నా కరెక్టే అని సగటు మనుషుల అగమ్యగోచరతని పట్టేసి రాసిన స్పష్టత. ముఖ్యంగా అన్ని విషయాలలో యువతను ముందుకు నడిపే పెద్దలూ పిల్లల్లాగే కనుక్కుని తెలుసుకొనే రీతిలో అందరూ ఒకే పరీక్ష ఏక కాలంలో రాస్తున్నామని అందరికీ కొత్తే అన్న నిజం నిర్దిష్టంగా రాసేసింది.

అడువాల సుజాతగారు "అందరినీ కష్టపెడుతున్న కరోనా దాడీ అస్సలు కనబడకుండా పోతే బాగుండు" ని చల్లటి మాట. అమృత లతగారు ఎంతో మందికి గడ్డు పరిస్థితులలోంచి సాయపడినా దగ్గరి వ్యక్తులు వ్యాధిగ్రస్తులవడం వలన చేదు అనుభవాల గాయం, వేదన పంచుకున్నారు.

డా॥ తిరునగరి దేవకీదేవిగారు మనందరం ఎదుర్కొంటున్న సంక్లిష్టమైన సందర్భాలను చక్కగా కళ్ళ ముందుంచి వలస బడుగు జీవితాలకొక మంచి పరిష్కారానికి సమాజం పూనుకోవాలని ముందుచూపు సలహాలతో పెద్దరికపు పాత్ర నిర్వహించారు.

డా॥ దేవేంద్ర మారోజుగారు ఎంతో పరిణితితో తమ సాహిత్య ప్రస్థానం సాగించినా ఎక్కడో అభద్రతాభావం వెంటాడిన ఎన్నో క్షణాలను గుర్తు చేసుకున్నారు.

తులసి గుగులోతుగారు నిత్యం పక్కవారిపై ఏడ్చే మనం "అందరూ బాగుండాలి అందులో మనం ఉండాలి" అనుకునేంతగా ఎదిగామంటుంటే ముచ్చటేస్తుంది..

నాంపల్లి సుజాతగారు 'విపత్కర పరిస్థితికి అద్దం పట్టి రేపటి చరిత్రకు ఓ సాక్షిభూతంగానే ఈ డైరీ రాసుకున్నారు. అయినా నా నగరం మౌనదుఃఖిత అంటూ కవితాక్రోశంతో నిస్సహాయతను పంచుకున్నారు.

డా॥ మమత రఘువీర్ గారు సమాజపు స్వార్థ కోణం వైపు ఫోకస్ చేసి ఈ విపత్కర పరిస్థితులను అవకాశంగా తీసుకుని సడి చప్పుడు లేకుండా పెరిగిపోయిన బాల్యవివాహాలు వాటి నుంచి అమ్మాయిలను కాపాడడం అన్న సమస్యనూ ఎదుర్కోవడం గురించి రాసి వింత పరిణామాలను వివరించారు.

నెల్లుట్ల రమాదేవిగారు ఒక బాంకర్గా ఈ రుగ్మ యుగంలో సమాజాన్ని అధ్యయనం చేసి స్వచ్ఛందం గానూ సేవ చేయడం మనతో పంచుకున్నారు.

పెద్దపల్లి తేజస్విగారు గానం చేసి వైరలైన జ్వలిత గారి పాట బడులు లేకా తిండిలేక గురించి తమ అనుభవం పంచుకున్నారు.

యడవల్లి సుజాతగారు అచ్చంగా తేదీల ప్రకారం దినచర్య రాసి ఎక్కువగా ప్రేమించే తన గుణం ఓ మార్చుకోవలసిన అంశం అన్న తీర్మానం చేసుకున్నారు.

రమాదేవి బాలబోయినగారు ఈ సమయంలో జీవితపు ఒడిదుడుకులను లోతుగా పరిచయం చేసిన కాలపు కాఠిన్యతకు అద్దం పట్టారు.

వనపర్తి పద్మావతిగారు ఈ చిక్కు పరిస్థితుల వలన కుటుంబ సభ్యులకు తమ ఆత్మీయులతో అవగాహన పెంచుకునే అవకాశం ఇచ్చి మనుషులను దగ్గర చేసే మేలైతే చేసిందన్న ఊరటను వ్యక్తపరిచారు.

శైలజా మిత్రగారు స్వార్థపు చీకటి కోణాలను చెప్పుకొస్తూ "ప్రతిరోజూ ఓ కొత్త పుట్టుకలా భావించేంతగా" కలవరపరిచిందని వేదన వ్యక్తపరిచారు.

డా॥ ప్రతిమారాజ్ వైద్యరంగపు అనుభవాలు పంచుకుంటూ భయాలు పోగొట్టే దిశగా ధైర్యం చెప్పారు.

సిస్టర్ అనసూయగారు ప్రతి మనిషిలోని భావన్నీ ప్రతిఫలిస్తూ "ఇలాంటి వైరసులు ఇంక ఎన్నడూ ఈ భూమి మీదకు రాకూడదని" కోరుకున్నారు. అదే విశ్వమంతటా అందరి కోరికా, ఆశ.

ప్రత్యేకమైన అంశంగా చదవడం రాయడం రాని వారి అభిప్రాయాలు మనసులోని మాటలు సేకరించడం వారు సామాజిక స్ఫూర్తి ఇబ్బందులను వివేకంతో అర్థం చేసుకున్నారనే అర్థమవుతున్నది.

ఈ పుస్తకాన్ని తడుముతుంటే కన్నీళ్ళ మధ్య వెన్నెల వెలుగులూ దోబూచులాడి అదో ఆశల జాబిలి అలవోకగా అందుతుందన్న నమ్మకం నికార్సుగా దొరుకుతుంది. అన్ని గ్రంథాలయాలలోను అవశ్యం అందుబాటులో ఉండాల్సిన అందరు తీసుకుని చదవాల్సిన పుస్తకం.

## మహంతమ్మ గారి పద్యం
**(క్రీ.శ. 1833 ప్రాంతం)**

శ్రీ సదాశివచిత్త సరసిజవాస గురు నందీశ్వరా
వాసవాది గిరీశ సన్నుత దాసపాలక శ్రీకరా
వ్యాస భుజయుగ వార్ధి కుంభజ యీశ భువనాధీశ్వరా
బాసుర ప్రద బోరళా చలమందిరా బసవేశ్వరా

## సోమరాజు ఇందుమతాబాయిగా పద్యం
**(1910, 1915 - 1984, రుద్రాక్షపల్లి, ఖమ్మం జిల్లా)**

శా॥ ఆచారమ్ములలంకృతమ్ములు స్తుతి వ్యాపారముల్ నేటివా
ప్రాచీనంబుల నిండి కొన్నవి సమార్థ వ్రతంబందునన్
హా చైతన్య కళాస్వరూపిణి త్రిలింగోర్వీ సుమారామముల్
బూచెన్ గా విధురాన నేందు మధు సంపూర్ణ ప్రవాహంబునన్

## రూప్ఖానుపేట రత్నమ్మ గారి పద్యం
**(1847-1929, రంగారెడ్డి జిల్లా, పరిగి, ఇప్పటూరు)**

కం॥ తరుణీకృత పాండిత్యము
స్థిరమూ యీ మాటలను ఛేదింపకుడీ
హరియాజ్ఞగాక నాకీ
కరణి యుపన్యాస మొసగు జ్ఞానముగలదే

## జ్ఞానాంబ గారి పద్యం
**(1930వ దశకం, ఖమ్మం)**

మ॥ నిను బద్యంబుల బాటలన్ గృతులతో నిక్కంపు సద్భక్తియై
వినుతిన్ జేసెద నీ కరంబులను హృద్వీథిన్ దగన్ జేర్చి మా
నిని నే నన్ను నమాన మౌ కరుణ నెంతేజూచి పోషింపునా
తనువున్ బ్రాణము నీకె యర్పితము నాథా సూర్యనారాయణా!

వ్యాసం

# ప్రశ్నించే గొంతుకలు

ప్రశ్నించే గొంతుకలను
కాపాడాలంటున్న రచయిత్రి...



గోగు శ్యామల

ప్రపంచంలోని ఏ దేశాన్ని పరిశీలించినా అవి వివిధ అసమానతలకు, అణిచివేతలకు అతీతంగా లేవనే చెప్పాలి. వేగంగా దూసుకుపోతున్నప్రపంచ మానవాళి యొక్క జీవన శైలి ఈ అసమానతలు అణిచివేతలు అనే స్థితిని ఏమరపాటుగా యాది మరిచిపోవచ్చును. కానీ ప్రతి యాడాదిలాగే ఈ ఏడు నిర్వహించుకుంటున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవం అసమానతలను గుర్తుకు తెస్తుంది అనడంలో ఏమాత్రం సందేహం లేదు. అంతేకాదు ప్రపంచ వ్యాప్తంగా నెలకొని ఉన్నస్త్రీల సమస్యలను, వారి పోరాటాలను, విజయాలను, వైఫల్యాలను అంతర్జాతీయ మహిళాదినోత్సవం బేరీజు వేస్తుంది కూడ. అంతే కాక ఆయా ప్రజా సమూహాల, ముఖ్యంగా మహిళా సమూహాల ప్రాతినిధ్యాలను, ప్రతీకల ప్రాధాన్యత ఆధునిక సమాజాలలో వాటికి ఆవశ్యకతను తెలియ జెపుతుంది.

మరో వైపు 'ఒక పక్క అభివృద్ధి- మరోపక్క అసమానత ' అనే పొసగని స్థితి. ఈ స్థితి మనుషుల మధ్య కావచ్చు, మరియూ మానవాళి ప్రకృతికీ మధ్య కావచ్చు. ఈ ఫలితంగా ప్రపంచంలో వివిధ ప్రతికూలతలకు మరియూ అసమతుల్యతలకూ దారి తీసిన గడ్డ స్థితులనుండి ఇంకా బయట పడలేదన్నది అందరికీ అనుభవమే.ఈ నేపథ్యంలో 'పరిమిత మైన గొంతులే అయినప్పటికీ అవి ముఖ్యమైనవి, సమర్థ వంతమైనవి' అనే ఉద్దేశంతో ఈ వ్యాసంలో వివరించడమైంది.

ప్రపంచ వ్యాపితంగా ముందుకొచ్చిన రకాల పోరాటాలు, ప్రయత్నాలు అనేకం ఉన్నాయి. అవి సమూహాల నాయకత్వం గానో, వ్యక్తుల నాయకత్వం గానో నిర్వహిస్తూ నిరంతర చలనశీలత స్వభావాన్ని కలిగిన పోరాటాలు చరిత్రలో రాయబడ్డాయి. అవి ఒక వ్యక్తి భద్రత కాడి నుండి సమాజ భద్రత వరకు నడిచిన పోరాటం కావచ్చు, కొత్త రాష్ట్రాన్ని సాధించుకున్న ఉద్యమం కావచ్చు, పర్యావరణ పరిరక్షణ పోరాటం కావచ్చు, రాజ్యాంగ హక్కుల పరిరక్షణా ఉద్యమం కావచ్చు. రాజ్యాంగం ప్రకారం పాలించే గొప్ప నేతను తమ ఓటు ద్వారా ఓడించడం కావచ్చు, రాజ్యాంగాన్ని ఉల్లం ఘించే నేతను తమ ఓటు ద్వారా ఓడించే పోరాటాలు కావచ్చు. విద్య, జ్ఞానం, ఉద్యోగాను ఆర్జించే యుద్ధం లాంటి ప్రయత్నాలు కావచ్చు. దీనమైన కడు పేదరికంలో ఒక వ్యక్తి ఆత్మ గౌరవంతో నిలబడగలిగే వెసులుబాటు ఉండే సమాజం కోసం కావచ్చు. పైన పేర్కొన్న లేమిలతో పుట్టుకొచ్చే వివిధ అసమానతలు సమాజాన్ని వైరస్ ల మాదిరిగా పీడిస్తున్న తీరును చూస్తున్నాం. అవి వర్ణ కుల జండరు ప్రాంతం మత అసమానతలు ఇందులో భాగమని చెప్పాలి. ఈ పోరాటాలన్నింటిలో సమాజంలో సగభాగమైన స్త్రీల యొక్క విద్య, విజ్ఞానం, ప్రాతినిధ్యం, సాధికారత అనేవి కచ్చితమైన ప్రాతిపదిక అయినపుడు, ఆయా దేశాల రాజ్యాంగా లలో భాగంగా కొనసాగుతాయి గమనించాలి.

ఈ నేపథ్యంలోనే మన భారతదేశ రైతుల పోరాటాన్నిపేర్కొన వచ్చు. మొత్తం దేశంలోనే వివాదస్పదమైన మూడు చట్టాలను కేంద్ర సర్కారు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్న రైతుల పోరాటమది. వేలాది మంది రైతులు తమ కుటుంబాలతో సహా దేశ రాజధాని ఢిల్లీలోని రహదారులపై శాంతి పోరాటాన్ని నడుపుతున్నారు. అంతర్జాతీయ మీడియా ఈ పోరాటాన్ని ప్రపంచ ఖ్యాతి గాంచిన పోరాటం అని పేర్కొనడం విశేషం, సముచితం కూడ. కారణం ఈ పోరాటం ఎంతో విలక్షణమైంది, వైవిధ్యమైనది మాత్రమే కాదు అన్ని శ్రేణుల ప్రజా సమూహాలను కలుపుకోగల, కలుపుగోలుతనపు

వ్యాసం

తత్వమున్న పోరాటమిది. ఇప్పటిదాక భారత చరిత్రలో జరిగిన పోరాటాలు వేరు ఇప్పటి రైతులు చేస్తున్న పోరాటం వేరు. వీటి మధ్య అంతగా పోలికలు లేవనే చెప్పాలి. అంతే కాదు, పోరాటం, ఆందోళన అనేపేర్లకు నేటి ఢిల్లీ రైతుల పోరాటం కొత్త నిర్వచనం ఇచ్చిందని చరిత్ర కారులు అభిప్రాయం పడుతున్నారు. ఈ పోరాటంలో ఉన్న వేలాదిమంది రైతు పురుషులతో పాటు వేలాది మంది రైతు స్త్రీలు ఉన్నారు. ఆ రకంగా రైతు కుటుంబ జీవనాన్ని ఢిల్లీ రోడ్లపై పోరాట రూపంలో నెలల తరబడి కొనసాగిస్తున్నారు వారు. ఆ రకంగా వ్యవసాయ కుటుంబ జీవన నాగరికతను కేంద్ర పాలకుల కనుల ముందు దృశ్యీకరిస్తున్నారు.

ఇప్పటి వరకు మనం భారత చరిత్ర పుస్తకాల్లో నదీ నాగరికతని, పట్టణ నాగరికతలను చదువుకున్నాం. ఇపుడు మాత్రం వ్యవసాయనాగరికతని చదువు కోవాల్సి వస్తుంది అని కూడా సూచిస్తు న్నారు. ఇక ప్రతీకలు విషయానికొస్తే, ఈ పోరాటం లోని వేలాదిమంది రైతు స్త్రీలు దేశంలోని కోట్లాది మంది స్త్రీలకు ప్రతీకలుగా నిలిచారనే చెప్పాలి. ఈ కుటుంబాలని స్త్రీలని కులానికి మతానికి ప్రాంతానికి అతీతంగా తమలోని వారిగా భావిస్తున్న అనేక మంది నేటి యువత దిశారవి, నవదీప్ కౌర్ వంటి వారు తమ గొంతెత్తి ఈ ఉద్యమానికి తోడ్పడడం ఇందులో భాగమే. ఇది నేటి విషయం ఐతే రాజకీయ ప్రాతినిధ్యం వహిస్తున్నయువ మహిళ నేతల పాత్ర ఈ ఉద్యమానికి ఎంతో తోడ్పడుతున్న విధానం ఎంతో ముఖ్యమైంది. వ్యవసాయ వ్యతిరేక చట్టాలకు విరుగుడు అయ్యే అంశాలను నాలుగు సంవత్సరాల క్రితమే తన ప్రసంగంలో లేవనెత్తిన నేటి తరం నేత కల్వకుంట్ల కవితగారు. తాను యంపీగా పార్లమెంటులో చేసిన ప్రసంగంలో వ్యవసాయ వృద్ధికోసం, రైతుల మద్దతు ధరను ప్రాముఖ్యతనిస్తూ నిధులు కేటాయించాలని ప్రతిపాదించారు. వీటితో పాటు తెలంగాణలో రైతులకు పసుపు బోర్డు, భారీనీటి ప్రాజెక్టులకు, నదుల పరిరక్షణకు ప్రాధాన్యత నివ్వాలనే అంశాలను లేవనెత్తారు కవిత గారు. వ్యవసాయానికి కావాల్సిన సానుకూల విధానాలను నిర్లక్ష్యం చేయడం వల్లనే ఈ రోజు అన్నదాతల కుటుంబాలు రోడ్డుమీద కాపురాలు చేయాల్సిన దుస్థితి.

పార్లమెంటులో అనేక వర్తమాన అంశాలను హేతుబద్ధ తర్కంతో నికార్సైన వ్యక్తీకరణ చేస్తూ కనిపించే నేటి మరో నేత మోహువా మొయిత్రా. షాహిన్ బాగ్ మహిళల, ఢిల్లీరైతు మహిళల గొంతుకై పార్లమెంటులో ఇప్పటికీ సింహ ధ్వనులు వినిపిస్తూనే ఉన్నారు మోహిత్ర. తెలంగాణలో కరోనా మహమ్మారి గడ్డ సమయంలో అడవుల్లో ఆదివాసీ మహిళల



గొంతుగా ములుగు ఎమ్మెల్యే సీతక్క విజయవంతంగా నిలిచారు.

మరో వైపు ఆసక్తి కరమైన అంతర్జాతీయ యువ కవయిత్రి గొంతును మనం వింటున్నాం. ఈ మధ్యనే గెలిచిన అమెరికా అధ్యక్షుడిని సన్మానించుకోవడంలో భాగంగా జరిగిన మహాసభలో అమండా గోర్డాన్ వ్యక్తీ కరించిన మాటలివి 'నాకు నేటి ప్రెసిడెంట్ డే గొప్ప రోజు. నేను ఈ సమయం కోసం ఎప్పటినుండో ఎదిరి చూస్తున్నాను. ఇప్పుడు వచ్చింది. మేం ఈ దేశ వాసులం. ఒక సన్నగా ఉన్న నల్లజాతి అమ్మాయి. బానిసల నుండి వచ్చిన ఒంటరి తల్లి చేత పెరిగిన నాలాంటి అమ్మాయి, ఈ దేశ అధ్యక్షురాలు కావాలని కలలు

**ప్రపంచ వ్యాపితంగా ముందుకొచ్చిన రకాల పోరాటాలు, ప్రయత్నాలు అనేకం ఉన్నాయి. అవి సమూహాల నాయకత్వం గానో, వ్యక్తుల నాయకత్వం గానో నిర్వహిస్తూ నిరంతర చలనశీలత స్వభావాన్ని కలిగిన పోరాటాలు చరిత్రలో రాయబడ్డాయి. అవి ఒక వ్యక్తి భద్రత కాడి నుండి సమాజ భద్రత వరకు నడిచిన పోరాటం కావచ్చు, కొత్త రాష్ట్రాన్ని సాధించుకున్న ఉద్యమం కావచ్చు, పర్యావరణ పరిరక్షణ పోరాటం కావచ్చు, రాజ్యాంగ హక్కుల పరిరక్షణా ఉద్యమం కావచ్చు.**

కంటుంది'. అని చెప్పిన ఈమె మాటలు అమెరికాతో సహా అనేక దేశాల్లోని తల్లులు వారి పిల్లలకు గొంతుకగా నిలిచింది.

చదువు ఉద్యమానికి గొంతుకగా స్థిరపడిన మలాల యూసప్జాయి. 'ఒక పెన్ను ఒక పుస్తకం ప్రపంచాన్ని మార్చేస్తుంది' కనుక ప్రతి బాలిక ప్రతి బాలుడు తప్పకుండా చదువుకోవాలి' అని నినదిస్తున్న నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మలాల యుసఫ్జాయ్ ప్రపంచ వ్యాపితంగా విస్తరించి ఉన్న చదువుకు దూరంగా విసిరేయబడి విద్య విజ్ఞానం కోసం తపించే యువ ప్రపంచానికి ప్రతీకగా నిలిచింది మలాల.

ప్రపంచ వ్యాపితంగా, గ్లోబల్ స్థాయి నుండి లోకల్ కుగ్రామం స్థాయి వరకు ప్రతి రంగంలో అవసరమైన ప్రతి సందర్భంలో, సర్వ రంగాలలో, సర్వ వృత్తుల లో మహిళలు సమర్థవంతమైన పాత్ర పోషిస్తున్నారు. ఇక పోతే ప్రజల, యువత, మహిళల ప్రతీకలుగా నిలుస్తున్న ప్రాతినిధ్యపు గొంతుకలను రోజు రోజుకు పెంచుకోవడం, వాటిని కాపాడుకోవడం అనే ఆవశ్యకతను యాదికి చేస్తుంది నేటి అంతర్జాతీయ మహిళా దినోత్సవం.

కథ

# చివరి వలస

మానవ సంబంధాల్లోన్ని
అనివార్యతను చిత్రించే కథ....

డా॥ సి. భవానీదేవి

"సుజాతా! సుజాతా!" హడావుడిగా లోపలికి వస్తూనే పిలుస్తున్నాడు శంకరం. వంటింట్లో పనిలో ఉన్న సుజాత భర్త కేకలు విని హాల్లోకి వస్తూ...

"ఏంటండీ అంతా హడావుడి? తిరగమోత మాడిపోతుంటే.." చిరు కోపం ప్రదర్శించింది.

"అలా అంటే ఎలానోయ్! ఇంక నువ్వు సర్దుకోవటం మొదలుపెట్టాలి" హుషారుగా అన్నాడు.

"ఎక్కడికి.. ఓ .. టిక్కెట్స్ వస్తున్నాయా!. ఎటూ వీసా వచ్చిందిగా" కొడుకు దగ్గరికి వెళ్లబోతున్నానన్న ఆనందం సుజాత కళ్ళనిండా పొంగిపొరలుతోంది.

"అదే మరి. అందుకే ఇంత హడావుడి.. ఎదురుచూస్తున్నావుగా.. వచ్చేశాయి సారథి.

"నీ కొడుకు టిక్కెట్స్ పంపాడు. మన ప్రయాణానికి ఇంకా రెండు నెలలే ఉంది. కొడుక్కి, కోడలికి, మనవాళ్ళకి ఏమేమి తీసుకెళ్లాలో లిస్ట్ చేసుకుని సర్దుకోవటం మొదలుపెట్టు మరి."

"ఇంట్లో ఉన్నవి సర్దుకోవటం ఎంతసేపని. సాయంత్రం ఆ పెద్ద సూట్ కేసులు కిందకి దించండి. ఒకసారి జిప్‌లు చెక్ చేస్తాను. ఇంకా చాలా షాపింగ్ పనులున్నాయి." అన్నది సుజాత మురిసిపోతూ. కొడుకు మీద ప్రేమతో కళ్ళు చెమ్మగిల్లుతున్నాయి.

"వాడికీ కోడలికీ ఇష్టమయిన స్వీట్స్.. అవీ వెళ్ళే ముందురోజు కొందాము. అసలే ఆ పిల్ల పట్టిమనిషి కూడా కాదు. రాత్రికి వాడు ఫోన్ చేసినప్పుడు అడుగు. ఇక్కడి నుంచి ఏమేమి కావాలో చెప్పమని..."

"అదా... మనకేం కొత్త కాదుగా.. ఇప్పటికి ఎన్నిసార్లు వెళ్లలేదు.. అన్నీ నేను చూసుకుంటానుగానీ మీరు మనిద్దరికి ఆరు నెలలకు మందులు తీసుకోండి. ఒకసారి ఇద్దరం జనరల్ చెక్ అప్ చేయించుకుందాము. అక్కడికి వెళ్ళి జబ్బు పడితే వాడికి ఇబ్బంది. పైగా మనకి ఇన్సూరెన్స్ సౌకర్యం కూడా ఉండదు." ఆలోచనగా అంటున్న సుజాత కేసి సానుభూతిగా చూశాడు శంకరం.

కొడుకు సాఫ్ట్ వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగంలో ప్రవేశించినప్పటి ఉత్సాహం ఇప్పుడు తమ ఇద్దరిలో తగ్గిపోయిందని ఇద్దరికీ తెలుస్తూనే ఉంది. సారథి అమెరికా వెళ్ళినప్పుడు తొలిరోజుల్లో సుజాత బంధువులందరికీ పార్టీ ఇచ్చి ఎంత సంబరపడిపోయిందో! ఇప్పటికీ ఆ దృశ్యాలన్నీ కళ్ళ ముందు కదలాడుతున్నాయి.

"ఏంటే సుజాతా.. ఒకగానొక్క కొడుకునీ అమెరికా పంపిస్తున్నావు. ఒకసారి అక్కడికి వెళితే ఇంక తిరిగి ఇండియాకి తిరిగి రావటానికి ఇష్టపడరు. ఆలోచించుకున్నావా?"

సుగుణ పిన్ని నవ్వుతూనే అడిగినా ఆ మాటల్లోని జీవితసత్యం ఇప్పుడు బాగా అనుభవంలోకి వస్తున్నది సుజాతకి.

"ఎందుకు రాడు పిన్నీ.. మాకు ఉన్నది వాడొక్కడేగా. అమెరికా వెళ్ళటం వాడి కల. తోటివాళ్ళందరూ వెళ్తున్నారు. వీడికీ అక్కడ ఉండే యోగం పెద్ద జీతంతో వచ్చింది గదా. ఎలా వదులుకుంటాడు. మనదేముంది పిన్నీ. ఇవ్వాళ ఉండి రేపు రాలిపోయేవాళ్ళం. వాళ్ళ కెరియర్ ముఖ్యం కదా. అందుకే వెళ్ళమన్నాను. వాడి చదువుకు తీసుకున్న బ్యాంక్ లోన్ తీర్చి కొంత సంపాదించుకుని తిరిగి వస్తానన్నాడు."

సుగుణ పిన్నికయితే ఏదో సమాధానం చెప్పింది కానీ సుజాతకు లోలోపల దిగులేసింది. పిన్ని అన్నట్లు సారథి తిరిగి రాకపోతే..?

ఎందుకు రాడు? తల్లిదండ్రులంటే వాడికి ఎంత ప్రాణం? అలా లేనిపోని అనుమానాలు పెట్టుకుని వాళ్ళ భవిష్యత్‌ని పాడుచేసే హక్కు తమకు లేదు. అన్నింటికీ ఆ శ్రీనివాసుడే ఉన్నాడు. మనసును దిటవు చేసుకుంది.

ఏయిర్‌పోర్ట్‌లో సారథికి వీడ్కోలు చెప్తున్నప్పుడు సుజాత కన్నీటిని దాచుకోలేకపోయింది.

సారథి తల్లిని అక్కున చేర్చుకుని

కన్నీరు తుడుస్తూ ధైర్యం చెప్పాడు.

"ఎందుకమ్మా అంతా దిగులు పడతావు. ఎమ్.ఎస్. అయిపోగానే వస్తాను. వీడియో కాల్స్‌లో మనం చూసుకుంటూ మాట్లాడుకోవచ్చు. ఎదురుగా ఉన్నట్లే ఉంటుంది. మా ఫ్రెండ్స్ చాలామంది ఉన్నారు. మామయ్య కొడుకు జగదీష్ కూడా ఉన్నాడని నీకు తెలుసు కదా. ఏమీ భయం లేదు. నువ్వు నాన్నగారు ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోండి. సెక్యూరిటీ చెక్‌కి పిలుస్తున్నారు. వస్తానమ్మా.. నాన్నగారూ వస్తాను. బై.." అంటూ హుషారుగా కదిలి వెళ్తున్న సారథికేసి తడికళ్ళతో చూస్తుండి పోయింది సుజాత.

మనసు నిండా సారథి జ్ఞాపకాలు ముసురుకుంటుంటే భారంగా ఇల్లు చేరారు ఇద్దరు.

కొన్నాళ్లదాకాకా సుజాత చాలా డల్‌గా ఉంటుండేది. శంకరం చాలా అనునయించిన మీదట క్రమంగా ఆ జీవితానికి అలవాటు పడింది. సారథి శని, ఆది వారాలలో చేసే వీడియో కాల్స్ కోసం వారం అంతా ఎదురు చూసేది. సారథి ఫోన్ చేస్తే ఎన్నెన్ని కబుర్లు చెప్పేది!. అప్పుడు సుజాత మొహం మతాబాలా వెలిగి పోయేది.

ఒక్కగానొక్క కొడుకుని దూరం పంపించేశాననుకుంటూ దిగులు పడుతూనే సరిపెట్టుకుంటూనే సారథి ఎమ్. ఎస్ పూర్తయింది. ఇక కొడుకు పెళ్లి గురించి ఆలోచించటం మొదలయింది. సంబంధాలు చూడటం మొదలు పెట్టారు. కానీ తనకే ఏదీ సరిగా నచ్చటం లేదు. సారథి లాంటి బంగారు తండ్రికి భార్య అయ్యే అమ్మాయి ఎలా ఉండాలి మరి.

ఒక ఏడాది గడుస్తున్నది. వచ్చే డిసెంబర్‌కి కొడుకు వచ్చేనాటికి ఐదారు సంబంధాలను రెడీగా ఉంచింది సుజాత. ఈసారి వాడికి పెళ్లి చేసి పంపాలి, అని గట్టిగా నిర్ణయించుకుంది.

ఒకరోజు సారథి పిడుగులాంటి వార్త చెప్పాడు. అక్కడ ఒక అమ్మాయిని ప్రేమించాడట. ఇద్దరూ రిజిస్టర్ మ్యారేజీ చేసుకున్నారట. అటూ ఇటూ పెద్దలకి చెప్పకుండా చేసుకోటానికి కులాంతరమే కారణం అంటూ తల్లిదండ్రుల్ని క్షమించమని పదే పదే కోరుతూ కోడలు వందనని తెగ పొగిడాడు.



సుజాత హతాశు రాలైపోయింది. ఏమనగలదు. అడ్డాలనాడు బిడ్డలు గానీ గడ్డాలు వచ్చాక కాదు అని మరోసారి రుజువైంది అనుకుంది.

అలాగని శంకరానికి బాధ లేదని కాదు. తాను బయటపడితే సుజాత ఇంకా డీలా పడుతుందని భార్యకి ఈ తరం ఇంతేనంటూ మాటలు చెప్తూ సమాధానపరిచాడు.

సుజాత కూడా సారథి చేసిన పనికి బాధపడుతూనే పైకి ఏమి అనటం లేదు. కానీ బంధువులముందు జవాబు చెప్పుకోలేక అవస్థలు పడుతోంది.

ఇంకా సారథి భారతదేశానికి తిరిగి ఎప్పుడు వస్తాడు. వచ్చి పెళ్లి చేసుకుని తమని కూడా మళ్ళీ అమెరికా తీసుకెళ్తానన్నవాడు ఇలా చేయటం శంకరం దంపతులకు ఆశనిపాతం అయింది. భార్య అందుకు ఎలా ఒప్పుకుంటుంది. వాడు విదేశాలకు వెళ్తుంటే ఎంత గర్వంగా భావించింది. అవును.. వాడికి ఏం కావాలో వాడే చూసుకుంటున్నాడు.

ఇంక వాడి జీవితంలో తమకి చోటు తగ్గిపోతుంటుంది. అవసరాలు తీరాక బయటివాళ్లయినా.. పిల్లలయినా.. ఒకటేనేమో..

కొడుకు తన కోసం తిరిగి కొన్నాళ్ళకు స్వదేశానికి వస్తాడని నమ్మింది ఆ పిచ్చితల్లి. ఈ సంవత్సరంలో హైదరాబాద్‌లో ఒక ఫ్లాట్ కొన్నాడు సారథి. తల్లిదండ్రుల్ని అద్దె ఇంట్లోంచి అందులోకి చేర్పించాడు. అప్పుడు గృహప్రవేశంలో కొడుకు ప్రయోజకుడయ్యాడని ఎంతో పొంగిపోయింది. ఈసారి సారథి వచ్చి పెళ్లి చేసుకున్నాక కొడుకు కోడలితో తిరుపతి వస్తానని శ్రీనివాసునితో చెప్పుకుంది కూడా.

"ఏమిటోయ్.. నీ కొడుకు గురించి ఆలోచిస్తూ నా గురించి పట్టించుకోవట్లేదు.. రాత్రి తొమ్మిదయింది. ఈ పూట డిన్నర్ ఉన్నదా.." నవ్వుతూ అడిగాడు శంకరం. ఆమె దృష్టి మరల్చాలనే శంకరం అలా అంటున్నాడని సుజాతకీ తెల్సు.

"అయ్యో... రెడీ చేశానండీ.. మాటల్లో పడి టైమే చూడలేదండి. పదండి" అంటూ వంటింట్లోకి దారి తేసింది.

భోజనాలయ్యాక శంకరం కాసేపు న్యూస్ చూశాడు. సుజాత వంటగది సర్దుకొని వచ్చేసరికి శంకరం పడుకుని ఉన్నాడు.

"ఏమండీ.. నిద్ర పోయారా?" మెల్లగా అడిగింది సుజాత నడుము వాలుస్తూ.

శంకరం ఏమీ మాట్లాడలేదు. అతనికి వినిపించినా విననట్లే ఉన్నాడు. సుజాత మనసులో రేగే ఆలోచనలు తెలుసు కాబట్టే మౌనం వహించాడు ఆమె మళ్ళీ పిలిచింది.

తప్పనిసరిగా ఇటు తిరిగాడు. "ఏంటి సుజీ.. పడుకో.. ఎక్కువగా ఆలోచించకు. పొద్దుపోయింది" అతని స్వరం మెత్తగా

క
థ

ప్రేమగా పలికింది.

"అది కాదండీ.. తల్లిదండ్రులకు చెప్పకుండా వాడు పెళ్లి చేసుకున్నా సరిపెట్టుకున్నాను. కానీ ఎప్పటికీ తలుపులు మూసుకున్నాడు. అక్కడి పిల్లను చేసుకుంటే అంతే కదా! కానీ మొన్న మాట్లాడుతూ ఏమన్నాడో తెలుసండీ. అక్కడే సెటిల్ అవుతానని ఆ పిల్లకి మాట ఇచ్చాడట.. మనకీ అదేదో గ్రీన్ కార్డ్ తీసుకుంటాడట. మనం కూడా అక్కడే ఉండవచ్చుట.

మనదేశం కాదని మన భాష, బంధువులు అన్నీ వదులుకొని మనం ఎందుకు అక్కడ ఉండాలండీ.." ఆమె గొంతు రుద్ధమైంది.

"వాడు మన మీద ప్రేమ కొద్దీ అన్నాడు గానీ మనం అక్కడెందుకు ఉంటాం చెప్పు. నువ్వు లేనిపోని ఆలోచనలతో ఆరోగ్యం పాడుచేసుకోకు. పెళ్లి చేసుకున్నాడు. కోడలు కడుపుతో ఉందని కూడా అన్నాడు కదా!. ఒకసారి వెళ్ళి చూసి కొన్ని నెలలుండి వచ్చేస్తాం. అంతే.. రేపు యాంజియోగ్రామ్ చేయించుకోవాలి.. ఇంక పడుకో"

అంటూ అటు తిరిగి పడుకున్న శంకరం కళ్ళ నుండి కన్నీటిధార చాలా సేపటివరకు.. అతనికి నిద్ర పట్టేంత వరకు ఆగకపోవటం సుజాతకూ తెలుసు. ఎందుకంటే ఆమెదీ అంతే స్థితి కాబట్టి.

సుజాత అందరిముందు నటిస్తున్నది. కొడుకు దగ్గరికి వెళ్తుంటే మునుపటి ఉత్సాహం లేదు. కొడుకు దూరమైపోయిన బాధ గుండెల్ని పిండేస్తున్నది.. ఎప్పటికో నిద్రలోకి జారుకున్నా కల్లో సారధి.. పసివాడుగా.. పెద్దవాడుగా..

మర్నాడు ఇద్దరూ జనరల్ చెకప్ చేయించుకుని మందులు రాయించుకున్నారు. యాంజియోగ్రామ్‌లో శంకరానికి కొంచం తేడాగా ఉందని తెలిసింది. డాక్టర్ మందులు ప్రత్యేకంగా రాశాడు.

విదేశీప్రయాణం గురించి విని "మీరు వెళ్ళేది మార్చ్‌లో కదా. ఈ లోపు ఆ ప్రాబ్లమ్ సెట్ అవుతుందిలేండి" అన్నాడు.

ఇద్దరూ కొత్త మందులు మొదలుపెట్టారు. శంకరం ఆరోగ్యం కొంచం కుదుటపడింది.

ఒక నెల గడిచింది.

ఒకరోజు టి.వి.లో వార్తలు చూస్తున్న శంకరం షాక్ తిన్నట్లుగా సుజాతను పిలిచి చూపించాడు. చైనాలో పుట్టిన కరోనా అనే వైరస్ ప్రపంచం అంతటా వ్యాపిస్తున్నది. అంటూ దాని లక్షణాలను వివరిస్తున్నారు న్యూస్‌లో.

మనిషి శ్వాసకోశాలను నిర్వీర్యం చేసి ఆక్సిజన్‌ను తగ్గించి ప్రాణాలు హరించే ఆ కోవిడ్ 19 అనే మహమ్మారికి వ్యాక్సిన్ లేదు, మందు కూడా లేదుట. ఇంకా వారం రోజుల్లో అన్నీ దేశాలు లాక్‌డౌన్ విధిస్తాయట. ఇంక అన్నీ రవాణా సౌకర్యాలు ఆగిపోతాయట. షాపులు మూసేసి, అత్యవసర వస్తువుల దుకాణాలు మాత్రం రెండు గంటలపాటు తెరిచి ఉంచుతారట. చేతులు సబ్బుతో ప్రతి గంటకూ కడుక్కోవాలనీ, అంతా ఎవరి ఇళ్ళల్లో వాళ్ళు ఉండాలనీ, ముక్కు, నోరు, మాస్క్‌తో కవర్ చేసుకోవాలనీ ఇంకా చాలా జాగ్రత్తలు చెప్తున్నారు. టి.వి.లో.. రేడియోలో.. మొబైల్‌లో ఎక్కడ విన్నా.. చూసినా కరోనా గురించిన జాగ్రత్తలే.. మరణాల లెక్కలే.

శంకరం సుజాతలకు పక్కలో బాంబ్ పేలినట్లయింది. ఇంకో రెండు నెలల్లో అమెరికా వెళ్తాము, కొడుకుని చూస్తాము అనుకుంటున్న వాళ్లకు ఈ కరొనా వార్త విషాదంగా అనిపించింది.

మర్నాడు ఇద్దరూ షాపింగ్ వెళ్లాలనుకున్నారు. ఇంతలో ఈ పరిస్థితి ఏమిటో.. అంతా అగమ్యంగా ఉంది.

"మన ప్రయాణానికి ఇంకా రెండు నెలలు టైమ్ ఉంది కదా. అప్పటికి అన్నీ మామూలుగా అయిపోతాయిలే.. పడుకో ఇంకా.. "అంటూ ఆవులించి నిద్రకు ఉపక్రమించాడు శంకరం.

అర్ధరాత్రి రెండు గంటలకి సుజాతకి హఠాత్తుగా మెళకువ వచ్చింది. పక్కన చూస్తే శంకరం లేడు. బాత్రూమ్‌కి వెళ్ళి ఉంటాడు.. అనుకుంటూనే నిద్రలోకి జారిపోయింది. మళ్ళీ ఐదింటికీగానీ లేవలేకపోయింది.

అప్పటికీ శంకరం పక్కన లేదు. సుజాతకి ఒక్క క్షణం ఏమి అర్ధం కాలేదు.

ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చింది. అటాచ్‌డ్ బాత్రూమ్ తలుపు బయట గడియ పెట్టి ఉంది. గబగబా బెడ్‌రూమ్ లోంచి హాల్లోకి వచ్చింది. అటూ ఇటూ అయోమయంగా చూసింది.

అదేంటి అలా బొక్కబోర్లా నేలమీద పడుకున్నారు?

ఒక్క ఉదుటున వచ్చి శంకరాన్ని తట్టి లేపబోయింది. ఇదేమిటి ఈయన వళ్ళు ఇలా చల్లగా బిగుసుకుపోయి.. దేవుడా.. ఏదో అర్ధమైనట్లు గట్టిగా అరిచింది. శంకరాన్ని కుదుపుతూ పిలుస్తోంది. గొంతులో ఏడుపు జీర.. చుట్టలు చుట్టలుగా...



"ఏమండీ.. ఏమండీ.." ఒక చేదు నిజాన్ని జీర్ణించుకోలేక అది ఎప్పటికీ నిజం కాకూడదనుకుంటూ మనసులోనే వంద దేవుళ్ళను వేడుకుంటూ మళ్ళీ మళ్ళీ నిర్జీవుడయిన శంకరాన్ని తట్టి తట్టి లేపుతున్నది. ఇంతలోనే ఏదో ఆలోచన వచ్చి గబ గబా ఎదురింటికి పరిగెత్తి డాక్టర్ గారిని పిలుచుకు వచ్చింది. ఇరుగు పొరుగు సాయంతో భర్తను మంచం మీదికి చేర్చింది.

డాక్టర్ ఏవో ప్రయత్నాలు చేశాడు. లాభం లేదనీ... శంకరం మరణించి నాలుగు గంటలయిందని చెప్పి సానుభూతి తెలియచేసి వెళ్ళిపోయాడు.

సుజాతకి అంతా శూన్యమైపోయింది. కరోనా కాలంలో శంకరం స్వర్గస్థుడు కావటం వల్ల వేరే ప్రాంతాలలో ఉన్న బంధువులు ఎవ్వరూ రాలేని కఠిన విషాదం. ఊళ్ళో ఉన్న సుజాత అక్క, శంకరం తమ్ముడు వాళ్ళ పిల్లలు, కొద్దిమంది స్నేహితులు భయం భయంగా వచ్చారు.  అంతర్జాతీయ విమాన సర్వీసులు లేనందున సారథి రాలేకపోయాడు.  తలకొరివి పెడతాడని, పున్నామ నరకం నుండి కాపాడతాడని ఎన్నో ఆశలు, ప్రేమతో పెంచిన కొడుకు లేకుండానే శంకరం పార్థివ దేహానికి అగ్ని సంస్కారం జరిగింది. సుజాత అక్క సుజాతని కంటికి రెప్పలా కనిపెట్టుకుని ఉంది. ఆ పదమూడు రోజుల కార్యక్రమం కూడా శంకరం  తమ్ముడే పూర్తి చేసి వదిన గారి దగ్గర సెలవు తీసుకుని దుఃఖంతో వెళ్ళిపోయాడు. సారథి తల్లితో ఫోన్‌లో రోజూ మాట్లాడుతున్నాడు.  కోడలు మాత్రం పలకరించలేదు. బంధంలేని బంధుత్వం మరి.

ఫ్లయిట్ టికెట్స్ రద్దయినాయి. సుజాత కుమిలి కుమిలి ఏడుస్తూనే ఉంది. ఎవరెంత ఓదార్చినా ఆమె బాధ తీరేది కాదు. కొడుకు రాలేకపోవటం సుజాతకి మరింత వేదనగా ఉంది.

ఈ ప్రపంచంలో తాను ఒంటరిదయిపోయినట్లు శూన్యంగా ఉంది. ఈ మధ్య సారథి ఫోన్ చేయటం కూడా తగ్గించాడు. ఆఫీస్ పని వత్తిడి అంటున్నాడు. మరో రెండు నెలలకి సారథి చెప్పిన మాట విని సుజాత కళ్ళల్లో నీళ్ళు కూడా ఇంకిపోయాయి.

భారత ప్రభుత్వం విదేశాల్లో ఉన్న భారతీయుల కోసం స్వదేశానికి  ప్రత్యేక విమానాలు నడుపుతోంది. భర్త మరణంతో కుమిలిపోతున్న తనను ఓదార్చటానికి సారథి వస్తాడని సుజాత ఎదురుచూస్తోంది. కొడుకుని కౌగిలించుకుని పెద్దగా ఎడవాలని ఉంది.

కానీ సారథి ఏమంటున్నాడు.

"అమ్మా.. నేను వచ్చి ఏం చేయగలను. నువ్వు ఆస్తులు అమ్మేసి ఆ డబ్బు తీసుకుని నా దగ్గరికి వచ్చేయి. ఇంకా అక్కడ ఎవరున్నారని. మీ కోడలికి డెలివరి సమయం కూడా. పుట్టేవాళ్లను చూసుకుంటూ నువ్వు ఇక్కడే ఉండిపోవచ్చు. ప్రత్యేక విమానం టిక్కెట్స్ పంపిస్తున్నాను."  సారథి గొంతులో తల్లి గురించిన ఆదుర్దా కన్నా ఇతర విషయాలు ప్రధానంగా కనిపించాయి.

ఎక్కడో పల్లెలో పుట్టి టౌన్‌లో చదువుకుని పెళ్లి పేరుతో హైదరాబాద్‌కి భర్తతో కొత్త కాపురానికి వచ్చిన సుజాత జీవితం ఇప్పటి వరకు ఎన్ని సార్లు స్థలాలు మారినా బాధ పడింది ఒక ఎత్తు అయితే ఇంక అమెరికాకి శాశ్వతంగా వలస వెళ్ళటం మరోఎత్తు. అది ఆమెకు ఎక్కలేని ఎత్తు.

పుట్టి పెరిగిన ఊరు, జీవిక జరిగిన ఊరు కాక పరాయి దేశంలో జన్మ ముగించుకుని ఆ మట్టిలో కలిసిపోవటం ఎంత దురదృష్టం. శ్రీరాముడు స్వర్ణమయ లంకలో ఉండమంటే జననీ, జన్మభూమి, స్వర్గం కన్నా ఎక్కువ అని చెప్పలేదా. నేటి భారతీయులు రాముని వారసులు కాదా!

సుజాత ఎక్కవలసిన విమానం ఆమె లేకుండానే అమెరికా వైపు ఎగిరిపోయింది. అమెరికాలో ఉన్న సారథికి తల్లి దగ్గరి నుంచి ఒక చివరి  మెయిల్ అందింది.

"బాబూ సారథీ, నిన్ను నేను తప్పు పట్టను. మీ తరం అంతా ఇలాగే ఉన్నారు. ఇప్పుడు తల్లిదండ్రుల వలస జరగటం నేనూ చూస్తూనే ఉన్నాను. పిల్లలు లేని మేము భోపాల్‌లో ఉన్నప్పుడు ఒక అనాథవయిన నిన్ను ఒడి చేర్చుకున్నాము. చివరి దాకా మాకు తోడవుతావని. అందరూ నిన్ను తక్కువగా చూస్తారేమోనని ఈ రహస్యం మా కడుపులోనే  దాచుకున్నాము. నా దేశం నుండి నన్ను చివరి వలసకు తీసుకెళ్తావని అనుకోలేదు. మీ నాన్నగారు కలిసిన మట్టిలోనే నేనూ కలిసిపోతాను. నా నిర్ణయానికి బాధపడకుండా అర్థం చేసుకుంటావనుకుంటాను. నువ్వు ఎక్కడ ఉన్నా మా ఇద్దరి ఆశీస్సులు మీకు ఉంటాయి. ఎప్పుడయినా అమ్మనీ, అమ్మలాంటి  దేశాన్ని  గుర్తు చేసుకుంటే రా నాన్నా. నీ కోసం నా కళ్ళ వాకిళ్ళు ఎప్పుడు తెరిచే ఉంటాయి. మరో మాట. మా గ్రామంలో నాకు మా అమ్మ ఇచ్చిన పొలం, ఇల్లు ఉన్నాయి కదా. అక్కడికే వెళ్తున్నాను. ఆ ఊరు నాకు అమెరికా కంటే ఎక్కువ. ఆశీస్సులతో అమ్మ."

సుజాతకి పుట్టిన ఊరు పుట్టిల్లులా స్వాగతం పలికింది.

తర్వాతి సంవత్సరానికి సారథి, కోడలు, మనవడు సుజాత దగ్గరకు గ్రామానికి రావటం పండగ మళ్ళీ వచ్చినట్లయింది.

"నన్ను మన్నించమ్మా. అనాథనయిన నన్ను మీరు చేరదీసి ఇంత చేస్తే నేను నిన్ను అనాథను చేశాను. కరోనా కాలంలో నాన్న పోవటంవల్ల  నాన్నకు కనీసం చివరి రుణం కూడా తీర్చుకోలేని దురదృష్టవంతుడిని. కోవిడ్ నా కళ్ళు తెరిపించింది. ఇంక మేము నీతోనే ఉంటామమ్మా"  అంటూ కన్నీళ్లతో కరిగిపోతున్న కొడుకునూ, కోడలినీ దగ్గరికి తీసుకుంది  సుజాత.

దూరం నుంచి వరికంకులు చేత్తో పట్టుకుని తప్పటడుగులు వేస్తూ వస్తున్న మనవడిని ఆపేక్షగా చూస్తూ.. చేతులు చాచింది

"వీడి పేరేమిటిరా సారథీ!"

"శంకరరావు అత్తయ్యగారూ" కోడలు బదులిచ్చింది తృప్తిగా నవ్వుతూ.

ముఖాముఖి

# కవిత్వం, లోలోపలి సంఘర్షణకు ప్రతిరూపం. బాహ్య అంతః ప్రపంచాల సమరం

**బహుముఖ సృజన శీలి స్వాతి శ్రీపాదతో నేటి రచయిత పత్తిపాక మోహన్ ముఖాముఖి...**



పత్తిపాక మోహన్



*కవిత్వం, కథ, నవల, అనువాదం వంటి ప్రక్రియల్లో గత అయిదు దశాబ్దాలకు పైగా కృషి చేస్తున్న రచయిత్రి, కవయిత్రి స్వాతీ శ్రీపాద. కవయిత్రిగా ఇందూరు భారతి మిత్రులతో కలిసి చౌరస్తా నుండీ ఆరంభమైన నడక 6 కవితా సంపుటాలుగా, 5 కథా సంపుటాలుగా పది వరకు నవలలుగా, 32 పైగా అనువాదాలుగా సాగుతూనే ఉంది. సాగుతూనే ఉంటుంది. చేపట్టిన ప్రతి ప్రక్రియలో తనదంటూ ఒక ప్రత్యేకమైన సంతకంతో ముందుకు సాగటమే తెలుసామెకు. అందుకు సాక్ష్యం ఆమె రచనా ఒరవడి.*

*కవిత్వం, కథ, నవల ముఖ్యంగా అనువాద ప్రక్రియలో కృషికి గుర్తింపుగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం వారు ప్రతిభా పురస్కారాన్ని ఇచ్చి గౌరవించారు. ప్రతిష్ఠాత్మకమైన కేంద్ర సాహిత్య అకాడమీ కోసం తెలుగు నుండి ఆంగ్లానికీ ఆంగ్లం నుండి తెలుగుకు, నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా కోసం దేశ దేశాల కథలను తెలుగులోకీ, తెలుగు విశ్వ విద్యాలయానికి అనువదించారు. సుదీర్ఘకాలం ప్రసార భారతికి నేషనల్ పొయట్స్ కోసం కవిత్వాన్ని, దాదాపు తెలుగులో పేరున్న అందరి కవిత్వాన్నీ అనువదించారు. ప్రసార భారతి కోసం దాదాపు 300 తెలంగాణా జానపద గీతాలను ఆంగ్లంలోకి అనువదించారు. సాహిత్య కృషికి అనువాదానికి గుర్తుగా మహాత్మ పూలే అవార్డ్ తీసుకున్నారు. ఈ మధ్యనే ప్రతిష్ఠాత్మకమైన సిరికోన అవార్డు ఆమెకు ప్రకటించబడింది.*

**★ మీరు అయిదు దశాబ్దాల పైగా వ్రాస్తున్నారు కదా, మీ నేపథ్యం, స్ఫూర్తి గురించి చెప్పండి.**

అతి మామూలు మధ్య తరగతి కుటుంబం. ఆరుగురు అక్కచెల్లెళ్ళలో మూడో దాన్ని. ఇద్దరక్కలు ముగ్గురు చెల్లెళ్ళు. ఒక తమ్ముడు. చిన్నతనంలో నాపైన అమ్మ నాన్న ఇద్దరక్కల అజమాయిషీ- ఒక రకంగా విప్లవాత్మకంగా స్వతంత్ర్య ఆలోచనలు జన్మాంతర సంస్కారం కావచ్చు. అక్కల మీద కోపం వచ్చినప్పుడల్లా పాటలు అల్లుకునే దాన్ని పెత్తందారు పెద్దక్క, చిత్రాల చిన్నక్క అంటూ... స్వతంత్ర్య భావాలు నాన్న నుండే వచ్చాయి. ఊహ ప్రపంచం, రచనా వారసత్వం రాయలేని అమ్మకు రాసే రూపం నేను. అమ్మకు ఎన్నో కలలుండేవి- ఒక్కటీ తీర లేదు. ఇందూరు భారతి నాకు ఒక పెద్ద చేయూత.

స్కూల్లో ఏదైనా నచ్చని సమయాల్లో కవిత్వం రాసే దాన్ని. నిజానికి నాకున్న ఫ్లాషింగ్ మెమొరీకి చదువు మీద ఏకాగ్రత చూపితే ఏదనుకుంటే అది అయి ఉండే దానను. కాని అప్పుడు నాకు సాహిత్యమే ముఖ్యమనిపించింది. (ఊహ తెలిసినప్పటి నుండి ఇప్పటి వరకు ఏ రోజున ఏం జరిగింది పూస గుచ్చినట్టు చెప్పగలను, ఎవరేం మాట్లాడారో కూడా). కాదంటే అప్పుడు అవార్డ్స్ గురించీ పేరు ప్రఖ్యాతుల గురించి ఏ మాత్రం తెలీదు. రచన నా ఉనికి, నా ఊపిరి, నా సర్వస్వం. ఇప్పుడు నన్ను ప్రేమించే నా పిల్లలు వారి పిల్లలు, వారి కుక్కలు ఇదే నా కుటుంబం.

**★ నిజామాబాద్‌లో సాహిత్య వాతావరణం ఎలా ఉండేది? అందులోనూ స్త్రీలకు ఉన్న స్థానం ఏమిటి?**

అప్పట్లో ముఖ్యంగా సాంప్రదాయిక కుటుంబాలలో స్త్రీలు బయటకు రావడమే తక్కువ, అయినా మా నాన్న అమ్మాయిలు చదువుకోవాలని అనేవారు. కట్నాలిస్తే చేసుకున్నవాడు అది లాక్కుని వదిలేస్తాడు, మీ చదువు ఎవరూ తీసుకుపోలేరు అనేవారు. నిజానికి ఆయనే

ముఖాముఖి

ఒక హిట్లర్. చదువుకుందుకు తప్ప మరే స్వేచ్ఛా ఇవ్వలేదు. ఆ పిచ్చి పిచ్చి రాతలెందుకు ముందు చదువుకో అనేవారు. అమ్మకు ఆడపిల్లలు ఒద్దికగా గీసిన గీతల్లో ఉండాలి.

అలాంటి రోజుల్లో నిజామాబాద్‌లో కవిత్వం రాసి, కథలు రాసి వేదిక వరకూ వచ్చిన అమ్మాయిని నేనొక్కదాన్నే. దానికి పెద్ద సపోర్ట్ వీరభద్రాచారి గారు, ఆయనకంటూ ఆయన ఏమీ ఆశ పడకపోయినా ఇందూరు భారతి స్థాపించి మాలాంటి వారందరినీ ప్రోత్సహించి ఇందూరుకు సాహితీ సౌరభం ఇచ్చిన వ్యక్తి ఆయన. దానికి వెన్నూదన్నూ సైబ పరంధాములు, చిత్రకారులు, కవి, ఫొటోగ్రాఫర్. నా కథలు కవిత్వం బొమ్మలు వేసి పత్రికలకు పంపినది సైబ. ఆ ఇద్దరే నా సాహితీ ప్రస్థావనకు పునాది. మా ఇంట్లో అమ్మకు నాన్నకు నచ్చ జెప్పి వేదిక వరకూ తెచ్చారు. చాలా రోజులు కవిత్వం చదివిన దాన్ని నేనొక్కదాన్నే. ఇందూరు అంటే స్వాతి, స్వాతి అంటే ఇందూరు అనుకునేవారు. కామోసనుకుని గర్వపడ్డాను. కాని ప్రత్యేక తెలంగాణా వచ్చాక కవి మిత్రుల సన్మానాలకు మరేవో కొలతలు చూసి, బలాబలాలు చూసి ఇంతే కదా అనుకున్నాను. మా స్కూల్ మిత్రుడు చాలా సార్లు చెప్పాడు - మీ పుస్తకాలు మీ వివరాలూ కవిత గారికి పంపండి అని.

**వర్తమాన రచయిత్రులకు సఖ్యత లేదు. వెనక తరం వారికి - ముందు తరాన్ని అహ్వానించే సౌహార్దత లేదు. ముందు తరం వారికి వర్తమాన రచయిత్రులను గౌరవించే సంస్కారం లేదు. ఒకరినొకరు ఆదరించి అభిమానించే తత్త్వమే కరువైంది. ఎవరికి వారు వట వృక్షాలమనే భ్రమ. పెదవుల చివరి మెప్పుదలకు లొంగిపోయి పొంగి పోయి ఉనికిని మరచిపోయే గుణం. రచన సదా ప్రోత్సహించవలసిన విషయమే.**

జగమెరిగిన నా వివరాలు నేను చెప్పుకోవాలా? స్కూల్లోనే బెస్ట్ టీచర్ అవార్డ్‌కి అప్లై చెయ్యమంటే చెయ్యలేదు ప్రతి ఏడాదీ ప్రశంసా పత్రాలనిచ్చిన విద్యాసంస్థకు నా గొప్పలు నేను చెప్పుకోవాలా? అని. ఇదీ అంతే. ఒకప్పుడూ ఇందూరు గర్వపడి ఎందరినో ప్రభావితం చేసి, ఇప్పటికీ చేస్తున్న నా రచన గురించి నేను చెప్పుకోవాలా?

గుర్తింపు ఎప్పుడూ ఎదుటి వారి ప్రతిభ మన ప్రతిభకు కొలత కాదు. ఒక కిలో రాయి కిలో బరువునే తూకం వెయ్య గలదు, వెయ్యి కిలోలనో లక్ష కిలోలనో కాదు. నలుగురు కవుల సంకలనం చౌరస్తాకు ఆ రోజుల్లో చాలా పేరొచ్చింది. దాని కథా కమామీషూ ఏమిటి? మా నలుగురివీ నాలుగు దారులు. సైబ కవిత్వం గీసిన చిత్రంలా ఉండేది. తొలి తొలి రోజుల్లో సమాజమూ ఊహలూ కలగలిపి రాసే ఉద్వేగం నాది. సూర్య ప్రకాశ్ గారు కొంచం వేరుగా స్పష్టంగా దారి చూపేవారు. బద్దూరి నరసింహం అన్ని ఆలోచనలకూ రూపం ఇచ్చేవారు. ముఖ్యంగా మేం నలుగురమే కవిత్వం రాసి, చదివి అందరినీ ఊదర కొట్టేవాళ్ళం.

చౌరస్తా ఆలోచన వీరభద్రాచారి గారిది. ఆయనకు మా కవిత్వం లోకానికి అందించాలనిపించింది. ఆర్థిక వనరులు అంతగా లేని ఆ రోజుల్లో సైబ తన చేతి రాతతో, బొమ్మలతో, మా మొహాలు గీసి స్టెన్సిల్స్ రాసి సైక్లోస్టైల్ చేసి తెచ్చిన పుస్తకం. నిజానికి ఆ రోజుల్లో అదో సంచలనమే. మాకెవ్వరికీ కీర్తి కాంక్ష లేదు కాని ఉంటే అదొక రికార్డ్. ఎందరో నచ్చి మెచ్చిన కవిత్వం. ఇప్పటికీ చాలా మంది నన్ను ఆ పదహారేళ్ళ స్వాతిగానే గుర్తుంచు కున్నారు. (ముఖ్యంగా కె. శివారెడ్డి గారు)

అప్పట్లో నా స్ఫూర్తితో చాలా మంది కవిత్వం రాసారు, అలాగని చెప్పుకున్నారు, ఈ రోజున గుర్తు చేస్తే అవునా అంటారు. మళ్ళీ ఆ చౌరస్తా పునర్ముద్రించాలని ఆలోచన.

**★ మీ కవిత్వం వివరాలు కొంచెం పంచుకుంటారా?**

కవిత్వం అంతర్గనితం, లోలోపలి సంఘర్షణకు ప్రతిరూపం. బాహ్య అంతః ప్రపంచాల సమరం. ఒక వాక్యాన్ని నాలుగు వరుసల్లో రాసుకోడం కవిత్వం కాదు. ముందు మామూలుగా ఆరంభమైనా, వచనానికీ కవిత్వానికీ తేడా తెలుసుకున్నది విస్తృతంగా చదవడం వల్ల. తెలుగులోనూ ఆంగ్లంలోనూ కవిత్వం ఔపోసన పట్టడం వల్ల. కప్పి చెప్పేది కవిత్వం. కవి ఊహ అందుకునే సవాలు పఠితలకు లేనప్పుడు అది కవిత్వమెలా అవుతుంది?

నిజానికి 69 నుండి అవిరామంగా కవిత్వం రాస్తూనే ఉన్న 2007 వరకూ పుస్తకం వేసుకునే సాహసం చెయ్యలేదు. తొలి కవిత్వం - హృదయంలో అడుగులు, ఆ పైన, మనసుకు చూపుంటే, ఎడారులు ఎండమావులు, నదినై ప్రవహించాలని, సుప్త క్షణం, పోతబొమ్మ, రాబోతున్న పుస్తకం - ఇక్కడ అందరూ ఒకటే. మీ కవిత్వానికి నోబుల్ ప్రైజ్ ఇవ్వాలనీ, మీకు జ్ఞాన పీఠ్ ఇవ్వాలనీ అంటూ నా కవితకు చాలా మంది అభిమానులు. బాబూ అవన్నీ మీ పెరట్లో ఉన్నాయా అంటాను నవ్వుతూ వారి అభిమానమే నాకు అమూల్యమైన సత్కారం, అతి విలువైన అవార్డ్. అందరికీ వందనాలు. నా కవిత నాదే మరొకరిలా రాయలేను. కొందరు పెదవి విరిచారు సామాజిక స్పృహ లేదని - చూస్తే ఆలోచిస్తే కనబడుతుంది. నడి వీధిలో నగ్నంగా నిలబడిన ప్రౌఢ కాదు నా కవిత.

తరచి చూస్తే తప్ప సొబగులు అంతుపట్టని ముగ్ధ.

**★ సాంప్రదాయ నేపథ్యం నుండి వచ్చిన మీకు రచనా రంగంలో ఆటంకాలు ఎదురవలేదా?**

అడుగడుగునా ఆటంకాలే కదా! వెనకాల కుటుంబ నేపథ్యం సాంప్రదాయికం. కాని నా భావాలు చాలా మటుకు అభ్యుదయమే. కులమతాల నమ్మకాలు లేవు, వర్గవ్యత్యాసాలు అసలు లేవు. ఉన్నవి రెండే రెండు - ఏ రకంగా చూసినా ఆడ, మగ, మరొకటి అణచివేయబడిన వారు, అణిచి వేసేవారు.

ముఖాముఖి

కట్టూ బొట్టూ, ఆహారపుటలవాట్లూ పుట్టిన పరిసరాలతో వచ్చినవి. నచ్చినవి. అంత మాత్రాన మమ్మల్ని తూర్పార బట్టడం న్యాయమా?

ఆ రోజుల్లో గడప దాటిన స్త్రీలూ దాటని వాళ్ళు కూడా అన్ని రకాలా హింసకు గురైనవాళ్ళే. రచనా వ్యాసంగంలో ముఖ్యంగా విద్యావ్యవస్థల్లో ఉండి అస్మదీయుల అండ ఉన్నవారు అయినా కాకున్నా పేరున్న రచయిత్రులయ్యారు. భాషా సమృద్ధి వేరు. సృజనాత్మక ప్రతిభా పాటవాలు వేరు. సినీ రంగానికీ పత్రికా రంగానికీ చేరువలో ఉన్నవారు పేరు సంపాదించుకున్నారు. కేవలం రచనతో పైకి వచ్చిన వారు చాలా తక్కువ.

చిన్నతనం కదా, బహుమతులనీ, పుస్తకాలు వేస్తామనీ ఎందరో ప్రలోభ పెట్టాలని చూసారు. కాని పెరిగిన నేపథ్యం అప్పటికీ ఇప్పటికీ అలా లొంగిపోనివ్వలేదు. పోనివ్వదు. నాకున్న విలువల ముందు ప్రపంచం యావత్తూ ఒక పక్కన ఉంచినా బలాదూరే నన్ను కొనలేరు. అబద్ధం కాని, అశ్లీలపదంకాని పలకని, పలకలేని నాకు రచన సాక్షాత్ దైవమే, సరస్వతీ మాతే.

చాలా మంది అంటారు మీకు రావలసిన పేరు రాలేదని! సక్రమంగా రానప్పుడు అది అవసరం లేదు.

**★ మీ కథ, నవల గురించి మీ మాటలు....**

69 నుండి 74 లోపల చాలా కథలు రాసాను. సైనిక్ సమాచార్, స్రవంతి, విశ్వరచన, పల్లకి, మయూరి, కృష్ణాపత్రిక, ఆంధ్రభూమి, ఆంధ్రజ్యోతి, వనితా జ్యోతి ఇలా అన్నింట్లో వందల కొద్దీ కథలు వచ్చాయి. ఈ మధ్యన 74-2020లోపు ఒక 200 కథలు వచ్చి ఉంటాయి. రాసే వరకే నాది కాని బయటకు వచ్చాక అది జనాలది. ఇప్పటికీ రాస్తూనే ఉన్నా కొంచం అరుదుగా.. వాకాటి పాండురంగారావ్ - జాగృతి కథా బహుమతితో పాటు తెలుగు విశ్వవిద్యాలయం వాసిరెడ్డి రంగనాయకమ్మ, కీర్తి పురస్కారం మరెన్నో... కథ నాకూ సమాజానికీ ఉన్న ఘర్షణ. మనసును కదిలించి మదన పెట్టే సంఘటనలు నన్ను నిలువనీక కథ రాయిస్తాయి.

ఏ కథ రాసినా ఎవరినో ఒకరిని కదిలించడం దానికిచ్చిన అపురూపమైన ఆదరణ. పుస్తకాలుగా మౌన వీణ, గోడలు, అవతలివైపు, పొరలు, పంజరం విడిచి...



**గుర్తింపు ఎప్పుడూ ఎదుటి వారి ప్రతిభ మన ప్రతిభకు కొలత కాదు. ఒక కిలో రాయి కిలో బరువునే తూకం వెయ్య గలదు. వెయ్యి కిలోలనో లక్ష కిలోలనో కాదు. నలుగురు కవుల సంకలనం చౌరస్తాకు ఆ రోజుల్లో చాలా పేరొచ్చింది. దాని కథా కమామీషూ ఏమిటి? మా నలుగురివీ నాలుగు దారులు. సైబ కవిత్వం గీసిన చిత్రంలా ఉండేది. తొలి తొలి రోజుల్లో సమాజమూ ఊహలూ కలగలిపి రాసే ఉద్వేగం నాది. సూర్య ప్రకాశ్ గారు కొంచం వేరుగా స్పష్టంగా దారి చూపేవారు.**

ఇంతవరకూ నవల విషయానికి వస్తే అది మరింత అరుదుగా ఏడాది రెండేళ్ళకు ఒకటి రాయడం ఎక్కువ. పట్టుమని పది నవలలు రాసి ఉంటాను అందులో నాలుగో అయిదో పుస్తకాలు మిగతావి ఈ బుక్స్. పునరాగమనం, చిరుజల్లు కురిసేనా?, శిశిర వసంతం, చుక్కాని చిరు దీపం, టగ్ ఆఫ్ వార్, ఎక్కడి నుండి ఇక్కడి దాకా... నవల ఒక జీవితం చిత్రం.

కథలకూ నవలలకూ నాయకురాళ్ళు స్త్రీలే

**★ మీ అనువాద కృషి -**

అనువాదం నా కోసం నేను ఎంచుకున్న ప్రక్రియ. నన్ను నేను ఒక నిరాశా నిస్పృహల వలయం నుండి ఊబి నుండి బయటకు తెచ్చుకుందుకు ఎన్నుకున్న దారి. అయితే నాకంటు కొన్ని నిర్దుష్టమైన అభిప్రాయాలు ఉన్నాయి. ఎవరికోసం అనువాదం చేస్తున్నాము, మూల రచయిత భావం శైలి ఎంత వరకు అనువదించగలం అనేది ముఖ్యంగా

ముఖాముఖి

అనువాదకుల భాషా పాండిత్యాలు కాదు. మన సాహిత్యం కోసం విదేశీయులు ఎదురు చూడటం లేదు. తెలుగు రాని మన దేశ మిత్రులకు ఎంత ఆంగ్లం వచ్చో తెలిసి ఉండాలి. నా దృష్టిలో నిఘంటువు తెరవకుండా చదివించగలిగేది చక్కని అనువాదం. అలాగని మూల రచన వదిలి అనువాదకుల స్వంత కవిత్వం చేరిస్తే అది అనువాదమూ కాదు, అను సృజనా కాదు.

అనువాదకులకు ఈర్ష్యా, అహమూ ఎక్కువే. మాకు తప్ప ఇతరులకు ఏమీ రాదనే ప్రొఫెషనల్ రైవలరీ. ఇప్పుడు ఎంతగా అనువాదం ఒక వ్యసనంలా పరిణమించిందంటే ఒక వారం అనువాదానికి దూరంగా ఉంటే నన్ను నేను కోల్పోయినట్టు అనిపిస్తుంది.

**★ మీ పునరాగమనం నవల - దాని ప్రభావం**

పునరాగమనం నవల ముందు కౌముది వెబ్ మాసపత్రికలో పడమటి సూర్యోదయం అనే పేరుతో సీరియల్‌గా వచ్చింది. ఆ నవల ఒక సంచలనమే - ముందుమాట రాసిన వల్లీశ్వర్ గారు నవోదయలో పుస్తకం ఇచ్చాకా పుస్తకం చదివిన షాప్ ఓనర్ గారు, ఒకే మాట చెప్పారు, పేజీలు తిరగేద్దామనుకున్నా - అందరూ పదహారేళ్ళ అమ్మాయి నాయికగా నవలలు రాసి చదివిస్తే మీరు యాభై యేళ్ళ నవలా నాయికతో ఆ పని చేయించారని. ఒక కంప్యూటర్ రిపేర్కి వచ్చిన వ్యక్తి "మేడమ్ ఏం రాసారు... మా ఇల్లాలికి పదేళ్ళుగా చెప్తున్నా కంప్యూటర్ నేర్చుకోమని ఉహు వినలేదు. మీ నవల చదివి, ఆ యాభై యేళ్ళ హీరొయిన్ నేర్చుకోగాలేనిది నేనేనా తక్కువ అని నేర్చేసుకుంది అని" నిజానికి మన సమాజంలో పదహారేళ్ళ అమ్మాయి అయినా యాభై యేళ్ళ అమ్మ అయినా ఎదుర్కొనే సమస్యలు ఇంచుమించు ఒకటే. ఆ నవలలో వ్యక్తులందరు మన చుట్టూనే కనిపిస్తారు. ధైర్యంగా రాసానని అన్నారు.

**★ వర్తమాన రచయిత్రుల గురించి వారి రచనల గురించి ఏం చెబుతారు?**

వర్తమాన రచయిత్రులకు సఖ్యత లేదు. వెనక తరం వారికి - ముందు తరాన్ని అహ్వానించే సౌహార్ద్రత లేదు. ముందు తరం వారికి వర్తమాన రచయిత్రులను గౌరవించే సంస్కారం లేదు. ఒకరినొకరు ఆదరించి అభిమానించే తత్వమే కరువైంది. ఎవరికి వారు వట వృక్షాలమనే భ్రమ. పెదవుల చివరి మెప్పుదలకు లొంగిపోయి పొంగి పోయి ఉనికిని మరచిపోయే గుణం. రచన సదా ప్రోత్సహించవలసిన విషయమే. కాని కనకపు సింహాసనం దేనికివ్వాలో తెలిసి ఉండాలి. విలువలు ఉంటే ఆధునిక రచయిత్రులకు పాత చింతకాయ పచ్చడులు. స్వేచ్ఛా విహంగాలై దారి తెలియక పోవడమే ఆధునికతా? ఇంకా కులాలు మతాలు అంటూ చెరగటం...

రచన ఔన్నత్యానికి తీసుకు వెళ్ళాలి గాని అథ:పాతాళానికి కాదు. వారు వారిని ప్రేమించుకునే బదులు వారి రచనను ప్రేమిస్తే బాగుంటుంది. ఒద్దికగా పెంచుతారు.

కవిత

# నేటి మహిళ



**అయిత అనిత**

ఆ బాలభానుడితో పోటీ పడుతూ
ఉషోదయపు రాకకు మునుపే
మేల్కొలుపు ఉత్తేజాన్ని ఊపిరి చేసుకొని
ఇల్లు వాకిలి శుభ్రపరిచి
కల్లాపి రంగవల్లులు ముగించుకొని
వంట వార్పు ఆరంభిస్తుంది!

భర్త పిల్లల బాగోగులు చూస్తూ గబగబా
బాక్సులు సర్దుతుంది
ఇంటిల్లిపాది ఆకలిని తీర్చే ధ్యాసలో
తన ఆకలినే అంకితమిస్తుంది!

బ్యాగును భుజానికి వేలాడ దీసి
బస్సుకై పరుగులు పెడుతుంది
కిక్కిరిసిన బస్సులో వెకిలి చూపుల
మధ్య ఓర్పుగా తీరం చేరుతుంది!

బడిలోని పిల్లలకు తన కన్నపిల్లల్లా
విద్యా బుద్ధులు చెప్తుంది!
సహనశీలియను బిరుదును మోస్తుంది కాబట్టి
అదనపు బాధ్యతలను కూడా అతికించుకుంటుంది!

అసమానతలకు గురౌతున్న
అణచివేతలకు పరాకాష్ట అవుతున్నా
పట్టు వదలని కృషితో విధి నిర్వహణలో
జాబిలై తళుకులీనుతుంది!

పునరుత్తేజంతో
మళ్లీ రోజువారీ పనుల బాట పడుతుంది
అలసటను ఆత్మవిశ్వాసంతో సేదదీరుస్తుంది!
సమస్యల వలయాన్ని సమయస్ఫూర్తితో ఛేదిస్తుంది!

నిర్విరామ పరిశ్రమతో
నిరంతరం అలుపెరుగని
పయనం చేస్తూనే ఉంటుంది!



వ్యాసం

# బొమ్మ హేమాదేవి కథలు - కుటుంబ సంబంధాలు

బొమ్మ హేమాదేవి కథల్లో మానవ విలువల ప్రతిపాదన...



డా॥సయ్యద్ ఆఫ్రీన్ బేగం

**రచయిత్రి పరిచయం...**

రచయిత్రి బొమ్మ హేమాదేవి నిజామాబాద్ జిల్లాకు చెందినవారు. సెప్టెంబర్ 14, 1931లో జన్మించారు. హైదరాబాద్ నారాయణ గూడలోని ఆంధ్ర బాలికల ఉన్నత పాఠశాలలో చదువుకున్నారు. చిన్నప్పటి నుండే హేమాదేవిది బలమైన వ్యక్తిత్వం. కరీంనగర్ జిల్లా మానకొండూరు గ్రామానికి చెందిన నారాయణ గౌడ్‌తో హేమాదేవికి వివాహం జరిగింది. సంపన్న కుటుంబంలో పుట్టిన ఆమె అంతస్తుల తేడా ఉన్నా కూడా ఏమాత్రం సౌకర్యాలు లేని పల్లెటూరుకు కోడలిగా వెళ్లారు. అనంతరం వారు హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ఆమె 1960వ సంవత్సరంలో రచనలు చేయడం ప్రారంభించారు. తన రచనా వ్యాసాంగాన్ని అభివృద్ధి చేసుకుంటూ అనేక రచనలు చేసి పాఠకుల ప్రశంసలు అందుకున్న తొలితరం తెలంగాణ రచయిత్రి హేమాదేవి. తొలి రోజుల్లో ఆమె దేవి రమ పేరుతో రచనలు చేశారు. ఆంధ్రజ్యోతి వార పత్రిక 1973లో నిర్వహించిన సినీ కథల పోటీలో తన పెద్ద కోడలు హేమాదేవి పేరున రచించిన **కుంకుమ పూలు** కథకు ప్రథమ బహుమతి రావడంతో హేమాదేవి పేరుతోనే రచనలు



కొనసాగించారు. దాదాపు 35 నవలలు, వందకు పైగా కథలు ఆమె ఖాతాలో జమయ్యాయి. ఆంధ్రభూమి నిర్వహించిన పోటీల్లో ఆమె రచించిన తార నవలకు బహుమతి లభించింది. పొగమంచు అనే రేడియో నాటిక శ్రోతల నుండి ప్రశంసలు పొందింది. 1970-80 మధ్య కాలంలో ఆమె అన్ని పత్రికల్లో కథలు, నవలు రాశారు. సాహిత్యాన్ని, సంగీతాన్ని అమితంగా ఇష్టపడే హేమాదేవి 26 నవంబర్ 1996లో తన 65 వ ఏట కీర్తిశేషులయ్యారు.

హేమాదేవి కథల్లో అన్ని కోణాలు, అన్ని రకాల అంశాలు ఉంటాయి. అందులో కుటుంబ సంబంధాలు ఎక్కువగా కనిపిస్తాయి. కుటుంబ వ్యవస్థలో ఒకరిపై ఒకరికి ఉండే ప్రేమానురాగాలు ఆమె కథల్లో కనిపిస్తాయి. ఆమె కథల్లోని కుటుంబ సంబంధాలను ఓసారి పరిశీలిద్దాం.

**మానవులు**

తండ్రి కొడుకుల మధ్య ఉండే అనుబంధాలను మానవులు అనే కథ ఆవిష్కరిస్తుంది. తన భార్య చనిపోయిన నందనరావు, తన కొడుకు కృష్ణుడిని, తల్లి లేని లోటు తెలియకుండా పెంచడం ఈ కథలోని ప్రధానాంశం. ఇంట్లో కొడుకును దగ్గరగా కూర్చోబెట్టుకొని భవిష్యత్‌ను వివరిస్తూ బుజ్జగించి చదువు చెప్పడం నేటి తరం తల్లితండ్రులకు అనుసరణీయం.

నందనరావుది పెద్ద వయసేమీ కాదు. తన కొడుకు కృష్ణుడికి ఇబ్బందులు ఎదురవుతాయోమోనని తాను మళ్లీ పెళ్లి చేసుకోకుండా ఉండిపోవడం ఒక రకంగా త్యాగమనే చెప్పాలి.

నందన్‌రావు కొడుకు కోసమే బతుకుతుండడం కుటుంబ సంబంధాల గొప్పతనాన్ని తెలియజేస్తుంది. ఆ కుటుంబంలో కృష్ణుడు ఏదైనా అడగడం, ఆ కోరిక కాదనకుండా తీర్చడం ఆ తండ్రి ప్రేమకు నిదర్శనం. కృష్ణుడి పెద్ద చదువుల కోసం తండ్రి తన భూమిని అమ్మడం కుటుంబంలోని ప్రేమానుబంధాలను తెలియజేస్తుంది.

కృష్ణుడు మెడిసిన్ పాసయినా ఆ

తండ్రికి చిన్న పిల్లవాడే. దీపావళి పండుగ రోజున నందన్‌రావు తన కొడుక్కి తలంటి స్నానం చేయించడం పిత్ర ప్రేమకు తార్కాణం. కృష్ణుడు మెడిసిన్‌లో ఇంకా ఉన్నత స్థాయికి చేరుకోవాలని, విదేశాలకు వెళ్లి గొప్ప డాక్టర్‌గా తిరిగి రావాలని, పేరు ప్రఖ్యాతులు సంపాదించాలని ఆరాటపడుతున్న నందన్‌రావు లాంటి తండ్రి తమకూ ఉంటే బాగుంటుందని ప్రతి విద్యార్థి కోరుకునే విధంగా ఆ పాత్రను తీర్చిదిద్దారు రచయిత్రి. ఏ రోజైనా తన కొడుకు ఇంటికి రావడం ఆలస్యమైతే ఆందోళన పడిపోయే తండ్రి పాత్ర నందన్‌రావుది. చనిపోయిన తన భార్య స్థానాన్ని కొడుకు విషయంలో భర్తీ చేసిన తండ్రి పాత్ర ఈ కథలో అందరికి ఆదర్శప్రాయం.

**నవతరం**

ఈ కథలో కుటుంబ సంబంధాలతో పాటు నూతనత్వం, ఆదర్శం కూడా కనిపిస్తాయి. శ్రీనివాస్, పద్మ దంపతులు. ఒకానొకరోజు ఉదయం సినిమాకు వెళ్లాలనుకున్నారు. అంతలో ఇంటికి చుట్టాలు వచ్చారు. వాళ్లు వెళ్లిపోయే వరకు ఆగి సెకండ్‌షోకి వెళ్లడానికి సిద్ధమయ్యారు. ఇంట్లో పెద్దలు రోజులు బాగోలేవు జాగ్రత్తగా వెళ్లిరమ్మన్నారు.

మధ్య మధ్యలో కరెంటు పోవడంతో సినిమా అయిపోయే సరికి ఒంటి గంట అయింది. బయటికి వస్తే వర్షం. ఆటో ఎక్కక తప్పలేదు. ఆటోవాడు వేరే దారిలో తీసుకువెళ్తూ వాళ్లడిగితే దగ్గరి దారి అని నమ్మించాడు. కొంత దూరం పోయాక ఆటో ఆగిపోయింది. ఏమయిందోనని ఆటోడ్రైవర్ చూస్తున్నాడు. పావుగంట దాటినా ఆటో బాగవలేదు. శ్రీనివాస్ విసుగ్గా కిందికి దిగాడు. అదే అదునుగా భావించి డ్రైవర్ ఆటో స్టార్ట్ చేసి పద్మను ఎత్తుకుపోయాడు. శ్రీనివాస్ ఆటో వెంట పరిగెత్తాడు. అప్పటికే ఆటో చాలా దూరం వెళ్లిపోవడంతో తన భార్య పద్మను తలుచుకొని కుమిలిపోయాడు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లి రిపోర్టు ఇచ్చాడు. పద్మనే తలచుకుంటూ ఆ అర్ధరాత్రి ఇంటికి ఎలా వెళ్లాడో తెలియదు.

ఇంట్లో అందరికి విషయం తెలియడం, అందరు విపరీతంగా బాధ పడడం కుటుంబ సంబంధాలకు, బాంధవ్యాలకు, వారి మధ్యవున్న అనుబంధాలకు సంకేతం. శ్రీనివాస్ అయితే పద్మనే తలచుకుంటూ నిశ్చేష్టుడయిపోయాడు.

అటు పోలీసులు, ఇటు కుటుంబ సభ్యులు పద్మ గురించి వెతుకుతున్నారు. పద్మను వెతుక్కుంటూ సైకిల్ మీద బయలుదేరిన శ్రీనివాస్‌కు దారిలో ఎదురైన పోలీసు జీపులో పద్మ కనిపించడంతో జీపును ఆపమన్నట్టుగా చేయి చూపించాడు. పద్మ దొరికిందన్న ఆనందంలో సైకిల్ వదిలేసి గబాలున జీపు ఎక్కి పద్మను కౌగిలించుకున్నాడు. చుట్టు పోలీసులు ఉన్నారన్న విషయాన్ని కూడా మరిచిపోవడం వారిద్దరి మధ్య ఉన్న అనుబంధానికి నిదర్శనం.

పద్మ వాలకం చూసి విస్తుపోయాడు శ్రీనివాస్. చెదిరిపోయిన జుత్తు, చితికిపోయిన పెదవినుండి కారుతున్న రక్తం, చిరిగిపోయిన జాకెట్టు చూస్తే పద్మకు ఏం జరిగిందో అర్థమైపోయింది. అయినా తాను పద్మను కావాలనుకోవడం, కాపాడుకోవాలనుకొని ఆసుపత్రికి తీసుకువెళ్లడం అతనిలోని ప్రేమకు తార్కాణం. పద్మ కోలుకునే వరకు ఆమెను అంటిపెట్టుకొని ఉండి సేవలందించిన శ్రీనివాస్ భర్తగా తన బాధ్యతను నిర్వర్తించడం కుటుంబ సంబంధాలను ఎంతో ఎత్తుకు తీసుకువెళ్లాయి. నవతరం ఆలోచనలు, ఆదర్శాలు, అనుబంధాలు, కుటుంబ సంబంధాలు ఈ కథలో చక్కగా పొందుపరిచారు. సంఘటన జరిగిన తర్వాత స్పందించే తీరు కన్నా ఇలాంటి సంఘటనలు జరగకుండా చూసుకోవాలని నవతరానికి సందేశమిచ్చారు రచయిత్రి.

**అన్నపూర్ణ...**

అన్నపూర్ణకు పెళ్లయింది. తనకు ఇంకా పిల్లలు పుట్టకముందే తల్లయింది. తన మరిది రవి, ఆడపడుచు పద్మ తనకు పిల్లలయ్యారు. అత్త, మామా చనిపోవడంతో వారికి తనే అమ్మయింది. అన్నపూర్ణ పేరులోనే ఓ పవిత్రత ఉంది. అంత చక్కటి పేరుకు తగ్గట్టుగానే ఆ పాత్రను తీర్చిదిద్దారు. మరిది, ఆడపడుచు తనను అమ్మ అని పిలవడం అందరినీ ఆకట్టుకునే అంశం. మరిది, ఆడపడుచును తల్లిలా ఆదరించడం చాలా గొప్ప విషయం. అన్నపూర్ణ ఆ పిల్లల చదువుల విషయంలో ఆరాటపడడం, వాళ్లను కూర్చోబెట్టి చదివించడం, భర్తకు, పిల్లలకు పెట్టిన తర్వాతే తను తినడం, అన్ని విషయాల్లో కూడా అన్నపూర్ణ ప్రవర్తన కుటుంబ

**హేమాదేవి 1960వ సంవత్సరంలో రచనలు చేయడం ప్రారంభించారు. తన రచనా వ్యాసాంగాన్ని అభివృద్ధి చేసుకుంటూ అనేక రచనలు చేసి పాఠకుల ప్రశంసలు అందుకున్న తొలితరం తెలంగాణ రచయిత్రి హేమాదేవి. తొలి రోజుల్లో ఆమె దేవి రమ పేరుతో రచనలు చేశారు. ఆంధ్రజ్యోతి వార పత్రిక 1973లో నిర్వహించిన సినీ కథల పోటీలో తన పెద్ద కోడలు హేమాదేవి పేరున రచించిన కుంకుమ పూలు కథకు ప్రథమ బహుమతి రావడంతో హేమాదేవి పేరుతోనే రచనలు కొనసాగించారు.**



సంబంధాల గొప్పతనాన్ని తెలియజేస్తాయి.

బడికి వెళ్తున్న పిల్లలకు టిఫిన్లు, భోజనాలు ఏర్పాటు చేయడం, సమయానికి వాళ్లను తయారు చేసి బడికి పంపడం, వాళ్ల బట్టలు ఉతకడం ఇలా తల్లికన్నా మిన్నగా సేవలందించడం అన్నపూర్ణ లాంటి అమ్మకే సాధ్యం. పిల్లలు కూడా అమ్మకు ఏ ఇబ్బంది కలగకూడదని, తమ కోసం అమ్మను కష్టపెట్టకూడదని ఆలోచించడం పాఠకుల హృదయాలను కదిలిస్తుంది. అన్నపూర్ణ భర్త మోహన్ తన తమ్ముడిని, చెల్లెలిని అమ్మలా చూసుకుంటున్నందుకు ఆమెను అభినందించడం కూడా కుటుంబ సంబంధాల్లో నిజాయితీని వ్యక్తం చేస్తుంది.

కాలక్రమంలో అన్నపూర్ణ తల్లయింది. కవల పిల్లలను ప్రసవించింది. అయినప్పటికి భర్త తమ్ముడిని, చెల్లెలిని తన పిల్లలుగా చూసుకునే అన్నపూర్ణ పాత్ర ఎంతో ఎత్తుకు ఎదిగిపోయింది. ఇలా జీవన గమనంలో అన్ని ఇబ్బందులను, సమస్యలను ఎదుర్కుంటూ కుటుంబ బాంధవ్యాల కోసం ఎన్నో త్యాగాలు చేసిన అన్నపూర్ణ పాత్ర చరిత్రలో నిలిచిపోతుంది.

**శాంతినిలయం...**

దుర్గ, కైలాస్‌నాథ్‌లది పెద్ద కుటుంబం. ఒక రకంగా ఉమ్మడి కుటుంబమనే చెప్పాలి. ఉమ్మడి కుటుంబాలు కనుమరుగై ఎవరికి వారే జీవనం సాగిస్తున్న ఈ రోజుల్లో వీరి కుటుంబం ఎందరికో ఆదర్శప్రాయం. దుర్గ, కైలాస్‌నాథ్‌లకు ఐదుగురు కొడుకులు, నలుగురు కూతుళ్లు. ఇద్దరబ్బాయిలకు పెళ్లిళ్ల అయి ఇద్దరు కోడళ్లు వచ్చారు. ఇద్దరు కూతుళ్లకు పెళ్ళిళ్ల కావడంతో ఇద్దరు అల్లుళ్ల వచ్చారు. మనవలు, మనవరాళ్లతో అందరు ఒకే ఇంట్లో ఉండడం ఈ తరం వారికి మార్గదర్శకంగా చెప్పుకోవచ్చు. ఎవరి గదుల్లో వారు ఉంటారు. కాని వంట మాత్రం ఒక్కచోటే. ఖర్చులు పంచుకునే విధానం, పని విభజన, బంధువులు వస్తే చూసుకోవడం ఇలాంటి అన్ని విషయాల్లో వివాదాలకు, విమర్శలకు తావులేకుండా నడుస్తున్న ఈ కుటుంబాన్ని చూసి చాలామంది నేర్చుకోవలసిందే. ఆ ఇంటిపేరు శాంతినిలయం. కథ పేరు కూడా శాంతినిలయం. ఈ కథకు ఈ పేరు చక్కగా సరిపోయింది.

ఆ కుటుంబంనుండి దుర్గ, కైలాస్ నాథ్‌లు తిరుపతి వెళ్లాలనుకున్నారు. వాళ్లతో పాటు ఓ కూతురు, మనవరాలు కూడా వెళ్లడానికి సిద్ధమయ్యారు. ఇంటి బాధ్యతలు, వంట పనులు, చుట్టాలొస్తే ఎలా అనే విషయాల్లో పరిపరి విధాలుగా ఆలోచించారు. ఇంట్లో ఉన్న మిగతావారు బాధ్యత తీసుకుంటామని చెప్పడం, కుటుంబంలో సమస్యలేమి ఉండవని భావించిన తర్వాతే వారు తిరుపతికి బయలుదేరారు. ఇది కుటుంబ సంబంధాల విలువలను ఆవిష్కరిస్తుంది.

ఎన్ని సమస్యలొచ్చినా కుటుంబ సంబంధాలే వాటికి పరిష్కారమని చెప్పిన ఈ కథ అందరికి దారి చూపిస్తుంది.

**ఇజాజత్ హై...**

భర్తను వదిలిపెట్టి వెళ్లిన విజయ తన నిర్ణయం సరైంది కాదని తెలుసుకొని తిరిగి భర్త దగ్గరకు వచ్చింది. ఎప్పటికైనా, ఎప్పుడైనా కుటుంబ సంబంధాలే శాశ్వతమని గ్రహించడం ఈ కథలో ప్రధానాంశం. కుటుంబ సంబంధాల గురించి విజయకు తన అమ్మ చెప్పిన ఉపదేశాలు తనకు ఎంతగానో ఉపకరించాయి. మగవాడి బలం, బలహీనతలు వివరించింది విజయకు వాళ్ల అమ్మ. కుటుంబ బంధాలు తెగిపోకుండా ఉండాలంటే ఎలా ప్రవర్తించాలో, ఎలా మసలుకోవాలో విజయకు నేర్పించింది వాళ్ల అమ్మ. భర్త ఎలాంటి వాడైనా అతనితో ఎలా ఉండాలో విజయకు తన తల్లి ద్వారా అర్థం అయింది. అందుకే తిరిగి భర్త దగ్గరికి వచ్చింది. భర్తకు అనుగుణంగా ప్రవర్తించింది. తన జీవితం సుఖంగా సాగిపోయింది. ఇది కుటుంబ సంబంధాల గురించి విభిన్నంగా వివరించిన కథ.

**కమ్‌లీ...**

కమల, శాంతి బాబు దంపతులు. భార్య భర్తల మధ్య ఉన్న అనుబంధాలకు ఈ కథ అద్దం పడుతుంది. వారికి బాబు పుట్టిన తర్వాత దాంపత్య జీవితంలో జరిగే సన్నివేశాలను చక్కగా చిత్రించారు. బాబును సవరించుకుంటూనే భర్తకు సంబంధించిన పనులు చేస్తుంది కమల. బాబు పుట్టిన తర్వాత కూడా వారిద్దరి మధ్య ఏ మాత్రం ప్రేమానురాగాలు తగ్గకపోవడం, సినిమాలు, షికార్లు చేస్తూ సరదాగా జీవనం గడపడం ఈ కథలో ప్రత్యేకంగా చెప్పుకోవచ్చు.

బాబు పుట్టినప్పటినుండి కమల తనను సరిగ్గా పట్టించుకోవడం లేదని భర్త భావించడం, బాధ పడడం సహజంగా ఉంది. ఈ కథలోనే కాదు దాదాపుగా అన్ని కుటుంబాల్లో ఇలాంటివి జరుగుతూ ఉంటాయి. అలాంటి సహజ సన్నివేశాలను అందించడం పాఠకులను రంజింపజేస్తుంది. భర్తను ఆనంద పరచడం కోసం బాబును తన తల్లి దగ్గర వదిలిపెట్టి రావడం అనేది భార్య చేసిన త్యాగంగానే చెప్పుకోవచ్చు. భర్త ఆఫీసు పనిలోనే లీనమవడం, భార్య కొడుకు ఆలనా పాలనలోనే గడపడం ఎంత సహజమో ఈ కథలో వివరించారు.

**మేఘనా...**

ఈ కథ మేఘనా, అమిత్ మధ్య నడుస్తుంది. వారి ప్రేమానుబంధాలు, కటుంబ సంబంధాలను ఈ కథ ఆవిష్కరిస్తుంది. మేఘన వృద్ధాప్యంలో ఉన్న తన తల్లి తండ్రులను ప్రేమగా చూసుకోవడం కుటుంబ సంబంధాల ప్రాధాన్యతను తేటతెల్లం చేస్తుంది. తన గురించే కాదు.తన బంధు వర్గాల గురించి కూడా పట్టించుకోవడం మేఘనా వ్యక్తిత్వం. మేఘనా అమిత్ గురించి చాలా తపన పడుతుంది. అమిత్ కూడా మేఘనా లేకపోతే ఒక్క క్షణం కూడా ఉండలేక పోవడం ఈ కథలో ప్రత్యేకత. మేఘనా ఉద్యోగం వదిలేసి తనతోనే ఉండిపోవాలని అమిత్ కోరుకోవడం కుటుంబ సంబంధాలను తెలియజేస్తుంది.

కవిత

# నా జ్ఞాపకాల్లో మా తాతయ్య



భవానీ శ్రీనివాస్

పసిపిల్లలకు మాటలొచ్చేటప్పుడు
ముందుగా అత్త తాత అంటారట
అత్తంటే ఐశ్వర్యం.. తాతంటే ఆయుష్షు
మరి నేనే పదం ముందన్నానో .....
నాకు మాత్రం తాత అనే పదంతో అనుబంధమెక్కువ
తాతయ్య గురించి ఇరవై ఐదేండ్లు
ప్రతిరోజు నాన్న విప్పిన మాటల మూటల్లోంచి...
తాతయ్యను చూసుకునేదాన్ని
సంతోషంలోను.... విషాదంలోను....
మరి నానేమో వాళ్ళనాన్నరూపాన్ని నాలో చూసుకునేవాడు
ఇది మా నాన్నకు అమ్మకు తెల్సిన నిజం

తాతయ్య గురించి నల్లగొండ జిల్లాలో
తెల్వనోళ్ళు ఉండరంటే ఆశ్చర్యం లేదు
ఆ రోజుల్లో చాలామంది పెళ్లిళ్లకు నగల్ని చేసింది తాతయ్యే
నల్గొండ... రామగిరి... ఏడెల్లి... నార్కట్ పల్లి... చిట్యాల...
రామన్నపేట.. రాయగిరి.. సిరిపురం.. ఎల్లెంకి.. భోనగిరి.
ఇలా ఏఊరిలో అడిగినా........
టక్కున చెప్పేది తాతయ్య పేరే
నాన్న అనేవారు మనిషి లేకపోయినా...
తన నిజాయితి మాత్రం పచ్చబొట్టులా నిలిచిపోతుందని
నాన్న మాటలకర్థం మా తాతయ్య గురించేనని
అందరంటుంటే అర్థమయ్యింది

తాతయ్య పనితనం గురించి అందరు గొప్పగా చెప్పేవాళ్ళు
అసలు అడ్డిగా చేస్తే చేపూరి చెల్లయ్యచారే చెయ్యాలట
ఇప్పటికి అమ్మ అడ్డిగాను చూస్తే!
తాతయ్యను చూసినంత ఆనందపడ్తాన్నేను
ఎన్ని కష్టాలొచ్చినా అమ్మ అడ్డిగాను మాత్రం అమ్మలేదు
నాన్న తాతయ్య కు జ్ఞాపకంగా...
ముందు తరాలకు గుర్తుగా.....
ఓ సారి ఓ పెద్దాయన మా తాతయ్య గురించి అన్నాడు
బంగారు నగల్ని చేసే ఆయన మనసు కూడా
బంగారం అని బంగారునగలకు సూర్యరశ్మితో
నగిషీలనద్ది నగల్ని చేసిన ఘనత ఆయనది.

తాతయ్య గురించి విన్నప్పుడల్లా
నేను జీవితంలో ఏమీ సాధించకున్నా
ఎంతో జయించినట్లు ఫీలవుతా
బంగారు నగల్ని చేయడం ఒకవృత్తే కాదు
అదో అద్భుతమైన కళ
మరి ఆ కళ పదికాలాలు నిలవాలంటే!
కళాకారులకు అనుదినం కావలసింది....
Time management.... dedication....
Perfection..... Good attitude..
(I believe my Grandfather was not only
a dedicated worker but also a perfect
human being)
కొన్ని కళలు.... కులవృత్తులు ఎప్పటికీ మాసిపోవు
స్వర్ణకారుల వృత్తి అలాంటిదే
స్వర్ణకారులంటే గొప్ప సృజనకారులు
నేను ఈ స్వర్ణకారుల కులంలో పుట్టినందుకు
గర్విస్తున్నా ఎన్ని మషిన్లొచ్చినా.....
ఎంత ఆటోమాటిక్ అయిపోయినా
కళాకారుని స్థానం కళాకారునిదే
ఏ యంత్రాలఅనకొండలు ఆ కళల్ని మింగలేవు
ఎంత పెద్ద చదువులు చదివినా
మన కులవృత్తుల అవగాహన అవసరం
మనవేళ్ళకున్న కళానైపుణ్యాన్ని నిరంతరం
సానపెట్టుకోవాలి అప్పటి రక్తం యిప్పటికి
మనలో ప్రవహిస్తే!
మన కులాల కుంపట్లనీ ఆరీపోనీకుండా
మన మూలాల్ని మనం రాజేస్తూ.....
మనకులపురాణాల్ని గానంచేస్తూనే ఉండాలి
మసితో.... బొగ్గులతో... సుత్తెతో....
పట్టేడతో... పట్టుకారుతో...
పని అనుకోకుండా అబ్బా బంగారంతో
పని అనుకుంటే ఎంత బాగుణ్ణు
(Not only a coin has two sides but
our thinking also should be)
చదువుతో పాటు కులవృత్తుల
పాఠాలు పిల్లలకు చెప్పాలి
అప్పుడే! కులవృత్తులు కొనసాగకపోయినా
చేపూరిచెల్లయ్యాచారి లాంటి కళాకారులు
అజరామరులౌతారు అందరి జ్ఞాపకాల్లో......



పుస్తక పరిచయం

# కన్నీటి పూలు

**కన్నీటి నేపథ్యం తెలిపే కథల ఆవిష్కరణ...**



నెల్లుట్ల రమాదేవి

అన్ని కథలూ కంచికి చేరవు. కొన్ని గుండెను తాకి పట్టేసి వదలవు. ఊపిరాడనట్టు ఉక్కిరి బిక్కిరి చేస్తాయి. సమ్మెట ఉమాదేవి 'జమ్మి పూలు' కథలు అలాంటివే! 'కాళ్ళు తడవకుండా నదినీ, కళ్ళు తడవకుండా జీవితాన్నీ దాటలేం' అని ఎవరో కవి అన్నట్లు ఇవి కొన్ని జీవితాలను అద్దంలా మన ముందుంచిన ఆర్ద్రత నిండిన కథలు.

మనకెవ్వరికీ తెలియని, మన ఊహకు కూడా అందని చిన్న ప్రపంచం... ఒక్కొక్క పల్లెటూరిలో, తండాలో ఉందనీ. అక్కడ పూల వంటి సున్నితమైన, సుకుమారులైన చిన్నారులు సుడి గాలులకీ, తుఫానులకీ తట్టుకుంటూ, మొరటు మనుషుల కరకు చేతుల దాడికి తమ లేలేత పూరేకులు రాలి పోకుండా కాపాడుకోవడానికి ప్రయత్నిస్తూ ఉంటారనీ ఈ కథలు చదివితే తెలుస్తుంది.

సరియైన చదువు లేక, వేరే విధంగా బ్రతికే దారి లేక బాల్యంలోనే వివాహ బంధంలోకి నెట్టి వేయబడి మొగుళ్ళు నాటు సారాకు బలి అయితే పిల్లల పోషణకూ, కుటుంబ భారం మోయడానికీ తామే ఒక నీడనూ, పళ్ళనూ ఇచ్చే చెట్టులాగా మారిన పూల తీగల్లాంటి స్త్రీలు ఈ కథల్లో అడుగడుగునా కనిపిస్తారు.

రైల్లోనో, బస్సులోనో వెళ్తూంటే దారికి ఇరుప్రక్కలా అందమైన పచ్చని చేలను చూసి మనసు పరవశిస్తుంది. చేను పచ్చదనాన్నో, దానిపై నుండి వీచి మనను తాకే చల్లగాలినో ఆస్వాదిస్తాం. కొందరం ఆ అనుభూతిని అక్షరాల్లోకి అనువదిస్తాం కూడా. కానీ, ఉమలోని మనసున్న రచయిత్రి ఆ చేను పెంచడానికి ఆ రైతు ఎంత కష్టపడ్డాడో, ఎన్ని నిద్ర లేని రాత్రులు మంచెపై కావలి కాశాడో, ఎన్ని వందల సార్లు కనుబొమ్మల పైన చేయి పెట్టుకుని తలెత్తి వర్షం కోసం ఆకాశం వైపు చూశాడో, ఎక్కడ అప్పు తెచ్చి పెట్టుబడి పెట్టాడో తెలుసుకుని ఆ రైతులో పరకాయ ప్రవేశం చేసి రాస్తుంది. అందుకే ఈ కథల్లో జీవం తొణికిసలాడుతుంది.

స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్స్ అన్న మాటే గానీ, వాళ్ళ వెనకాల పెత్తనాలు చేసేది మగవాళ్ళేనన్నది అందరికీ తెల్సిన నిజం. అయితే 'ద్వాలి' కథలో పదిహేనేళ్లకే భర్త చేయందుకుని ఓ




పెద్ద కుటుంబంలోకి కోడలిగా అడుగు పెట్టిన ద్వాలి... భార్యగా, కోడలిగా, తల్లిగా తన బాధ్యతలు పరిపూర్ణంగా నిర్వర్తిస్తుంది. ఆ ఇంటి కోసం రెక్కలు ముక్కలు చేసుకుని చాకిరీ చేస్తుంది. ఓ మనిషిగా బయటి నుంచి వచ్చిన మోతిని ఆదరిస్తుంది. అదే మోతిని తన భర్త పేమ్లా స్వీకరించి ఆమెతోనే కలిసి ఉంటే కూడా మౌనంగా భరించి తాను పిల్లలతో వేరేగా ఉంటుంది. కానీ... తాను ఒక్కతే తండాలో పదవ తరగతి చదివినందుకు సర్పంచ్ పదవికి అర్హత కల్గి ఎన్నికయ్యాక సంబంధిత పనుల్లో భర్త పెత్తనం మాత్రం సహించక అతన్ని హద్దుల్లో ఉండమని సూచిస్తుంది. ఆత్మాభిమానం, ధైర్యం, నిజాయితీ, కష్టపడే తత్వం కల్గిన స్త్రీ కథ 'ద్వాలి'.

ఇక 'జమ్మి పూలు' కథ మొదటి పేజీ అంతా అపూర్వమైన వన సౌందర్య వర్ణనే! చేల ఆకుపచ్చదనం, కొంగల ధవళ వర్ణం, పసుపు, తెలుపు పుప్పొడి కలబోసిన జమ్మి పూల గులాబీ వర్ణం... మొత్తానికి ఈ ప్రకృతే సప్తవర్ణ శోభితం! తల్చుకుంటే ఉమాదేవి అందమైన కవిత్వం చెప్పగలరు అనడానికి ఈ కథ చక్కని ఉదాహరణ. జమ్మి పువ్వులా అందమైన చంప్లీ, ఆమెను ప్రేమతో, ప్రాణంలా చూసుకునే భర్త వాల్యా. ఆమె వెంట వేట కుక్కల్లా పడే వెంకటేశ్, సాంబి రెడ్డి. కట్టె కొట్టి కంచెలు నాటడానికి రాత్రి పూట వాల్యా

పుస్తక పరిచయం



వెళ్ళినప్పుడు తానూ వెళ్ళే చంప్లీ, పండుగ రోజుల్లో పల్లెల్లో దొరికే సంబరాలు పట్నంలో అమ్మడానికి వాళ్ళా వెళ్ళినపుడు పొలం పని చేసుకుంటూ ఉండగా వెంటబడ్డ సాంబి రెడ్డికి ఎలా తెలివిగా బుద్ధి చెప్పింది అనేది కథ. జమ్మి పూలు ఆకర్షణీయంగా ఉండడమే కాదు, తమని నలిపి వేసే వాటి నుంచి రక్షించుకోవడానికి చుట్టూ ముళ్ళను కూడా సిద్ధంగా ఉంచు కుంటాయని ఈ కథ చెబుతుంది. ఈ కాలపు ఆడపిల్లలు చదవాల్సిన కథ.

మొదటి చూపులోనే తనతో ప్రేమలో పడి, తనకోసం పదే పదే పల్లెకు వచ్చి మనసు తెల్పిన పట్నం దొర విరాట్‌తో 'ఇద్దరు మనుషులకు కాదు, రెండు కుటుంబాలకు స్నేహం కలిస్తేనే పెళ్లి, లేకపోతే కలవని అంతరాలతో పెద్దవాళ్ళు సంఘర్షిస్తూ, వాళ్ళ వల్ల మనం కలహిస్తూ ఉంటా' మనే జీవిత సత్యం చెప్తుంది 'దశ్మి'. వయసు ప్రభావంతో ప్రేమలో పడడం, ఆ తరువాత దాన్ని కాపాడుకోలేకపోవడం, విడిపోవడం, ఆత్మ హత్యలూ, పరువు హత్యలూ జరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో యువత చదివి తీరాల్సినది 'దశ్మి' కథ.

రచయిత్రి స్వయంగా మంచి ఉపాధ్యాయురాలు గనుక ఈ సంపుటిలోని పదిహేను కథల్లో మూడు కథలు పాఠశాల నేపథ్యంలోనే ఉంటాయి. తమ వృత్తిని ప్రేమించే వారు, అంకిత భావంతో పని చేసే వారు.. అందరి మన్ననలనూ పొందడం సహజం. 'రెడపంగి కావేరి' కథలో అర్చనా టీచర్ లోనూ, 'ఊరి ఉమ్మడి సిరి' కథలో సరితా టీచర్ లోనూ పాఠకులకు ఉమాదేవి కనిపిస్తారు. పిల్లల్ని ప్రేమించడం, వారి అంతరంగపు లోతుల్ని తెల్సుకోవడం, లాలనగా వాళ్ళకి విద్యాబుద్ధులు నేర్పించడం.. ఇవన్నీ చేసే ప్రభుత్వ ఉపాధ్యాయులున్నారా... అంటే ఉన్నారు, ఉమా దేవి కథల్లో! అంటే, నిజంగా కూడా ఎక్కడో ఉన్నట్లే కదా! అందుకు ప్రత్యక్ష తార్కాణం ఉమ అని చెప్పవచ్చు.

బడి 'ఊరి ఉమ్మడి సిరి' నిజమే.. పాఠశాల సామాజిక ఆస్తి, అన్నదీ నిజమే! ఈ కథ చదువుతుంటే డెబ్బయ్యవ దశకంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న వారికి పుస్తకాల విద్యతో బాటు సామాజిక, సాంస్కృతిక, సంస్కార విద్యను అందించిన ఆనాటి ఉపాధ్యాయులు గుర్తు రాక మానరు.

అయితే, మన వృత్తి మనకెంత ఇష్టమైనా.. మన కాల పట్టిక పూర్తిగా రాయడం.. ముద్రణలో ఇరవై పేజీల కథలో సుమారుగా ఒక్కో పేరాగ్రాఫ్ ఒక పేజీ అంతా ఉండటం వల్ల చదువుతున్న పాఠకులు ఆసక్తిని కోల్పోయి పేజీ తిప్పేసే ప్రమాదం ఉంది. ఆ మాటకొస్తే ప్రతి వృత్తి లోనూ దానికి సంబంధించిన రోజువారీ చాకిరీ ఉంటుంది. ఈ ఒక్కటీ రచయిత్రి గమనించాలి.

సహజ జీవిత చిత్రణ ప్రధానమైన ఈ కథల్లో.. పుట్టిందే తాగడానికన్నట్టు తాగీ, తాగీ భర్తా, కొడుకూ చచ్చిపోతే కోడల్ని కడుపున పెట్టుకుని చూడ్డమే కాదు, మళ్ళీ పెళ్లి చేసి కోడలికి తల్లిగా మారిన 'గంపీ'లున్నారు. కన్న తండ్రి తాగుబోతయి హింసిస్తుంటే, అమ్మమ్మ తల్లికి మళ్ళీ పెళ్లి చేస్తే, ఆమెకు ఇద్దరు కొడుకులు పుట్టాక కొత్త అత్తింటి వారు మొదటి పిల్లైన తనను చీత్కరిస్తుంటే, తల్లి కొత్త జీవితానికి తను అడ్డు రాకూడదని మళ్ళీ అమ్మమ్మ దగ్గరికే వచ్చేసిన పెద్ద మనసున్న పదకొండేళ్ల 'రెడపంగి కావేరు' లున్నారు. తాగుబోతు మొగుడినీ, అతడి మూర్ఖత్వాన్నీ, తన సహనంతో, అత్తా మామల సహాయంతో భరిస్తూ.. అప్పుడప్పుడూ బుద్ధి చెప్తూ తల్లి లాగా దారికి తెచ్చుకునే 'పుల్లీ'లున్నారు. ఎవరేం చెప్పినా వినకుండా వేలిముద్ర వేయకుండా సంతకం పెట్టి మరీ మనస్సాక్షి ప్రకారం ఓటేసిన దేనికీ లొంగని 'భారతమ్మ' లున్నారు. బతకాలంటే బహు మార్గాలున్నాయి, చావే పరిష్కారం కాదని... ఆత్మహత్య చేసుకోబోయిన బంధువులకు బతుకుదెరువు చూపిన 'సత్తెమ్మ'లున్నారు. పెద్దవాళ్ళు 'బతుకు బండి' ఈడ్వలేక పురుగుల మందు తాగి చచ్చి పోయినా, పెళ్లిళ్లు, ఫంక్షన్లలో సర్వింగ్ చేసే ఉపాధి తన తోటి వాళ్లకు కల్పిస్తూ.. బతికే దారి చూపిన 'భోజ్యా నాయక్' లున్నారు.

పలు బహుమతులు పొందిన ఈ కథల్లో నిరంతర శ్రామికులైన స్త్రీలు, గుండెల్లో బడబాగ్నిని దాచుకుని నవ్వుతూ జీవితాన్ని సవాలుగా తీసుకున్న స్త్రీలు, వయస్సుతో నిమిత్తం లేకుండా ఇతరులకు స్ఫూర్తి ప్రదాతలైన బాలికలు, రేపటి తరానికి దారి దీపాలైన స్త్రీలు కనిపిస్తారు. అరుదైన వృక్ష జాతులు, పక్షి జాతులు అంతరించి పోతున్నాయనీ, వాటిని కాపాడుకోవాల్సిన ఆగత్యం ఉందనీ శాస్త్రవేత్తలూ, సామాజిక సేవకులూ గగ్గోలు పెడుతున్న వేళ 'జమ్మి పూల' లాంటి మట్టి మనుషుల్లోని స్వచ్ఛత, అనురాగమూ వసి వాడకుండా చూసుకోవాల్సిన బాధ్యత కూడా సాటి మనుషులమైన మనందరి పైనా ఉందనేది సత్యం. ఒక రచయిత్రిగా, విమర్శకురాలిగా కాక, పాఠకురాలిగా ఈ కథలను నేను చదివాను. మర్మ మెరుగని సాదా సీదా గిరిజన పల్లెవాసుల బ్రతుకులను చిత్రించిన వీడియోగ్రాఫ్ ఈ పుస్తకం. ఈ పుస్తకంలోని ప్రతి కథా అడవి పూల లాంటి స్వచ్ఛత, సరళత, పరిమళం కల్గి ఉన్నాయి. మట్టి మనుషుల జీవితాల్లోని దాపరికం లేని మనస్తత్వాలని మన ముందు పరిచి కళ్ళను తడి చేస్తాయి. ఈ 'జమ్మి పూలు' కథలు. మానవత్వంపై ఆశలను ఇంకా సజీవంగా ఉంచుతున్నందుకు రచయిత్రి సమ్మెట ఉమాదేవి గారిని మనసారా అభినందిస్తున్నాను.

# తెగింపు

స్త్రీకి మరో రూపమైన ధైర్యాన్ని చిత్రిస్తూ....



ఏదునూరి రాజేశ్వరి

గాఢమైన నిద్రలో ఉన్న శారద ఐదింటికి మోగిన అలారంతో లేచి కూచుంది. మెదడుకు సిగ్నల్స్ అందించింది. ఆరోజు షెడ్యూల్ గుర్తుకొచ్చింది. కాంప్లెక్స్ మీటింగ్‌కి వెళ్లాలి. బాక్స్ రెడీ చేసుకొని బస్టాండ్ చేరింది. అంతలోనే టాటా ఏస్ ఆటో డ్రైవర్ సిద్ధిపేట సిద్ధిపేట... అంటూ పిలుస్తున్నాడు.

నాతో(శారద) పాటు ఇంకో ఇద్దరు ఎక్కారు. కమాన్ చౌరస్తా నుంచి బండి గౌరారం చేరింది. అందరం దిగేసి ఊరవుతలి పాఠశాలవైపు అడుగులేశాం. చుట్టూ ఎత్తైన కొండలు గుట్టలతో కొద్దిపాటి గుట్టమీదే ఉన్నట్లు ఉంటుంది ఆ బడి. ప్రార్థన పరిచయ కార్యక్రమాల అనంతరం వేప చెట్టు కింద ఒంటరిగా కూర్చున్న మేడమ్‌పై నాదృష్టి పడింది. పొద్దున్నుంచి సాయంత్రందాక అక్కడే కూర్చుంది. పక్కనే ఉన్న వాణిశ్రీ మేడమ్‌ను ఎవరా టీచర్, తనకి క్లాసులు లేవా అని అడిగా.

తనా.... అదో చరిత్రలే అంటూ వాణిశ్రీ చెప్పుకొచ్చింది. ఆమె భర్త ఓ శాడిస్ట్ వెధవ. స్టాఫ్ రూమ్‌లో కూర్చోవద్దు. ఫోన్ ఎప్పుడు భర్తకు కనెక్ట్ చేసే ఉంచాలి. పాఠం చెప్పేటప్పుడు, ప్రయాణంలో, క్లాస్ రూంలో ఎప్పుడు ఎవరితో మాట్లాడుతుందో వింటూ ఉంటాడు. లంచ్ కూడా ఒక్కతే ఒక రూమ్‌లో కూర్చొని తినాలని ఆ భర్త ఆర్డర్. ఫోన్ పెట్టేస్తే మళ్లీ ఐదు నిమిషాలకు ఫోన్ రింగవుతుంది. ఒక్కోసారి ఆమెని ఆటో ఎక్కించి తనూ వెనకనే బండిపై ఫాలో అవుతాడు. అది ప్రేమా.. భయమా.. భక్తా.. భద్రతనా.. అభద్రతనా.. కాపలానా.. పురుష అహంకారమా నాకైతే ఏది అర్థం కాలేదు.



కథ

నీకేమైనా తెలిసిందా అన్నట్లు నావైపు ప్రశ్నార్ధకంగా చూసింది వాణిశ్రీ.

నేనేమి చెప్పగలను. నా పరిస్థితి అంతే. నా భర్త ఏమైనా సుద్దపూసనా అనుకుంది. సమాజానికి ఎంతో గొప్ప వాడిలాగా, మంచి వాడిలాగా, కనిపిస్తాడు నా భర్త. నేను ఆఫీసు నుంచి ఇంటికెళ్లి అట్లా ఫ్రెష్ అవుతానో లేదో.. ఛాయ్ చేసుకొనిరా... మంచినీళ్లు తెచ్చివ్వు.. కూర్చుకున్నకాడికి అరొక్కటి తెప్పించుకుంటాడు. ఇద్దరు పిల్లలతో నేను సతమతమౌతుంటే సాయం చేయడు. పనిమనిషిని పెట్టుకొనివ్వడు. ఇంట్లోనే ఉంటాడు. వెలగబెట్టే ఉద్యోగం రియల్ ఎస్టేట్. రాత్రి నిద్రపోయాక నా ఫోన్ కాల్ లిస్ట్ చెక్ చేయని రోజుండదు. ఆ ఫోన్ ఎవరు చేసారు? ఈ మెసెజ్ ఎవరు పెట్టారు అని ఎంక్వైరీలు. ఎన్నోసార్లు ఇల్లు సంసారం వదిలి పారిపోదామనుకున్నా. ఆడపిల్లల్ని పెంచి పెద్దచేసి ధైర్యవంతులుగా తీర్చిదిద్దుదామని ఉండిపోయాను. కాంప్రమైస్ నా జీవితంలో ఒక భాగం ఐపోయింది.

లంచ్ టైమ్‌కు స్టాఫ్‌రూమ్‌లో అడుగుపెట్టిన రోజ్‌లిన్ టీచర్.. శారదా అని పిలిచే వరకు దీర్ఘాలోచనలో ఉండిపోయా. హా... రోజ్‌లిన్.. బాగున్నావా.. యూ ఆర్ లక్కీ. పురుషహంకార పంజరం నుంచి స్వేచ్ఛా జీవివి అయ్యావు. "ఏం చేయమంటావ్ శారద.. తను చెప్పేదే వినాలనేవాడు. చర్చకు తావే లేదు. రకరకాల మానసిక వేధింపులు. నా మెదడు ఆలోచన ప్రకారం నడువు. నీ మెదడును ఎప్పుడు ఎక్కడా వాడకు అనేవాడు. ఎన్ని సార్లు బంధువులకు చెప్పినా.. తీరు మారదు. బంధువుల ముందు అన్ని అబద్దపు మాటలు. ఈయన చెప్పేది అబద్ధం అని అందరికీ తెలుసు, ఐనా ఆయనను గట్టిగ ఏమీ అనరు. సంసారం ఉన్నప్పుడు సరుకుపోవాలే అని నన్నే అంటరు. ఇద్దరం యూనివర్సిటీలో ఎమ్మే సైకాలజీ కలిసి చదివినవాళ్లం. ప్రస్తుతం ఇద్దరం వేర్వేరు ఉద్యోగాల్లో ఉన్నాం. ఎక్కువ తక్కువ ఏంటి.. ఎంతకాలం ఈ మానసిక క్షోభ. ఈయన తీరు మారేటట్టు లేదు. అందరికీ జీవితం ఒక్కటే. ఉన్న జీవితాన్నే నేను అనుకున్నట్లుగా జీవించాలి. లేదా ఇద్దరం అనుకున్నట్లైనా జీవించాలి. కానీ ఈ లంపటం సచ్చేదాంకనా.... అనిపించింది. ఠాట్ పో.. వీడు నాకెందుకు నా బతుకు నాది అనుకున్న. నీ జీవితం నీది నా జీవితం నాది అని తెగేసి చెప్పా.. తెగాయింపుతో తెగదెంపులు అయింది" అంటూ ఉత్సాహంగా చెప్పుకొచ్చింది రోజ్‌లిన్.

ప్రస్తుతం భర్త వేధింపులకు గురయ్యే ఎంతమంది ఆడవాళ్లకు నీలాంటి ధైర్యం ఉంది రోజ్‌లిన్... అంటూ హ్యాండ్ బ్యాగ్ వేసుకున్నది శారద. ఇప్పుడు మన ముందున్న ప్రధాన కర్తవ్యం మన విద్యార్థులను, ఆడపిల్లలను ధైర్యవంతులుగా తీర్చిదిద్దడమే. అంతకు మించి మగపిల్లలను మంచి పిల్లలుగా తీర్చిదిద్దడం. ఏ అహంకారాలు లేకుండా పెంచడం, స్త్రీలు పురుషులు సరిసమానం అనే భావనను వ్యాప్తి చేయాలంటూ ఇద్దరూ బస్ ఎక్కి ఇంటికి చేరారు.

---

కవిత

# పెద్దర్వాజ

**వకుళవాసు**

ఇంటికి పెద్దదిక్కోలె ఇంటి
పెద్దర్వాజ...

ఎంత గాంభీర్యం పెద్దపులోలె...

దాని రాజసాన్ని జూసె
వాళ్ళు వీళ్ళు లోపలికి
రావడానికే ఝుడుసుకునేటోళ్ళు...

తొలిపొద్దున మాఅమ్మ
కడపల్లడిగి
ముగ్గుబెట్టినంక చూడాలే
దాని పొగరు...

పండగలప్పుడు దాని సోకె వేరు
పచ్చని మావిడాకులు తలపై
జేరి కమ్మని వాసనలతో ముచ్చట్లు
పెడ్తాంటె ....

పసుపు కుంకాలను పులుముకొని
తెల్లపిండితో నవ్వుల ముగ్గులల్ల
కళకళ లాడుతాంటది
మా పెద్దర్వాజ...

అప్పుడప్పుడు నాకు కొంచెం
పొగరెక్కి కండ్లు నెత్తికి చేరితె....

కాలిగోటుకి ఒక్క పోటు
పొడిసి నేలన్జూసి నడుమని
బుద్దులుజెప్పేది...

సాయంత్రం పూట పనైపొంగనే
పెద్దర్వాజకాడ మా అమ్మ
కూసుంటె...

వచ్చిపొయెటోళ్ళ
పలకరింపులతో కళకళలాడేది...

కాని ఇప్పుడు పొక్కిలిపడ్డ
వాకిట్ల ఎండినాకుల సప్పుడుతో...

చెదల్పట్టి ముసల్దై
మూలుగుతూ రొదబెడ్తాంది మా
పెద్దర్వాజ ....

వలసబోయిన ఇంటిమనుషులకై
ఎదురుజూస్తూ...



వ్యాసం

# తెలంగాణ ప్రాచీన కవయిత్రుల కవిత్వ ప్రాభవం

**తెలంగాణలో నాటి కవయిత్రుల శిల్పాన్ని పరిశోధక దృష్టితో నిలుపుతున్న వ్యాసం...**



డా॥ కొండపల్లి నీహారిణి

అస్తిత్వ చైతన్యం పిప్పొరుతున్న ఈ క్రమంలో తెలంగాణ సాహిత్యం వెలుగులు నిర్మాణాలు చేసుకుంటున్నది. మరుగున పడిన ప్రాచీన కవయిత్రుల గురించి తెలుసుకుంటూ సాగే ఈ వ్యాసం తెలంగాణ సాహిత్య కీర్తి పతాకకు రెపెరెపాల సొగసులద్దుతుంది. మన నిర్లక్ష్యం, వాళ్ళ వివక్ష ఇంకా ప్రాంతీయ అస్తిత్వాన్ని చాటుకోవాల్సిన పరిస్థితులే ఉన్నాయి. మన ప్రముఖ సాహితీవేత్తలు పరిశోధనలు చేస్తూనే ఉన్నారు. చరిత్ర పరిశోధిస్తున్నప్పుడు కేవలం సత్యాలనే చెప్పాలి. కత్తి మీద సాము వంటిదే ఇది. అసూర్యంపశ్యంగా ఉన్నస్త్రీల రచనలను శోధించి, వెలుగులోకి తేవాలి. సూర్యలోకనం చేయించాలి. వేల సూర్యులు ప్రభవిస్తున్న తెలంగాణ నేలపై తెలుగు సాహిత్యంలో స్త్రీల సాహిత్య కేతనం ఎగురవేయాలి.

తెలంగాణ కవయిత్రుల సాహిత్యాన్ని ఒక పద్ధతిలో చర్చించుకోవడానికి సులువుగా కాల విభజన చేసుకున్నట్లైతే 1. ప్రాచీన యుగం, 11 నుండి 14వ శతాబ్దం వరకు అంటే క్రీ.శ 1000 నుండి 1500 వరకు 2. మధ్యయుగం, 15 నుండి 18వ శతాబ్దం వరకు అంటే క్రీ.శ. 1500 నుండి 1900 వరకు 3. ఆధునిక యుగం 19 నుండి 20వ శతాబ్దం వరకు అంటే 1900 నుండి 2000 వరకు 4. అత్యాధునిక యుగం 21వ శతాబ్దం నుండి ఇప్పటి వరకు అంటే మలిదశ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ కాలం నుండి ప్రస్తుతం వరకు అని గ్రహిస్తే కొంత అవగాహనకు వస్తుందన్న ఆలోచన. ఇంకా ఏమైనా మెరుగైన సూచనలు, ప్రాతిపదికలు ఉంటే, ఇంకా సాహిత్య విశేషాలు లభిస్తే మరింత గొప్పగా తెలంగాణ స్త్రీల సాహిత్య చరిత్ర నిర్మాణం చేయవచ్చు.

సాహిత్యంలోని అన్ని అంశాలను క్రోడీకరించుకుంటూ నిర్మాణం జరగాలి. కవిత్వంలో కావ్యాలు, శతకాలు, పద్య సాహిత్యం, అవధాన విద్య, వచన కవిత్వం, ఇందులో అన్ని ప్రక్రియలూ రావాలి. వచన సాహిత్యంలో కథలు, నవలలూ, నాటకాలు, లేఖా సాహిత్యం, పత్రికా సాహిత్యం, వ్యాసాలు వంటివీ, జానపద సాహిత్యం వంటివీ చేర్చుకుంటూ సాగాలి. కవయిత్రుల, రచయిత్రుల వివరాలతో బాటు వారి వారి సాహిత్య కృషిని ఉటంకిస్తూ సాగాలి. అప్పుడే తెలంగాణ స్త్రీల సాహిత్యం సమగ్ర రూపానికి వస్తుంది. ప్రస్తుతం ఈ వ్యాసం తెలంగాణ స్త్రీల కవిత్వంలో ప్రాచీన యుగ, మధ్య యుగ కవిత్వానికి సంక్షిప్త పరిచయాలతో కూడింది.

ఇన్ని సౌకర్యాలు ఉన్నా, ఇంత గొప్ప సందర్భాలు ఉన్నా ఇప్పటికీ ఈ కాలంలోనూ స్త్రీలంతా విద్యావంతులై, చైతన్యవంతులై మనలేకపోతున్నారు. ఆనాటి ఆ గడ్డు కాలంలో సమాజ సంకుచిత భావాలలో, ఆధిక్యతల్లో విద్యకు అవకాశాలు లేక, అధికార, ఉన్నత వర్గాలలో కొందరు సాధారణ స్త్రీలు అందరూ కూపస్థ మండూకాలుగా బ్రతికే ఉండి ఉంటారు. అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో అతి తక్కువ స్త్రీలు చదువుకోగలిగి ఉంటారు. అందులో రచనలు చేసినవారు మరీ తక్కువ అయి ఉంటారు. కొందరి వివరాలు, రచనలు మాత్రమే దొరుకుతున్నవి. ఇంకా విస్తృతమైన పరిశోధనలు జరగాల్సి ఉన్నది. సాహిత్య చరిత్ర పరిశోధకులు అభినందనీయులు.

పనిచేస్తూ శ్రమనుమరిచేందుకు పాడుకున్న ఇల్లాళ్ల పాటలూ, జానపదుల గీతాలు, శ్రమజీవుల మౌఖిక సాహిత్యమంతా వెలగట్టలేని ఎన్నో ఉన్నాయి. ఏదో ప్రామాణికత లేనిదే ఇది ఫలానా వాళ్ళు రాశారు అని చెప్పుకునే స్థితి. వాళ్ళ పేర్లు సాహిత్య చరిత్రలోకి ఎక్కవు. తెలిసినవి రాసుకోవడమే ఇది. ఇంకా తెలియాల్సినవి ఎన్నో ఉన్నవి. ఒక గోలకొండ కవుల సంచిక సవాల్ కూడా ఋజువుగా నిలుచున్నది!

వ్యాసం

**కుప్పాంబిక** తెలంగాణ తొలి కవయిత్రే కాదు, తెలుగు తొలి కవయిత్రి. గోన బుద్ధారెడ్డి సోదరి. మల్యాల గుండనాథుని భార్య. ఆమె భర్త మరణించినప్పుడు 1276 లో బుద పూర శాసనం (మహబూబ్ నగర్ జడ్చర్ల సమీపంలోని భూత్‌పూర్) వేయించింది. అనుమకొండ పురవరేశ్వర కాకతీయ రుద్రదేవ (రుద్రమదేవి) మహారాజుల ఓరుగంటను పృథ్వీ రాజ్యం సేయుచుండంగాను, వేయబడిన శాసనం ఇది. కాబట్టి ఈమె కాలం 135వ శతాబ్దమని నిర్ధారించవచ్చు.

*వన జాతాంబకు డేయు సాయ*
*కములన్ వర్ణింపగారాదు, నా*
*తన బాల్యాధిక యౌవనంబు మదికిన*
*ధైర్యంబు రానీయ, ద*
*త్యను రక్తిన్ మిము బోంట్లకున*
*దులుపనాహా! సిగ్గు మైకోదు, పా*
*వన వంశంబు స్వతంత్ర మీయదు*
*చెలీ! వాంఛల్ తుదల్మూట్టునే!*

యవ్వనవతినై మన్మథుడు మోహాన్ని కలిగిస్తే ఆ అవస్థలను ప్రియ సఖులకూ చెప్పుకోలేదు. తను పుట్టిన గొప్ప వంశం పరువు మర్యాదలు కాపాడాల్సిన బాధ్యత నాది అన్నట్లున్న ఈ పద్యంలోని కవిత్వమూ, భాషా విశిష్టత, విరహ వర్ణనలోని కూర్పు, శైలిలోని రమ్యత కావ్య పద్ధతిలో సాగింది. కుప్పాంబిక భర్త రాజు. ఇతని ఆస్థాన పండితుడుగా ఈశ్వర భట్టోపాధ్యాయుడనే ఉద్దండుడు ఉండేవాడు. ఆమెకు తండ్రి వారసత్వమూ ఉన్నది. విద్యావంతురాలు. తప్పక ఈమె కావ్యం ఏదో రచించే ఉంటుంది. బహుశా ఈ పద్యం అందులోనిదే కావచ్చు. తల్లిదండ్రుల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత కూతురిదే అనే సందేశాన్నిచ్చిన ఈ పద్య సాహిత్యం ఆదర్శమైంది. కుప్పాంబికను తొలి తెలుగు కవయిత్రిగా సంగిశెట్టి శ్రీనివాస్ (ఆంధ్రజ్యోతి 21-9-2008) ఉగ్గడించారు. కుప్పాంబిక కావ్యాలు లభించలేదు. అయ్యల రాజు తన సంకలన గ్రంథంలో కుప్పాంబిక రచించిన ఈ పద్యాన్ని ఉదహరించడం వలన ఇది దొరికింది.

**గంగాదేవి** పండితురాలు. ఓరుగల్లు నివాసి. 14వ శతాబ్దం రెండవ ప్రతాపరుద్రుని కాలంలో అగస్త్యుడు అనే గొప్ప సంస్కృత కవి ఉండేవాడు. ఇతని మేనల్లుడు, కవి పండితుడైన విశ్వనాథుని శిష్యురాలు గంగాదేవి. కాకతీయుల ఆడబిడ్డ, ఆంధ్ర కోడలు.విజయ నగర బుక్కరాయల కొడుకు కుమార కంపరాయల భార్య. ఇతడు మధుర నగరాన్ని జయించిన చరిత్రకాంశంతో మధురావిజయం అనే సంస్కృత కావ్యాన్ని రచించింది. సార్వభౌమునిగా కంప భూపాలుని వర్ణిస్తూ రచించింది.

మహాకవుల ముఖ పద్మాలను రత్న పంజరాలలో విహరించే గోర్వంకై, జ్ఞాన సముద్రాన్ని ఉప్పొంగ చేస్తున్న కౌముదీ మహోత్సవమై అలరు సరస్వతీ దేవికి నా నమస్కారము అంటూ ప్రారంభ శ్లోకంలో రాసిన గంగాదేవి, తదుపరి వాల్మీకి మహర్షి, కాళీదాసు, భారవి, తిక్కన, అగస్త్యుడు, విశ్వనాథుడు వంటి కవులనూ స్మరించుకుంటుంది.

*శ్లో॥ ఉపహరన్ కుసుమాని*
*మహీరుహం, కిసలయై కలితాలి బన్ధన:*
*మధుర కోకిల కూజిత భాషితో*
*మధుర దైన ముపాసితు మాసదతే॥*

చేయితిరిగిన కవయిత్రి, సంస్కృత పండితురాలు అనడానికి మచ్చుతునకలు ఈ శ్లోకాలు, ఈ కావ్యంతో తమ భర్త కంపభూపతి శత్రురాజుల మనస్సుల్ని కంపింపజేసేలా, మలయ పర్వతం ఒక అపూర్వ చిహ్నంగా తేజరిల్లుతుంటే దక్షిణ దిశకు ప్రయాణించాడనీ, యుద్ధ సమయాన ఘాతకులైన తురుష్కులను సంహరించినపుడు రాజు తేజస్సు అనే తెల్లదనం వ్యాపించింది అని వర్ణిస్తుంది. ఛందో వైవిధ్యంతో సాగిన ఈమె రచన బుద్ధి కుశలత కలిగిన కవి హృదయ సత్య దర్శనం చేసినట్లున్నది.

**సోమరాజు ఇందుమతో దేవి 1910-15ల మధ్య కాలంలో జన్మించారు. 1984 సెప్టెంబరులో స్వర్గస్తులయినారు. ఖమ్మం జిల్లా వీరిది. భక్త సోమరాజు రంగారావు వేణుగోపాల శతకం, పతిభక్తి శ్రీరంగనాథ స్తుతి, శాకుంతలాభ్యుదయము అనేవి వీరి రచనలు. శాకుంతలాభ్యుదయము దొరకడం లేదు.**

మధురావిజయం పీఠికతో తెలుగు కవి తిక్కనను స్తుతించింది గంగాదేవి. ఆమె పుట్టి, తిరిగిన నేల ప్రజల భాష తెలుగు. సంస్కృత కవయిత్రిగా పేరు పొందిన ఈమె తెలుగు కవయిత్రి కాదు అని అనకూడదు. ఈ ఒక్క సంస్కృత కావ్యమే దొరికి ఉంటుంది. తప్పకుండా ఈమె శతకాలో, తెలుగు కావ్యాలో రచించే ఉంటుంది. కాల ప్రవాహంలో కొట్టుకుపోయి ఉంటాయి.

వరంగల్ జిల్లాలో గంగదేవపల్లి అనే ఊరు నర్సంపేటకు వెళ్ళే దారిలో ఉన్నది. ఎందుకు ఈ పేరు వచ్చి ఉంటుంది...? అంతర్జాలంలో ఆదర్శ గ్రామంగా మెరిసిపోతున్న ఈ ఊరు వెనుక ఏమైనా దొరుకుతాయా అని ప్రయత్నిస్తే..? మరిన్ని ఊళ్ళకు ఆదర్శం కావచ్చు. కవయిత్రి ఆనవాళ్ళు దొరకవచ్చు.

**మహంతమ్మ** క్రీ.శ. 1833 ప్రాంత కవయిత్రి. మఠం మడి వ్యాళయ్య భార్య. ఇతనూ సహజ రచయిత, వీర శైవ మతాభిమాని. వీరి పేరున మఠము సికింద్రాబాదునందున్నది అని సుంకిరెడ్డి నారాయణరెడ్డి అంటారు.

అంటూ రాసిన మహంతమ్మ కవిత్వం గీతయోగ్యమైన కవితా ధారతో ఉన్నది చక్కని కవిత్వం.

*కోటి మూగవారు నీపై జెప్పిరో*
*బహుకవనముల్*
*వారిపై కృప జేసి యుస్తిరి కోరి వేడిన*
*వరములన్*
*సారముగ జేయించి జగముల పేరు*
*వెలసెను కీర్తించేన్*

మహంతమ్మ సాహిత్యమూ, సామాజిక ఆదర్శ భావజాలమూ, భర్త రచనా సామర్థ్యంపై నున్న నమ్మకమూ

తెలియజేస్తున్నది. మహంతమ్మ పాండిత్యంపై పరిశోధనలు జరగాల్సిన అవసరమున్నది.

రూపాన్ పేట రత్నమ్మ గారు రంగారెడ్డి జిల్లా పర్గి, ఇప్పటూరులో జన్మించారు. వేంకటరమణ శతకం, శ్రీనివాస శతకం రచించారు. ఈమె రాసిన శివకురువంజ యక్షగానానికి చెందిన రచన. తెలంగాణ నుండి ఇది ఒక్కటే ఉన్నదంటారు.

1847 -1929 వీరి కాలం ఈమెను **రత్నమాంబ, రత్నదేశాయి** అని అంటారు.

*కం॥ పలుమరు సంసారంబను*
*వలలో బడి పక్షి విధము వాపోవుచు బల్*
*కల హములు పూని యమ బా*
*టలు పట్టరి జనులు వేంకటాద్రి విహారా!* అంటూ కలహాలు,

కన్నీళ్ళూ నరకప్రాయాలని చెప్పిన రత్నబాయి గారు, భగవంతుని కృపా కటాక్షం లభించాలంటే కల్మష రహితులుగా ఉండాలి అనీ అంటారు. 'శ్రీకృష్ణుని దశావతార వర్ణన' అనే వీరి అముద్రిత రచన ఉన్నట్టు తెలుస్తున్నది. 72 ఏళ్ళ రత్నమాంబ గోల్కొండ కవుల సంచికలో 'సంసారతరణము' అనే కవితను రాశారు. జనకంటకుల గురించీ, అకళంకుల గురించీ 'వేంకటాద్రివిహారా' అనే మకుటంతో శతకంలో అధ్భుతంగా రాశారు. ఒద్దిరాజు సోదరులు నడిపిన 'తెనుగు' పత్రికలో 'శ్రీ గాంధీ మహాత్మునకు' అనే ఈమె కవిత వచ్చింది. కులమతాల ఆచారాలను కుదురు పరచుకోవాలని, బాల్యవివాహాలు రద్దు చేయాలనీ, బ్రిటీష్ ఆంధ్రలో జరుగుతున్న గ్రంథాలయోద్యమాలు ఇక్కడ కూడా జరగాలనీ ఈ కవితలో రాస్తూనే, "నా ఘటమున్నంత వరకు స్వాతంత్ర పోరాటాలకు 12 రూపాయలు సమర్పిస్తాననీ" అన్నారు. బాలబోధ, దశావతార వర్ణన వీరి మంత్ర రచనలని తెలుస్తున్నది.

హిత బోధిని పత్రికలోనూ వీరి రచనలు అచ్చయ్యేది.

"మనకు దెలియకున్న మనదారి మనసాటి/ప్రజల జూచియైన బడయరాదె/సాధుజనుల గూడి సంఘ మేర్పాటుగా/వించి దుర్గుణముల దృంచరాదె" ఎంత చక్కగా సెలవిచ్చారు రత్నమ్మ గారు. కవి హృదయమెప్పుడైనా సమాజ శ్రేయస్సుకొనే కోరుతుందనడానికి ఇదొక నిదర్శనం.

**శ్రీమతి లక్ష్మీ కామేశ్వరమ్మ** 'శ్రీదేవి స్తుతి కదంబం' రాశారు. ఈమె భర్త కొత్తపల్లి వేంకటరామలక్ష్మీ నారాయణ శర్మ. 1875లో సంస్థానాన్ని స్వీకరించిన రాజాపార్థసారథి అస్వరామ పండితుడు. ఈయన దగ్గర విద్యాధికారిగా పనిచేశాడు. ఈమె రచనలూ వెలుగు చూడాలి.

బిజినేపల్లి చెన్న కృష్ణమ్మ 19వ శతాబ్ది కవయిత్రి. సత్యనారాయణ కథా కల్పం, బువ్వ బంతి, పెండ్లి పాటలు రచించారు. చంద్రమమౌళీశ్వర స్వామి శిష్యురాలు. పాలమూరు సాహితీ వైభవంలో వీరి గురించి లభించింది. వీరి సాహిత్యమూ తెలియాలి.

**తిరుమల బుక్కపట్నం కృష్ణమ్మ** ఆత్మకూరు సంస్థాన విధ్వాంసురాలు. బుచ్చివెంకటాచార్యుల రెండవ కూతురు. శ్రీనివాసాచార్యుల సోదరి. సంస్కృతాంధ్ర భాషల్లో, జ్యోతిషంలో పండితురాలు-19వ శతాబ్ది కవయిత్రి.

**మన్నాదేవి** త్రిభువనమల్లు ఆరవ విక్రమాదిత్యుని పట్టమహిషి. ఈమె వేయించిన ఆలంపుర శాసనం 1107-08లో "మృధుమధుర వచన రచనా చతుర కళాప"గా రాసి ఉన్నది. పాలమూరు సాహితీక్షేత్రం శాసనకవుల కృషికూడా గొప్పదే. శాసనపాఠాలు, మహబూబ్ నగర్ జిల్లా సర్వస్వంలో 881 నుండి 1148 పుటలలో ఉన్నవి. "వీటిలో కొన్ని శాసనాలు పాండిత్యాన్ని చాటే శాసన రచనలున్నవి" "ఆ శాసన కవులలో ఈమె కూడా ఉన్నది" అని రామారావు ఆంటారు.

మన్నాదేవికి 'అభినవ సరస్వతి' అనే బిరుదు ఉన్నది. ఈమె రచనలు వెలుగు చూడాల్సి ఉన్నది.

**స్త్రీలు వాకిళ్ళు ఊడుస్తారు. సాన్పు జల్లుతారు, ముగ్గులేస్తారు. వీటిల్లోని కళా నైపుణ్యాన్ని కవిత్వీకరించారు. ఇందుమతిగా మనుమడి పెళ్ళికి కవిత రాసి ఆశీర్వదించింది. ఇది ఈ మధ్యనే లభించింది. అదే వీరి ఆఖరి హస్త సాక్షం అయి ఉంటుంది. "ఎవ్వరు నేర్పిరే చెలియ యీగతి వాయన మిచ్చి పల్కనీ/నవ్విన పువ్వులో దెలుగు నాలి మనోహర కీర్తి వల్లికల్/పువ్వులు పూచెనమ్మ" అంటూ ఆడవాళ్ళ ఆచారాలను అందంగా వర్ణించినది.**

**జ్ఞానాంబ** గారి జన్మస్థలం ఖమ్మం మెట్టు, వరంగల్ జిల్లా. సూర్యనారాయణ స్తోత్రం రాస్తూ నా భర్త పేరు సూర్యనారాయణుడగుట చేతను, నా యుపాస్యదేవత సూర్యనారాయణుడగుట చేతను వీరి యందు నాకు గల ప్రేమ చేతను ద్వార్ధిగా సూర్యనారాయణ మకుటముచే వ్రాసితిని అన్నారు. "స్వామీ! నీ పాదపంకజద్వయమే సంభావించి సేవింతు.... నాధా సూర్యనారాయణా"! అంటూ రాసిన మొదటి పద్యంలో పదపంకజాలను సంభావిస్తానని, అవ్యాజమైన కృపను జూపమని రాస్తుంది.' హృదయేషుడవు, నా మనసే నీ అర్పణ చేశాను అంటుంది.

*శా॥ నిన్ను జూచిన తోడ నే తమము*
*నా నేత్రద్వయంబాయు శు*
*భ్రౌన్నత్వంబగు దారి దోచుమని*
*స్నేహోక్షీయ మానంబుగా*
*దెన్నాండూన్ వినునాకు నీ యెడల*
*నిన్నే నేత్ర మూర్త్యాత్మకం*
*డన్నంజిత్తము సంతసించెడిని నాథా !*
*సూర్యనారాయణా !*

ఓ నాథా! నిన్ను జూస్తుంటేనే నాకళ్ళలోని చీకట్లు తొలగిపోయి "శుభ్రౌన్నత్వంబగు" అంటే, శుభ్రమైన, ఉన్నతమైన దారితోస్తుంది అంటు చక్కని విశేషాణిలను వేసిందీ కవయిత్రి. శుభ్రం అంటే సూర్యుని ప్రకాశమంత తెల్లంది

అనీ, ఉన్నతమైన వ్యక్తిత్వం ఉన్న భర్త అనీ పొగడడం చూస్తాం, ఇదే ద్వర్థిగా చెప్పడం. కవికి ఊహ అనేది ఉండాలి. అదే చూపారు వీరు. ఎంతో(ప్రతిభావంతంగా విశేషణాలని, ఉపమానాలని రాసారు జ్ఞానమాంబ.

**శ్రీమతి లక్ష్మీబాయి** వన్నాజీపేట గ్రామంలో పుట్టారు. నివాసము హైదరాబాద్. ఆలా వేంకటరామిరెడ్డి పుత్రిక. వీరి మరణచింతతో 'మహాపురుషప్రశంస' అని రాసిన కవితలో

"ధారసలాది వర్గములు తల్లడ మల్లడ మందుచుండగా... నధిక శోభారహించితిరయ్యా నాయనా!" అంటూ తండ్రిని 'నాయనా' అని సంభోధించిన పదాన్నే మకుటంగా తీసుకుని రాసింది. వారు పరలోకగతులై అక్కడ శోభగూర్చారు అంటూనే, వారి సత్యపాలనను కీర్తిస్తుంది.

*మ॥ శరణంబందు వచించు*
*శత్రుసమితిన్ శీఘ్రంబుగా బ్రోచితా*
*పరనారీ మణులెల్ల దల్లులనుచున్*
*భావించి రక్షించితా*
*గురుపాదంబులు నాత్మతో,*
*దలచుచున్ గోర్క్షగావించితా*
*ధర నీరూపము నేటితో ముగిసే నా*
*దైవజ్ఞయో నాయనా!*

గొప్పగుణాలుగల తండ్రిని అంతే గొప్పగా వర్ణిస్తూ స్మృతికవిత్వంగా రాశారు.

**ఈ శరీరం క్షణభంగగురమైనదనీ, అరిషడ్వర్గాది అంతశ్శతృవులైనా, బాహ్య శతృవులైనా, హరి భక్తితో జయించవచ్చుననీ అంటారీ కవయిత్రి. ఇంత అని చెప్పలేని జీవితాలు. ఎంతకాలం బ్రతికామా అన్నది కాదు, ఎట్లా బ్రతికామా అన్నది ముఖ్యం. మనశ్శాంతి ఉండాలి. "కాలుడు సమవర్తిమై కాచుచుండ" అంటుందీమె. గొఱ్ఱెలను కాసేవాడిగా కాలుడు వెంటే ఉంటాడు అని ఈమె భావం.**

శరణువన్న శత్రువును కాపాడాలనీ, సత్యవచనాలే వాడాలనీ, పరాయిస్త్రీలను తల్లులుగా భావించాలన్నట్లు జీవించిన తండ్రిగారిని వర్ణిస్తూ శీర్షికకు తగినట్టు రాసింది. 'తల్లడ మల్లడ మైనం' అనే తెలంగాణ పద సోయగాన్ని కూడా పంచిన ఈ కవయిత్రి పసిడికి సువాసన అచ్చినట్లు రాసింది.

శ్రీమతి చి. లక్ష్మీనరసమ్మగారిది రామాయంపేట, అంబర్‌పేట్ తాలూకా. ఈమె స్త్రీల పాటలను, భక్తవత్సల శతకాన్ని వ్రాశారు.

*ఉ॥ ఎమ్మెల వేలరామ! భవదీయ*
*పదాంబుజ గోరన*
*న్నిమ్మెయి చిక్కులంగలంచ నెవ్వరి*
*వేడుదు నెందుబొదునో*
*యమ్మక చెల్ల! యిట్లు తన యాత్మజ*
*నేనియుగావలేనివా*
*రిమ్మ హిషందురే కృపవహించదేటికి*
*భక్తవత్సలా!*

ఈమె భగవంతుణ్ణే తండ్రి అంటూ, 'పూర్ణ కృపాకరంబురాశిగా పోలుస్తూ ప్రేమోర్థివ పూర్ణ భక్తితో కొలుస్తానని కీర్తిస్తుంది. 'వృజినవినాశ' అని సంబోధిస్తూనే త్రి జగదభీష్టదాయుడైన దీన జనోద్ధారున్ని కొలుస్తుంది. వృజినవినాశ అంటే పాపాలను, క్లేశాలను పోగొట్టేవాడని అర్థం మనశ్శాంతిని ఇచ్చి పరంధామానికీ చేర్చుమని, లౌకిక విషయా సక్తులు లేకుండా చేయమని వేడుకుంటుంది. ఇరవై ఏళ్ళకే ఇంతటి పాండిత్యాన్ని ప్రదర్శించిన ఈ కవయిత్రి తండ్రి కూడా విద్వాంసులేనట! "శ్రీకర దీనబంధు సరసీరుహలోచన.."

అంటూ ప్రారంభించి, "సర్వ దుఃఖ హారణా కరుణామాయ భక్తవత్సలా అంటూ భక్తి కవితా మాలికలల్లింది. "ఎమ్మెల రామా?" అంటే, మనోహర-త్వంగలవాడైన ఆ భగవంతుని పొగుడుతూనే తన గోడును చెప్పుకుంటుంది.

అమ్మకు చెల్లెలు, కృప చూపకుంటే ఎట్లనీ 'ఆత్మజ'కు నీ పుత్రికకు అని భగవంతుణ్ణి నిలదీస్తుందీ కవయిత్రి, సర్వ సౌందర్య శోభితం ఈమె భాషా పాండిత్యం.

సీతాపిరాట్టమ్మ నల్గొండ జిల్లా ఈమె కలికాలం చేసే వైపరిత్యాన్ని వర్ణించారు. వీరు ఉపాధ్యాయులుగా పనిచేశారు.

'కలిరాజు' అనే కవితలో

సీ॥ యజ్ఞయాగాది నిత్యాగ్ని
హెూత్రముల్లెల జుట్టబీడీలలో జుట్టబడియే
వేదపురాణముల్ విపరీతములటంచు
నందఱి భావంబుల మరియుండే
భక్తివిజ్ఞానముల్ పరిపూర్ణమై తలన్
గ్రాపురూపంబుతో, గ్రాలుచుండె
నేయింటిపై జూడ నింగ్లీషు భాషలో బేర్లను
జెక్కించి పెద్దలైరి.

*గౌ॥ యాడువారలు మగవారి*
*లందరెల్ల*
*నొక్క సీమంతమున*
*నైక్యమొందిరిపుడు*
*సెప్పగా లేము నీయొక్క గొప్పదనము*
*లేర! కలిరాజ నీ మహిమాద్భుతంబు!*

అంటూ ఫ్యాషన్ ప్రపంచంలో కొట్టుకొనిపోతూ, తమదైన దేశీయతను మరచిపోతున్నారని వాపోతుందీ కవయిత్రి. ఇంత వ్యంగ్యపూరితమైన కవిత్వం ఆ కాలంలోనే వ్రాశారంటే అశ్చర్యమే! "1920లలో 'శోభావతి' నవల రాసిన పిరాట్టమ్మ వీరు ఒకరేనా? పరిశోధించవలసి వుంది" అని కాత్యాయిని విద్మహే అంటారు. ఇంకా కలాలకు చాలా పని మిగిలే ఉన్నది.

**రాణీ వేంకట లక్ష్మాయమ్మ** సర్దేశాయిది ఇప్పటూరు. భర్త రాజావేంకట దుర్గారెడ్డి. వీరు పాపన్న పేట సంస్థాన పరిపాలకులు. గోల్కొండ కవుల సంచికకు పద్యాలు పంపినప్పుడు ఈమె వయస్సు 49 ఏళ్ళు.

*గౌ॥ అంగమా యిది కడు*
*క్షణభంగురము*
*సంపదది యెన్న మిగుల చంచలము*
*గాంచ*
*గాలుడు సమీపవర్తియై కాచుచుండ*
*హరిని ధ్యానించు మానంద మబ్బు*
*మనసా!*
*గౌ॥ బాహ్య శత్రు జయంబున*

వ్యాసం

బ్రాభంబు
గలుగ దెప్పుడ జగతి నిక్కంబు సుమి
మెదుగు కామాది షడ్వర్గ మదిమి భక్తి
హరిని ధ్యానించు మానంద మబ్బు
మనస!

చక్కని చిన్ని మకుటంతో రాసిన పద్యాలివి. ఈ శరీరం క్షణభంగగురమైనదనీ, అరిషడ్వర్గాది అంతశ్శత్రువులైనా, బాహ్య శత్రువులైనా, హరి భక్తితో జయించవచ్చుననీ అంటారీ కవయిత్రి. ఇంత అని చెప్పలేని జీవితాలు. ఎంతకాలం బ్రతికామా అన్నది కాదు, ఎట్లా బ్రతికామా అన్నది ముఖ్యం. మనశ్శాంతి ఉండాలి. "కాలుడు సమవర్తిమై కాచుచుండ" అంటుందీమె. గొఱ్ఱెలను కాసేవాడిగా కాలుడు వెంటే ఉంటాడు అని ఈమె భావం. ఆలోచనాత్మకమైన కవిత్వం ఈమెది. 'మానస బోధ' అనే వేదాంతపరమైన పద్యాలకూ రాసిందీ కవయిత్రి.

**సోమరాజు ఇందుమతి దేవి** 1910-15ల మధ్య కాలంలో జన్మించారు. 1984 సెప్టెంబరులో స్వర్గస్తులయినారు. ఖమ్మం జిల్లా వీరిది. భర్త సోమరాజు రంగారావు వేణుగోపాల శతకం, పతిభక్తి శ్రీరంగనాథ స్తుతి, శాకుంతలాభ్యుదయము అనేవి వీరి రచనలు. శాకుంతలాభ్యుదయము దొరకడం లేదు. చిలకమర్తి లక్ష్మీ నరసింహకవి చదివించుకొని విన్నానని రాయడం వలన తెలిసింది.

"చిదిమిన పాల్గారు చెక్కిళ్ళు గలిగి/ ముదిత యశోదకున ముద్దైన రంగ పొట్టనిండను మెక్కి పొదరిండ్ల డాగి/ దిట్టమై మెలిగిన ధీను తరంగ అంటూ శ్రీరంగ నాథ స్తుత కావ్యంలో సరళసుందరమైన అచ్చతెలుగు పద ప్రయోగాలెక్కువగా చేస్తూ రాసినా అఖిల మౌక్తిక రత్న హారకేయూర/ నిఖిల తత్వాల నిఖిలా త్మరంగ అంటూ ప్రౌఢమైన శైలిలో వ్రాసింది. శతావధాని చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి పీఠిక రాసినారు. వేలూరి శివరామశాస్త్రి, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి, వేటూరి ప్రభాకర శాస్త్రి ఈ కావ్యానికి ముందు మాటలు రాశారు. తానే స్వయంగా తెలుగు, సంస్కృత భాషలు బాగా చదివి పాండిత్యాన్ని సంపాదించుకున్న ఇందుమతి గారు ఒక కవితలో..

"తల్లి ప్రేముడి మరిపించి తండ్రిగాని/ గారబును విస్మృతి గలుగజేసి/సోదరీ సోదరులు నన్ను వాదించు/కంటె నెక్కుడుగా మీరుగారు చంద్రు అని చెప్పుకోగలిగేంత భర్త ప్రేమను పొందారు కాబట్టే, అనీ "విమల రాకా సుధాకర సమమనోజ్ఞమైన మీమూర్తి నెడబాయనార్తి కాదె" అని వర్ణించగలిగారు. తను ప్రేమించే భర్త కంటే, తనను ప్రేమించే భర్తపైన గౌరవమెక్కువ ఉంటుదన్నది వీరి

> **యవ్వనవతివై మన్మథుడు మోహాన్ని కలిగిస్తే ఆ అవస్థలను ప్రియ సఖులకూ చెప్పుకోలేదు. తను పుట్టిన గొప్ప వంశం పరువు మర్యాదలు కాపాడాల్సిన బాధ్యత నాది అన్నట్లున్న ఈ పద్యంలోని కవిత్వమూ, భాషా విశిష్టత, విరహ వర్ణనలోని కూర్పు, శైలిలోని రమ్యత కావ్య పద్ధతిలో సాగింది. కుప్పాంబిక భర్త రాజు.**

కవిత్వం ద్వారా తెలుస్తున్నది. మంగళగిరీ వ్రతంపై పద్యాలు రాసిన ఈమె కావ్యావళి రచనను గురించి వేటూరి ప్రభాకర శాస్త్రి గారు "మెల్లమాంబ, వెంగమాంబల రచన ములదలపించుచు లలితమైయున్నది" అన్నారు వేణుగోపాల శతకంలో

"శ్రీకరముల చెలువున కుద్దియై విలసిల్లు కెందమ్మి విరులదెచ్చి/క్షీరసాగర కన్య చెఱునవ్వు చాయకునొరమై తెలిమల్లె సరుల గూర్చి" ఇట్లా సాగిన ఈ వర్ణనా చాతుర్యం భాషాభిమానులకు తృప్తినిస్తుంది.

"పండుటాకుల రాల్చి పల్లవించినతీవ
కొసలల్లు పొదరింట కసవు జిమ్మి
పునుగు జివ్వా జివా పొలుసు వస్తుల
నీట
ముంపెత్తి కొని వలయంపి జల్లి
ఘనసార తరువుల తనుదాన రాలుక
రూపంబు పొడి జిల్లు ముగ్గు పెట్టి..."

ఇంతటి అల్లిక ఎంత గొప్పగా సాగిందో. స్త్రీలు వాకిళ్ళు ఊడుస్తారు. సాన్పు జల్లుతారు, ముగ్గులేస్తారు. వీటిల్లోని కళా నైపుణ్యాన్ని కవిత్వీకరించారు. మనుమడి పెళ్ళికి కవిత రాసి ఆశీర్వదించింది. ఇది ఈ మధ్యనే లభించింది. అదే వీరి ఆఖరి రచన అయి ఉంటుంది. "ఎవ్వరు నేర్పిరే చెలియ ఈగతి వాయన మిచ్చి పల్కనీ/నవ్విన పువ్వులో దెలుగు నాలి మనోహర కీర్తి వల్లికల్/పువ్వులు పూచెనమ్మ" అంటూ ఆడవాళ్ళ ఆచారాలను అందంగా వర్ణించినది. ఆంధ్ర కవయిత్రులు పుస్తకంలో ఊటుకూరి లక్ష్మీ కాంతమ్మ గారు, "దక్కను సారస్వతమున బాగుగా ప్రసిద్ధురాలయిన కవయిత్రిగా అభివర్ణించారు. ఇందుమతి గారు 'గౌరి' అనే ఖండ కావ్యాన్ని రాసినట్లు తెలుస్తున్నది. ఎప్పుడో 1936లో వచ్చిన వీరి కావ్యావళిని ఇందుమతి కవిత్వం అనే పుస్తకంగా ముద్రణలోకి వచ్చింది. కుటుంబం కోసం భార్యాభర్తలిద్దరూ సమానస్కంధులుగా మంచి భావంతో ఉండాలనీ, గుణవంతుడైన పతిని దేవునితో సమంగా కొలవాలనీ చెప్పిన ఇందుమతి గారు ఆదర్శనీయులు. తెలంగాణలో భావ కవిత్వం ఎంత గొప్పగా వచ్చిందో ఈమె కవిత్వాన్ని చదివితే తెలుస్తుంది.

**ఆండాళమ్మ** గద్వాల జన్మస్థానం. వీరి భర్త కే.శే. బి. వేంకటాచార్యులు. గోలకొండ కవుల సంచికలో ప్రబోధము అనే అంశానికి భరతమాత అనే శీర్షికతో కవిత రాశారు.

గీ॥ బూర్వమును బోలె నిపుడేల
పాడుచు జేసి
నీదు విఖ్యాతి దిక్కుల నివ్వటి ల్ల
జేయు వేలొకో! జేలవో! చిత్రమగును
పరమ కల్యాణ గుణపూత!

భరతమాత! అంటూ సమరస భావ సిద్ధాంతాన్ని చూపే బిడ్డల్ని కనమంటుంది దేశమాతను! శంకరరామానుజులు వంటి కొడుకుల్ని భరతమాత కనమంటుంది.

వ్యాసం

సామాజిక అంశాలను స్పృశిస్తూ, చైతన్యవంతంగా ఉండాలన్న ఆకాంక్ష ఉన్న వారు ఈమె! ఇంకా అంటరాని తనం సమస్య సమసిపోలేదు ఈ కవయిత్రి ఉంటే ఎంత దుఃఖిస్తుండేదేమో!

శ్రీమతి వి. లక్ష్మీ దేవమ్మ గారిది మహబూబ్ నగర్‌లోని అమరచింత. 'నళ' నామ సంవత్సరంలో జన్మించారు. దేశమాత కవితతో పూర్వ కవుల పాండిత్యాన్ని, చారిత్రాత్మక విషయాల్ని స్పృశిస్తూ, "ఎండిన మ్రోడులే నిగురులొత్తగ గీతికల, బాడరే త్యాగయ్య పగిది..దివ్య విఖ్యాత గుణ జాత దేశమాత" అంటారు.

*వీర ధర్మంబు దివికేగి విశ్రమించె/ బ్రహ్మతేజంబుడస్సి విశ్రాంతి గనియె భారతీయులు దౌర్భాగ్య పరతగనిరి/తిరిగి మమ్ముద్ధరింపుమొ దేశమాత!*

కవిత్వం సామరస్యాన్ని, దేశపురోగతిని, ప్రజాస్వామ్యాన్ని కాంక్షించాలి. వీరు భారతదేశ పూర్వవైభవమంతా పునరాగమనం కావాలనే రాశారు. కోటికొక్కడైన భరతమాత పుత్రుల్లో వీరుడూ, సమాజోద్ధారకుడు పుట్టాలని అభిలషిస్తూ కవిత్వీకరించారు.

**పులిగోటి ఆనందమాంబగారి** జన్మస్థలం కొడిమేల, జగిత్యాల తాలూకా, కరీంనగర్ జిల్లా. వీరి తండ్రి పులిగోటి మంగారావు గారు. ఆనందబాయిగారు వేలమంది పృచ్ఛకులతో అష్టావధానం చేసిందని ప్రతీతి.

13 ఏళ్ళ ప్రాయంలోనే అవధానాలు నిర్వహించేవారట. గోల్కొండ కవుల సంచికలో 'స్త్రీ విద్య' అనే అంశంపై కవితరాశారు. దైవభక్తి, దేశభక్తి నుండి మరో అడుగు ముందుకేసి మహిళాసాధికారతవైపు ఆలోచన సారించారు. ఆనాటి సామాజిక పరిస్థితులపై చురకలూ వేశారు.

*విద్యయన్నను స్త్రీలకు వెగటుగల్గ/ వనితల జ్ఞానులను చూచు వాడుకొనుట మబ్బురంబేమి? దీపబునవలద్రోయ/ నున్నయింటిలో, జీకటియుండకున్నె.*

*ఉ॥ కాంతలు మాతృభాషపయి గౌరవముంచక నన్యభాషలన్ శ్రాంతమునేర్చినంతటను సారము లేదిక గొప్పయైన శ్రీ మంతముగల్గి యున్నదని మంగళ సూత్రము బారవైచియ త్యంత సుభూషణంబులను దాల్చిన రీతిని యెంచి చూడగన్!* అంటూ ఏకిపారేశారు. చదువు ప్రాముఖ్యతను, "దీపాన్ని అవతల దోసిన ఇంట్లో చీకటి ఉండదా" అనడం అక్షర జ్యోతికి వెలిగించుకోని స్త్రీలు తమకుతామే అన్యాయం చేసుకుంటే ఈ తెలివి తక్కువతనాన్ని వాడుకొని వదిలేస్తున్నరు ఇందులో ఆశ్చర్యమేమున్నది? మనదైన ఆలోచన ఉండాలి కదా అంటారు. మాతృభాషపై గౌరవం లేక ఇతర భాష నేర్వడాన్ని ఒక వింతైన పోలికతో చెప్పారు. భారత దేశంలో పెళ్ళి ఘట్టానికి చిహ్నంగా ఏదో ఒకటి ఉన్నట్టే, విదేశాల్లోనూ ఉన్నది. తెలుగువాళ్ళు పుస్తెగట్టినట్టే వాళ్ళు ఉంగరాన్ని పెట్టుకుంటారు. నగలన్నీ పెట్టుకొని మంగళసూత్రాన్ని తీసేసినట్టే ఉన్నది, తన భాషను రక్షించుకోకుండా ఇతర భాషపై మోజు మాత్రమే ఉంటే ఎట్లా అని చక్కగా సెలవిచ్చారు .పరభాషలను నేర్చుకోవద్దని అనడంలేదు అమ్మభాషను వదులుకోవద్దని అంటున్నారు.

ఇక్కడ ఒక చిన్న ఉదాహరణను చెప్పుకుందాం. ఔరంగజేబు కూతురు జేబురున్నీసా కవయిత్రి. తండ్రికి నచ్చదు. ఎట్లాగైనా ఆమెను కవిత్వానికి దూరంబెట్టించాలి అనుకుంటాడు. ఉపాయం చెప్పమని కవులనే అడిగాడు. వాళ్ల అమెకొక సమస్యనిస్తాం, అది పూర్తిచేస్తే ఇక అమెను ఆపలేం, ఆపకూడదు అని అన్నారట. అతను సరే అన్నాడట. "ఎక్కడైనా నల్లని ముత్యాలు దొరుకుతాయా?" అని సమస్యనిచ్చారట అందుకామె "దట్టంగా కాటుక ఉన్నకంటికి క్షోభ కలిగిస్తే, ఆమె కంటినుండి నల్లని ముత్యం రాలదా?" అన్నదట. ఇది ఆమె సహజ కవయిత్రి అని అర్థం అయ్యింది.

**ఆయా కాల ధర్మాలను ఎదురించి నిత్య జీవన సమరాన్ని ఛేదించి కలం పట్టిన స్త్రీలు వీళ్లంతా. వారి వారి కళ్ళముందున్న సమస్యలనే చక్కని అర్థవంతమైన ఉపమానది అలంకారాలతో భాషానైపుణ్యంతో, ఆనాటి రచనా విధానాన్ని అనుసరించి పద్యాలతో కవిత్వమల్లారు.**

కంటి ముత్యంలా నల్లని ముత్యం రాలదా! అంటే అంతర్భావం ఎంత గొప్పగా ఉన్నది, ఇదన్న మాట. కవి అనే వాడికే తెలుస్తుంది ఇంకో కవి పడే వేదన. ధ్వన్యర్థం, భావం గ్రహించి, సమస్య ఇచ్చిన వాళ్ళూ నిజంగా గొప్ప కవులే కాబట్టి పూజనీయురాలైన కవి ప్రశంస చేసారు.

కవిత్వం రాయాలని మనస్సులో ఉత్తేజం కలగాలి అప్పుడే కవిత్వం కవిత్వంగా వస్తుంది. ఆయా కాల ధర్మాలను ఎదురించి నిత్య జీవన సమరాన్ని ఛేదించి కలం పట్టిన స్త్రీలు వీళ్లంతా. వారి వారి కళ్ళముందున్న సమస్యలనే చక్కని అర్థవంతమైన ఉపమానది అలంకారాలతో భాషానైపుణ్యంతో, ఆనాటి రచనా విధానాన్ని అనుసరించి పద్యాలతో కవిత్వమల్లారు.

మంగళగిరి రాఘవమ్మ, రాచమళ్ళ సత్యవతీదేవి, పులికుర్తి కమలాదేవి, పాపమ్మ (కరీంనగర్) వంటి మరికొందరి పేర్లు తెలుస్తున్నవి. వీళ్ళ గురించి తెలుసుకోవాలి. ఆధునిక యుగంలో పద్య రచనలు ఎక్కువ చేసిన కొందరు, ఆధునిక వచన కవిత్వ ధోరణులకు కొంత భిన్నంగా కవిత్వం రాసిన కవయిత్రులూ ఉన్నారు. వారి కవిత్వాన్ని మరో వ్యాసంలో చదువుకుందాం. వారిలో కొందరి పేర్లు, చక్రవర్తుల లక్ష్మీనరసమ్మ జొన్నవాడ రాఘవమ్మ, మంతెన ఆండాళ్, శశి సుభాష్, ఎం. సుజాత రెడ్డి, వేదాంతం నాగరాజ్యలక్ష్మి, రామశేషమ్మ.వి, సుచరిత, సూరినాగమ్మ, సి.హెచ్. విజయలక్ష్మి వర్ధన్ మొదలెనవార.



# మట్టి మహిళలదే మార్చి ఎనిమిది (8)

**యేళ్ళ తరబడి మానవ హక్కుల కోసం, రాజకీయార్థిక, సామాజిక, సాంస్కృతిక, సమానత్వాల పోరాటం...**



జూపాక సుభద్ర

శ్రమలో పుట్టి శ్రమలో పెరిగి శ్రమనే జీవనంగా బతికే మహిళల కోసం ఏర్పడిందే మార్చి 8. మార్చి 8, 1910 నాడు ఇంటర్నేషనల్ ఉమెన్స్ సోషల్ కాన్ఫరెన్స్‌లో కమ్యూనిస్టు నాయకురాలు క్లారీ జుట్కీన్ శ్రామిక మహిళల పోరాట దినంగా చేసిన ప్రకటన నే మార్చి 8గా యీనాడు ప్రపంచవ్యాప్తంగా మహిళలు అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా జరుపుకుంటున్నారు. మార్చి 8 అంటే శ్రామిక మహిళలు చేసిన అసాధారణ పోరాటాలకు సంకేతంగా కొనసాగాలనే ప్రతిపాదనలతో మొదలైంది.

ప్రపంచవ్యాప్తంగా వేల యేళ్ల తరబడి మహిళలు మానవ హక్కుల కోసం, రాజకీయార్థిక, సామాజిక, సాంస్కృతిక, సమానత్వాల కోసం పోరాడుతూనే వున్నారు. పారిశ్రామిక విప్లవంతో అమెరికా, యూరప్ దేశాల్లో ఎనిమిది గంటల పని దినాల కోసం, సమాన వేతనాల కోసం, కనీస వేతనాల కోసం మహిళా కార్మికులు తమ నెత్తుటిని ధారపోసి, ప్రాణ త్యాగాలు చేసి పోరాటాల స్ఫూర్తి నందించారు ప్రపంచ శ్రామిక మహిళలు. 1857 మార్చి 8 న్యూయార్క్ లో మహిళా కార్మికులు చిందించిన నెత్తుటి దినమే అంతర్జాతీయ మహిళా పోరాట దినంగా ప్రకటించబడింది.

చికాగోలో చిందిన కార్మికుల నెత్తురు మే 1, 1886. అయితే అంతకన్నా 30 యేండ్ల ముందే న్యూయార్క్ లో చిందిన మహిళా కార్మికుల నెత్తుటి రోజు మార్చి 8, 1857. చికాగోలో నెత్తురు చిందిన మూడేండ్లకే (1889) మేడే ప్రపంచ కార్మిక దినం గా ప్రకటిస్తే... న్యూయార్క్ మహిళా కార్మికులు చిందించిన నెత్తుటి రోజు మార్చి 8ని ప్రపంచ కార్మిక మహిళా పోరాట దినంగా ప్రకటించడం అర్థ శతాబ్దం పట్టింది(1910). యివీ! ప్రపంచ జెండర్ రాజకీయాల చారిత్రక వివక్షలు.

భారతదేశంలో శ్రామిక మహిళలంటే బహుజన కులాల మహిళలే. అంబేద్కర్ చెప్పినట్లు ఇక్కడ కులము శ్రమ విభజనే కాదు, శ్రామికుల మధ్య కూడా విభజన సృష్టించినట్లు గానే ఒకే జెండర్‌లో (ఆడ) కూడా విభజన సృష్టించింది.

భారతదేశ మహిళలంతా ఏక చదరంగా, ఒకే సమూహంగా, ఒకే సామాజికంగా లేరు. అనేక భిన్న సామాజిక కుల మత అస్తిత్వాలుగా వున్నారు. ఎండ కన్నెరుగని మహిళలుగా, ఎండనే జీవితాలుగా వున్న మహిళల జెండర్ రాజకీయాలు ఒకటిగా లేవు. సామాజిక శ్రమల్లో లేని మహిళలు ఆధిపత్య కులాలుగా వుంటే సామాజిక శ్రమలే జీవనాలైన మహిళలు బహుజన కులాలుగా వున్నారు.

ఆధిపత్య కులాల మహిళలు విద్య ఉద్యోగ రంగాల్లో గౌరవనీయ వృత్తుల్లో ముందు వుంటే.. శ్రామిక కులాలైన అంటరాని, ఆదివాసి, బీసీ, మైనారిటీ మహిళలు కూలీలుగా, రోడ్లూడిచే మున్సిపల్ వర్కర్లుగా, కక్కోసులు కడిగే సఫాయి కర్మచారీలుగా, అడ్డా కూలీలుగా, నిర్మాణ రంగంలో తట్టలు మోసే లేబర్‌గా, ఎట్టి ఏసినోల్లుగా, మట్టిపనోల్లుగా గౌరవంలేని శ్రమలు, ఆర్థిక విలువల్లేని హీన రూపాయిగా చూడబడుతూ... మార్జినలైజ్ చేయబడినారు. సామాజిక కుల జెండర్ హెచ్చు తగ్గుల్ని మాట్లాడకుండా, మహిళలంతా ఒక్కటేనని బుకాయిస్తూ... ఒక మోసపూరితమైన వ్యవస్థీకృత ప్రచారాన్ని విస్తరింప జేయడం జరిగింది. భారత సామాజిక ఉత్పత్తి రంగంలో వున్న వర్క్ ఫోర్స్ అంతా బహుజన కులాల మహిళా శ్రామికులు. శ్రమలో వున్న మహిళా సమస్యల్ని, శ్రమ బైట వున్న విశ్రాంతి మహిళా సమస్యల్ని ఒక గాట గట్టి చూడడం వల్ల లబ్ధి పొందిందంతా అగ్రకుల నీడ పట్టునుండే మహిళలైతే నష్టపోయింది అభివృద్ధి ఆవల వున్నది శ్రామిక కులాలైన బహుజన మహిళలు. భారతదేశంలో మహిళా సమస్యలంటే అగ్రకులాల మహిళల సమస్యలనే ప్రాతిపదికగా తీసుకొనడమైతున్నది. అవే సమస్యలు మహిళలందరి సమస్యలుగా ఎజెండా

**ఉత్పత్తి రంగ పరిశ్రమల్లో నలిగే బహుజన కులాల మహిళలకే చదువులు ఎందుకు లేవో, మెరుగైన జీవితాలు, ఉద్యోగాలు, మానవీయ విలువలు, హక్కులు ఎందుకులేవో చర్చ జరగాలి. శ్రమ కులాల మహిళలకే ఆకలి, అవమానాలు అత్యాచారాలు, హింసలు, అంటరానితనాలు ఎందుకు చుట్టుకున్నామో వాటి పరిష్కారాలు మాట్లాడని మౌనాలు.**

చేయడం జరుగుతుంది. బహుజన కులాల మహిళల అభివృద్ధికి ప్రతిబంధకంగా వున్న కులం, వెట్టి, బాల్య వివాహాలు, జోగినీ, నిరుద్యోగం, నిరక్షరాస్యత, అంటరానితనాలు, దొర పెత్తనాలు, దొర్సాని పెత్తనాలు, మగ పెత్తనాలు వంటి అనేక సమస్యల్లో పితృస్వామ్యం ఒకటి. కాని పితృస్వామ్యమే బహుజన శ్రామిక మహిళకు ప్రధాన సమస్య కాదు. కానీ విశ్రాంతి, నీడపట్టున వుండే ఆధిపత్య కులాల మహిళకు పితృస్వామ్య సమస్యనే ఎజెండా జెండాగా వుంది. పితృస్వామ్య విముక్తి అని బహుజన శ్రామిక మహిళల్ని భ్రమ పెడ్తున్నారు తమ ఆధిపత్యాలతో. ఆధిపత్య మహిళలు డాక్టర్లుగా, లాయర్లుగా, ప్రొఫెసర్లుగా, రచయిత్రులుగా, ఉద్యోగినిలుగా, అకాడమిస్టులుగా, ఎన్ జీవో మేనేజర్లుగా, ఆఫీసర్లుగా, ప్రాజెక్టు మేనేజర్లుగా, వ్యాపార సీఈవోలు వంటి అనేక గౌరవ ప్రద వృత్తుల్లో వుండి తమ పితృస్వామ్య ఎజెండానే శ్రామిక కులాల మహిళా ఎజెండాగా నియంత్రిస్తున్నరు. వీరి ఈ నియంత్రణ వల్ల అణచివేతల వల్ల శ్రామిక కులాల మహిళా సమస్యలు వాటి అస్తిత్వాలు, చర్చలు, గుర్తింపులు, ప్రత్యేకతలు, విస్తృతులు అభివృద్ధి అట్టడుగున పడిన అంధకారమైనయి. ఇదంతా వ్యవస్థీకృతమే.

మహిళలంతా ఒక్కటేనని నినదించే నీడపట్టులు, పబ్లిక్ కక్కోసులు కడిగేకాడ, పీతిబకెట్లు మోసేకాడ, అడ్డకూలీగా, నిర్మాణ రంగ కూలీగా ఒక్క అగ్రకుల మహిళ ఎందుకు లేదో చెప్పరు. తట్టలు మోసేకాడ, యెట్టికాడ బాంచ పనుల కాడ అధిపత్య కులం మహిళ కనిపించని కుల జెండర్ రాజకీయాల్ని మాట్లాడరు, అప్రస్తుతం చేస్తారు.

ఉత్పత్తి రంగ పరిశ్రమల్లో నలిగే

**పితృస్వామ్యాల విముక్తి జరిగితే.. శ్రామిక మహిళల ఆకలి, అంటరానితనాలు, అవమానాలు కులాధిపత్యాలు, మలాన్ని ఎత్తిపోసే చేతులకు విముక్తి దొర్కుతదా, జోగినీ పేరుతో దళిత కులాల ఆడవాళ్లని వ్యవస్థీకృత వ్యభిచారంలోకి నెట్టబడ్తున్న దురాచారానికి విముక్తి జరుగుతదా! పితృస్వామ్య విముక్తి అంటరాని, ఆదివాసీ కులాల మీద జరిగే అత్యాచారాలకు, అఘాయిత్యాలకు, హింసలకు, ధ్వంసాలకు విముక్తి కల్పిస్తుందా! అనే అంశాలు అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినము మార్చి 8న అయినా మాట్లాడుకోవాల్సిన సందర్భము.**



బహుజన కులాల మహిళలకే చదువులు ఎందుకు లేవో, మెరుగైన జీవితాలు, ఉద్యోగాలు, మానవీయ విలువలు, హక్కులు ఎందుకులేవో చర్చ జరగాలి. శ్రమ కులాల మహిళలకే ఆకలి, అవమానాలు అత్యాచారాలు, హింసలు, అంటరానితనాలు ఎందుకు చుట్టుకున్నామో వాటి పరిష్కారాలు మాట్లాడని మౌనాలు. శ్రామిక కులాల మహిళల మీద కులాధిపత్యాలు, అసమానతలు మగాధిపత్యాలు ఎంత నిజం, అగ్రకుల మహిళాధిపత్యాలు, అణచివేతలు, అసమానత్వాలున్నవనేది కూడా అంతే నిజము. పితృస్వామ్యాల విముక్తి జరిగితే.. శ్రామిక మహిళల ఆకలి, అంటరానితనాలు, అవమానాలు కులాధిపత్యాలు, మలాన్ని ఎత్తిపోసే చేతులకు విముక్తి దొర్కుతదా, జోగినీ పేరుతో దళిత కులాల ఆడవాళ్లని వ్యవస్థీకృత వ్యభిచారంలోకి నెట్టబడ్తున్న దురాచారానికి విముక్తి జరుగుతదా! పితృస్వామ్య విముక్తి అంటరాని, ఆదివాసీ కులాల మీద జరిగే అత్యాచారాలకు, అఘాయిత్యాలకు, హింసలకు, ధ్వంసాలకు విముక్తి కల్పిస్తుందా! అనే అంశాలు అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం మార్చి 8న అయినా మాట్లాడుకోవాల్సిన సందర్భం.

శ్రామిక మహిళలు ఎదుర్కొంటున్న కనీస వేతనాలు, అసమాన వేతనాల వివక్షలు, పని గ్యారంటీ లేని పరిస్థితులు, ఉపాధి రంగంలో ఎదుర్కొంటున్న వివక్షల మీద పోరాడే స్ఫూర్తిగా మార్చి 8 మహిళా దినోత్సవాన్ని జరపాలి. అసంఘటిత రంగాల్లో వున్న వివక్షలు కోకొల్లలు. నిర్మాణ రంగంలో మహిళలు పారకాల్లె, ఆడమేస్త్రీ కనబడదు. అట్లనే వైరింగ్, ప్లంబింగ్, బస్సు, లారీ డ్రైవర్లు, నాగలి దున్నేపని, సింగరేణి బొగ్గుబాయి కార్మికురాలిగా, డప్పు, బ్యాండు మేళం లాంటి అనేక వృత్తి పనుల నుంచి దూరం పెట్టడం వల్ల ఉపాధి అవకాశాలు శ్రామిక మహిళల కు తగ్గి పోయినయి. ఎవరూ చేయని హీన వృత్తులే ఈ మహిళలకు ఆధారమైన పరిస్థితులు. వీటి పరిష్కారాల కోసం అంతర్జాతీయ మహిళా పోరాట దినోత్సవమైన మార్చి 8 స్ఫూర్తి కావాలి.

**అసంఘటిత రంగాల్లో వున్న వివక్షలు కోకొల్లలు. నిర్మాణ రంగంలో మహిళలు పారకాల్లె, ఆడమేస్త్రీ కనబడదు. అట్లనే వైరింగ్, ప్లంబింగ్, బస్సు, లారీ డ్రైవర్లు, నాగలి దున్నేపని, సింగరేణి బొగ్గుబాయి కార్మికురాలిగా, డప్పు, బ్యాండు మేళం లాంటి అనేక వృత్తి పనుల నుంచి దూరం పెట్టడం వల్ల ఉ పాధి అవకాశాలు శ్రామిక మహిళల కు తగ్గి పోయినయి. ఎవరూ చేయని హీన వృత్తులే ఈ మహిళలకు ఆధారమైన పరిస్థితులు. వీటి పరిష్కారాల కోసం అంతర్జాతీయ మహిళా పోరాట దినోత్సవమైన మార్చి 8 స్ఫూర్తి కావాలి.**

కమ్యూనిస్టు విప్లవ శక్తులు కూడా పేరుకు మార్చి 8ని శ్రామిక మహిళా పోరాట దినమని పిలుపునిస్తున్నా, మహిళలంటే మహిళలే అనే గంపగుత్త రాజకీయమే చేస్తున్నాయి గానీ మగవాళ్ల లాగనే మహిళలు కూడా సమానంగా లేరనీ సామాజికంగా ఆధిపత్య, అణచి వేత కుల జెండర్లుగా వున్నారనే వాస్తవాల్ని శ్రామిక కులాల మహిళల పక్షాన మాట్లాడకపోవడం కూడా శ్రామిక కులాల మహిళల మీద అణచివేతగానే చూడాలి.

ఈ దేశ అభివృద్ధికి, ఈ సమాజ సంపత్తికి అనేక రంగాల్లో రాల్లెత్తిన పోరాట మహిళల స్ఫూర్తిగా జరుపుకోవడమే, నిజమైన అంతర్జాతీయ శ్రామిక మహిళల దినోత్సవం.

# మృత కణం

చదరంగం పావుల్లా
చుట్టూ ఆంక్షల మోహరింపు
ఐనా, నియమోల్లంఘన
కావరంతో కామాంధుల కబళింపు

తోలుపై తొడుగుల మీద
తొడుగుల్లో ఆడ జాతి
నిర్బంధ సమాధి జీవితం
మగాడి నిగ్రహ రాహిత్యం

వజ్ర, రజత, బంగారు, మౌక్తి కాలతో
దేహాన్ని సింగారించక
మనస్సు ను మానవతా
ప్రేమతో అలంకరించు

ఆడది అనుభవ సామాగ్రి ఐతే,
ఆమె దేహంలోని మనస్సు, మస్తిష్కం
ఉనికి దేనికి?

గాలి, నేల, తడి, వేడి
నిర్బంధంగా నిరోధిస్తే నిగ్రహిస్తే...

బీజం ఆధిక్య అహంకార
అస్తిత్వం మృతకణం

ఆడజాతి సమాధులు
కడుతున్న నిగ్రహ రాహిత్య
మగ కామాంధులు



**షహనాజ్ ఫాతిమా**

సాహితీ శిఖరం



## జ్ఞాన్‌పీఠ్ అవార్డు గ్రహీత

# ప్రతిభా రాయ్



ఒరియా సాహిత్యవేత్త ప్రతిభా రాయ్ 2011లో జ్ఞాన్ పీఠ్ అవార్డును పొందారు. ప్రతిభా రాయ్, తన మాతృభాష ఒడియాలో నవలలు, అనేక కథలు రాశారు. ఆమె రాసిన మొదటి నవల “బర్షా బసంత బైశాఖ” విశేష ప్రాచుర్యం పొందింది. ఆమె రాసిన సృజనాత్మక రచనలకు గాను అనేక జాతీయ, రాష్ట్ర పురస్కారాలు పొందింది. సమానత్వం, ప్రేమ, శాంతి, సమైక్యత వంటి అంశాలపై పరిశోధనలు చేస్తూ, అనేక నవలలు రచించారు. అరణ్య, నిషిద్ధ పృథివి, ఆదిభూమి వంటివి ప్రతిభా రాయ్ ప్రముఖ రచనలు.

## నోబెల్ సాహిత్య బహుమతి

# ఎలైస్ మన్రో





ప్రముఖ కెనడా రచయిత్రి ఎలైస్ మన్రో సాహిత్యంలో నోబెల్ బహుమతికి ఎంపికయ్యారు. చిన్న చిన్న పట్టణాల్లోని సామాజిక వాతావరణాన్ని, మానవ సంబంధాలను, నైతిక సంఘర్షణలను తన కథల్లో వర్ణించారు ఎలైస్ మన్రో. కథా వస్తువు కంటే కథ చెప్పే తీరుకే ప్రాధాన్యమిచ్చే శైలితో ఎలైస్ మన్రో అనతి కాలంలోనే సాహిత్య రంగంలో విశిష్ట స్థానాన్ని సంపాదించుకోగలిగారు. ‘ది డెమైన్షన్స్ ఆఫ్ ఏ షాడో’ పేరిట తొలి కథ రాశారు. ‘డాన్స్ ఆఫ్ ది హ్యాపీ షేడ్స్’ పేరిట 1968లో వెలువరించిన కథా సంపుటి ఎలైస్ మన్రోకు అంతర్జాతీయంగా గుర్తింపు తెచ్చి పెట్టింది. లైవ్స్ ఆఫ్ గర్ల్స్ అండ్ విమెన్, ద మూన్స్ ఆఫ్ జూపీటర్, డీయర్ లైఫ్ వంటివి ఎలైస్ మన్రో ప్రముఖ రచనలు.

కథ

# సంకల్పం

**లంబాడి సంస్కృతిని, పట్టుదలను చెప్పే కథ....**



జ్వలిత

"రేపు సైట్ ఇన్స్పెక్షన్ ఉన్నది వర్కిన్స్పెక్టర్, ఇంజనీర్ భోజనాలకొస్తరు, వంటకాడికి నువ్వు కూడా పో, వంటలు బాగలేక పోతే, పని కరాబైతది, ఏదో ఒక వంక పెడ్తరు చెరువుకట్ట కట్టుబడిని" అన్నడు జానమ్మ మొగడు రాత్రి అన్నం తిని పండుకునే ముందు.

"అయ్యో ! రోజు నే బోకుంట అంత వంటామె మీద వదలి పెడతన్ననా ! నా కోసమన్న రుచిగ వండుకోవాలె కదా!" అన్నది జానమ్మ.

"నిజమే లే, కానీ రేపు కొద్దిగ జాగ్రత్తగ వండండి. నాటు కోడి కోసితెస్తడు సారయ్య. మంచిగ మరింత అల్లమేసి వండాలె. పనోళ్ళకు పోసే పప్పుచారు కాకుండా, వేరే చిక్కగ చేయించు, దోసకాయ పచ్చడి, గడ్డ పెరుగు ఉండేట్టు చూడు" అన్నడు.

"సరె సరె ఇంగ పండుకో అన్నిటికి బుగులే నీకు" అన్నది.

అడువుల్ల రోడ్లేసుడన్నా, చెరువు కట్టలు కట్టుడన్నా మద్దెల దరువే గుమస్తాలకు. గుత్తేదార్లు పట్నంల కూసుంటరు బద్రంగ.

అడవిల అన్నలొచ్చినా , ఆఫీసర్లొచ్చినా గుమస్తాలకే ఉరుకులు పరుగులు.

కమలాపురం అడువుల్ల కామారం దగ్గర చెరువు కట్ట కడతాన్రు. అక్కడ గుమస్తా జానమ్మ మొగడు. తాడ్వాయి దగ్గర కామారంల కొయ్యోళ్ళ ఇంట్ల ఉండుకుంట పని చేయిస్తాండు.

రోజు పాతిక మంది కూలోళ్ళకు అన్నాలు వండిస్తరు. ఎప్పుడన్నా అన్నలు ఆఫీసర్లొస్తే నీసు కూడ వండుతరు ఇదంత అలవాటే జానమ్మకు.

తెల్లారి మొగడు చెప్పినట్టే దగ్గరుండి జాగ్రత్తగ ఐదారుగురికి సరిపడ వండిచ్చింది. మధ్యాహ్నం మూడింటికి ఇద్దరు ఆఫీసర్ల తోటి వచ్చిండు భోజనాలకు వాళ్ళాయన. అన్ని గిన్నెల్ల పెట్టి ముందల పెట్టింది. జానమ్మ మొగడు వడ్డిస్తాండు ముందన్నం పెట్టిండు కోడికూరెయ్యబోతే ఒకాయనేసుకున్నడు, ఎర్రంగున్న రెండోయన నేను తినను కోడికూర అన్నడు. అన్నమంత ఇస్తరు మధ్యలకు జరిపి గుంట చేసిండు అండ్ల సాంబారు పొయ్యమన్నడు , అండ్లనే సాంబారేసుకున్నంత పెరుగేసుకున్నడు అంత శ్రద్ధగ పులిహోర కలిపినట్టు కలిపిండు, పక్కన దోసకాయ పచ్చడేసుకున్నడు. వంచిన తలెత్తకుండ విస్తరి ఖాళీ చేసి లేచి చెయ్యి కడుక్కున్నడు. జానమ్మ మొగడందించిన తువ్వాలతో చేతులు తుడుసుకుంట "భోజనం బాగుందయ్యా చిన్నప్పుడు మా తండాల దేవుడ్ని పెడితే చేసే పప్పుచారున్నట్టు ఉన్నది, గడ్డపెరుగు సాంబారు చాలా బాగుంది" అనుకుంట పొయ్యి జీబెక్కిండు. జానమ్మ మొగడు కూడ ఆయనెనక సీట్ల కూసున్నడు.

జానమ్మ ఆయన తిండిని ఇచిత్రంగా చూసింది. తన ఫ్రెండ్ ధ్వాళి కూడా పెద్దాఫీసర్ అయిందని విన్నది. ఈనె కూడ లంబడాయనా ఇంజనీర్ అయినా తన తండాని మరిచి పోలేదు.

ఆయన మాటలతో గతంలోకి ఎల్లి పోయింది. ఎన్నాళ్ళయింది తన దోస్తు ధ్వాళిని చూడక. తన పెండ్లయి పదేళ్ళాయె. ఎన్నిసార్లు పుట్టింటికి పోయినా తన దోస్తు కలవలే.

ఆరోజులు గుర్తుకొచ్చినయి మళ్ళీ. జానమ్మకు.

☆ ☆ ☆

"వాడీర్ కూండి దేకేరీ చోడ్ దే సస్రు" (వడ్లోల్ల పిల్ల చూస్తంది వదిలిపెట్టు మామా) అంట గింజుకుంటంది సుక్కి. అప్పుడప్పుడు ఇనపడే చప్పుడే అది. అయినా తలకాయ తిప్పి చూడలేదు జానమ్మ. ఇటువంటివి విన్నప్పుడు చాలా కోపం వస్తది. కని తనేం చెయ్య గలదు. వయసులో వాళ్ళ కంటే చిన్నది వాళ్ళ మనిషి కాదు.

ఆ గుడిసెలుంది లచ్చునాయకుడు ఇంకో ఆడమనిషి. బాయికాడికొచ్చిన

ఆడోల్లతో మాటలు కలిపి ఇంట్లకు పిలుస్తడాయన చిన్నచిన్న పనుల వంకతో , ఎవరు చూడక పోతే బలవంతంగా గుంజుక పోతడు. పెద్ద అరెకరమంత జాగల ఒక చివర ఇల్లు గొడ్లకొట్టం పంచాయతీ ఆఫీసుకోసం సర్కార్ పక్కాగ డంగు సున్నంతో కట్టిచ్చిన ఒక అర్ర. అండ్లనే లచ్చునాయకుని ఆటలు.

సంగతి తెలిసినా మోతుబరని భయపడతరు, తమూరి సర్పంచ్ అని తండల జనం ఎదురు చెప్పరు. ఇంటింటికొక సారా బట్టి ఉంటది. ఆబ్కారోళ్ళు పట్టుకున్నపుడు ఇడిపిచ్చే దిక్కు వాడే. అందుకని లొంగిపోతరు. ఏదో ఒకటి గొడ్లకొట్టం ఊడ్చుమని, గిన్ని శనక్కాయలు ఒలువమని, బియ్యంల పోటెయ్యమన్నంత చిన్న పనే, వాడడిగినప్పుడు వొల్లప్పజెప్పుడు. వాడికది ఆట, చాలామందికది రోత.

అందరికీ తెలిసిన సంగతే అయినా జానమ్మకు నచ్చలేదు. జానమ్మకే కాదు చిన్నసీతానాయకుని మనవరాలు బాసికి నచ్చలేదు, సోగ్లా కోడలు గోరికి, శక్రు బిడ్డ సక్లీకి, ఔసులోల్ల సుగుణకు, తురుకోళ్ళ యాకుబ్బీకి ఎవరికి నచ్చట్లేదు. వీళ్ళంత ఒక్కడోల్లు కాకపోయినా సోపతోల్లు. నీళ్ళకు పోయిన కాడ బట్టలుతికెటందుకు

చెరువుకు పోయినకాడ మాట్లాడుకునేటోల్లు గియన్ని.

బాయికి పోయినప్పుడు తను చూసిన సంగతి అమ్మకు చెప్పిందొకసారి "ఆ ఇచ్చకాయలన్నీ నీకెందుకు. నీళ్ళు చేదుకొని వచ్చేదానికి" అని తిట్టింది. ఇంకెవరికీ చెప్పే ధైర్నం చెయ్యలేదు మల్ల.

గయన్ని ఆలోచించుకుంట బాయి కాడ బొక్కెన కోసం ఎతికింది, కనపడలేదు. చుట్టు చూసింది ఎవరన్నా వస్తున్నరేమో అని. ఎవరొచ్చేట్టు కనపడలేదు.

మళ్ళ మాటలినపడ్డయి. "తమ్మె బోస్సి కూండి కాంయి కరే ? ఒన్నె బళ్ళా ఒన్నే సులా. (ఆగు, వడ్లోళ్ళ పిల్ల ఏం చేస్తది) మొగోడి మాటలు వినపడ్డయి. జానమ్మకు పూనకం వచ్చింది. "ఈ మోర్దోపు

**"వాడీర్ కూండి దేకేరీ చోడ్ దే సస్రు" (వడ్లోల్ల పిల్ల చూస్తంది వదిలిపెట్టు మామా) అంట గింజుకుంటంది సుక్కి. అప్పుడప్పుడు ఇనపడే చప్పుడే అది. అయినా తలకాయ తిప్పి చూడలేదు జానమ్మ. ఇటువంటివి విన్నప్పుడు చాలా కోపం వస్తది. కని తనేం చెయ్య గలదు. వయసులో వాళ్ళ కంటే చిన్నది వాళ్ళ మనిషి కాదు.**

బట్టెబాజ్ గాడు నన్ను కలుపుతాండా" అంతే అగ్గి మీద గుగ్గిలమైంది.

" ఏయ్ నాయకుడా నీ మాటలు ఇనపడ్డయి. అరేయ్ నీ మాటలు ఇన్నరా! నువ్వు చేసేది చూసిన, అందరికీ చెప్తా చూడు" అనుకుంట కిందికి ఒంగి ఒక రాయి తీసుకొని అర్రలకి ఇసిరేసి, ఖాళీ బిందె తీసుకొని ఇంటికొచ్చింది.

జానమ్మ తల్లి ఉత్త బిందెతో వస్తున్న బిడ్డను చూసి తిట్టుడు మొదలు పెట్టింది. "ఏమైంది నీళ్లు అయిపోయినయని ఒర్రంగ ఒర్రంగ పెద్దబిందె పట్టినవు, దానితో ముంచబోయి బాయిల మునిగి ఛస్తవా! అంటె. చిన్నబిందె తీస్క పొయి ఊపుకుంట ఉత్తగొచ్చినవ్ ఏమొచ్చిందే నీకియ్యాల" అడిగింది.

తల్లిని చూస్తే బాయికాడ జరిగిన సంగతి చెప్పబుద్ది కాలేదు. కోపం పౌరుషం ఏం చెయ్యలో తోచని తనం.

"గొడ్ల మంద ఎదురొస్తంది, ఆ ఎర్రమట్టి దుబ్బల నేను బోను. కొద్దిగాగి మల్ల పోత అరవకే" అనుకుంట. వంట గుడిసెలకు పోయి, మంచినీళ్ల కుండల నీళ్లు, గిలాసతో ముంచుకొని తాగింది. కుండల నీళ్లు అడుగున ఉన్నయి. నీళ్ళు చేదుకొని వచ్చేదుండె. కోపంల ఉత్తగొచ్చింది. వాడన్నమాటలు తలుచుకుంటెనే కోపమొచ్చింది. చిన్నగ నడుచుకుంట ఇంటెనకున్న కుంకుడు చెట్టు కిందికి చేరింది చికాగ్గా.

జానమ్మకు కోపం వచ్చినప్పుడల్ల కుంకుడు చెట్టు కిందికి పోద్ది, దాని కింద ముత్తాలమ్మ గుడి ఉంది. కుంకుడాకులు తెంచి పొరక పుల్లలు, తుమ్మముళ్ళు గుచ్చి చిన్న చిన్న ఇస్తరాకులు, దొప్పలు కుట్టడం ఇష్టం తనకు. గవి చూసి చిన్న బొప్పివా బొమ్మలాటలాడెటందుకని, తల్లి తిడతది. అట్ల తిట్టకుండా ఉండేటందుకు చెట్టు కింద రాలిన కుంకుడు కాయలు కొన్ని ఏరుకొని తెచ్చేది. ఇప్పుడు కాయలు చెట్టుకింద లేవు. రాయితో కాయలు రాలగొట్టి ఏరుకొని ఇంటికి వచ్చింది.

జానమ్మ కనపడంగనే తల్లి మల్లీ మంచినీళ్ల గోల మొదలుపెట్టింది. జానమ్మకు నీళ్ల బాయికాడికి పోవాలనిపించటం లేదు. కానీ తప్పదు మంచినీళ్లు కావాలి. బిందె పట్టుకొని సర్కార్ బాయికాడికి బయలెల్లింది.

ఏబై గుడిసెలున్న ఆ తండా మధ్యలో బాయి తవ్వించి, చుట్టూ ఎత్తుగోడలు కట్టించి, రెండు వైపుల గిరకలు పెట్టిచ్చింది సర్కార్, ఆ తండాలో ఉండే జనం తాగేటందుకు. ఆ చుట్టు పక్కల రెండు మూడు తండాలకు అదొక్కటే మంచి నీళ్ళబాయి.

ఆగస్టు నెల అది. నిండుకుండోలె చేతికందేటట్టు బాయి నిండా నీళ్లున్నయి.

**వాళ్లు తిరిగొచ్చేటారికి ఇంటి ముందల జనం గుమిగూడిన్రు. జానమ్మ తండ్రి పంచె సర్దుకుంట ఎవర్నో తిడతాండు " ముడ్డి కడుక్కోవాల్నన్న సోయిలేదు, ఆకులు పెట్టి తుడుసుకుంటరు కని, గుడంబ తాగి పెండ్లాల కొడతరు మురికి బడ్లు" అంటాండు మాంచి కోపమ్మీదున్నడు. ఎదురుంగ భద్రి జుట్టంత లేచి పోయి, లేవలేక కూసోని "యాడీయే మన్నె మారేరో హీడా! తార్ నామ్ బుడ్జా! మార్ హాత్ తోడేరో"(వామ్మో నన్ను సావగొట్టిండే, నీ పేరు మునిగిపోను, నా చెయ్యి ఇరగ్గొట్టినవ్రో) అంట రాగాలు పెడతాంది. వాళ్ళల్లో తండ్రినైనా అన్ననైనా మొగుడినైనా 'అరె' అంటరు. 'ఏ బా ఆరే' ఓనాన్నా రారా" రకారం తప్పుకాదు వారి జాతిలో.**

ఒక్కోతడవ చేదెయ్య కుండనే బిందెతో నీళ్లు ముంచుతది జానమ్మ. తనకట్ల ముంచడం ఇష్టం. కానీ అది పెమాదమని "ఎప్పుడో అండ్ల మునిగి చస్తవే" అని తల్లి తిడతది. ఆలోచిస్తా బాయి వైపు నడుస్తున్న జానమ్మకి దూరం నుండే బాయి చుట్టూ జనం కనపడ్డరు. ఏమైందోనని గబగబ బాయి కాడికి చేరింది. ఎవర్నడగకుండనే జరిగింది అర్థం అయ్యింది. ఏ యాడీ, ఏ బాయి, ఏ బియ్యా అనుకుంట గోలగోలగున్నది.

సుక్కి బాయిల పడ్డది, నీళ్లు ముంచ పోయి అందులో మునిగింది. ఇంకా బయటకు తీయలేదు, అడుగు పట్టిందేమో అంటున్రు.

జానమ్మకు గుండె గుబెల్లుమన్నది. తాను చూసినందుకో! లేకుంటె అందరికీ చెప్తన్నందుకో! భయపడి చచ్చిపోయిందేమో!. అయ్యో తను చూసినందుకు ఒక మనిషి చచ్చిపోయిందా! వాడు చంపేసిండా ? అనుకుంది. దూరంగ లచ్చు నాయకుడు పెద్ద పెద్దగా జీతగాళ్ళ మీద అరుస్తుండు.

"మోకులు, పగ్గాలు తెండ్రా. ఇంకెంతసేపు చూస్తరు, బయటకు తీయండి, పానం అంటే లెక్కలేద్రా" అంటూ హడావుడి చేస్తున్నడు.

జానమ్మ అటుకెల్లి చూసింది, అప్పుడే వాడు కూడా జానమ్మ కెల్లి చూసిండు. వాడి చూపులు ఆమెను భయపెట్టినయి. తలొంచుకొని ఇంటికి వచ్చింది.

తల్లి మళ్లా అరుసుడు సురూ చేసింది.

" ఏమొచ్చిందే ఉత్త బిందెతో మల్లొచ్చినవు"అంట.

" ఎవరో లంబడామె బాయిల బడి సచ్చిందట. చుట్టూ జనం ఉన్నరక్కడ" అన్నది చిన్నగ.

"అంత చిన్నగా చెప్తన్నవు, ఎవరో చచ్చిన్రని, ఇప్పుడు మనకు నీళ్లెట్ల".

తల్లి గోల తల్లిది మళ్ళీ వంట గుడిసెలకు పోయి నీళ్ల కుండలనించి గిలాసెడు నీళ్లు ముంచుకొని గట్టగట్ట తాగింది, అయినా భయం తగ్గలేదు. బిందె అందుకొని సలివాగు దారి పట్టింది.

బిందె పట్టుకొని నడుస్తున్న జానమ్మకు దార్ల ఔసులోల్ల సుగుణ కలిసింది. సుగుణ జానమ్మ దోస్తే. ఇద్దరు కలిసి మూడుమైళ్ళ అవతలున్న సలివాగుకు పోయి బిందెల నిండా నీళ్ళు నింపు కొని, ఎవరింటికి వాళ్ళు బోయిన్రు. దార్ల ఏం మాట్లాడకుంట నడుస్తన్న జానమ్మను, "ఏమయిందట్లున్నవని" సుగుణ గుచ్చి గుచ్చి ఎన్ని మాట్లడిగినా, అమ్మ తిట్టిందిలే అన్నది. ఎవరికేం చెప్పబుద్ది కాటల్లే జానమ్మకు. బుగులు బుగులుగున్నది.

మసగపడ్డంక గాసునూనె దీపంబుడ్లు పాతగుడ్డతో తుడిచి గాసునూనె నింపి ముట్టిచ్చింది. తల్లి వంట చేస్తాంది. నాయిన దీపం బుడ్డి కాడ కూసోని బీడి తాగుకుంట పెన్సిల్తో అప్పుల లెక్కలు రాస్తండు. "ఇగో ఆర్నెల్లల రెండొందల అప్పయింది, ఇంటన్నవానోయ్" అని పిలిసిండు పెళ్ళాన్ని. జానమ్మ తండ్రికి అప్పంటే భయం.

"అబ్బో మలావయింది, తీర్సక పోతే గుండ్లెత్తుతరు నీకు" అంట ఎక్కిరించు కుంట బయటికొచ్చింది.

"పావే జానమ్మ" అని. "ఇగో తలుపేసుంచు, సప్పుడయితె సూడు పిల్లి తిరుగుతాంది. రోజు లెక్కలేత్తే అప్పు తీరది, మేం బయట్కి పోతన్నం" అనుకుంట నీళ్ళున్న పెద్ద పెద్ద ఇత్తడి చెంబులు చెరొకటి పట్టుకొని డొంక దారి పట్టిన్రు తల్లీ బిడ్డలు.

వాళ్లు తిరిగొచ్చేటారికి ఇంటి ముందల జనం గుమిగూడిన్రు. జానమ్మ తండ్రి పంచె సర్దుకుంట ఎవర్నో తిడతాండు గుడంబ తాగి పెండ్లాల కొడతరు మురికి బద్లు" అంటాండు మాంచి కోపమ్మీదున్నడు.

ఎదురుంగ భద్రి జుట్టంత



కథ

లేచి పోయి, లేవలేక కూసోని "యాడీయే మన్నె మారేరో హీడా! తార్ నామ్ బుడ్జా! మార్ హాత్ తోడేరో"(వామ్మో నన్ను సావగొట్టిండే, నీ పేరు మునిగిపోను, నా చెయ్యి ఇరగ్గొట్టిన(వో) అంట రాగాలు పెడతాంది. వాళ్ళల్లో తండ్రినైనా అన్ననైనా మొగుడినైనా 'అరె' అంటరు. 'ఏ బా ఆరే' ఓనాన్నా రారా" రకారం తప్పుకాదు వారి జాతిలో.

పక్కనే భద్రి మొగడు తడిసిన బట్టలతో కూలబడి భద్రికెల్లి సూసుకుంట" బొస్సి రోమత్, మనె అంగోళి కరె కోని కేన్ మార్ పరువు నికాళేన్ మార్ కాయి బోల్దేరో అంగోళి, బోల్డోర్ టాండ్రీ సారె ధారూర్ నిసా ఉతార్దీ" (ఏడ్వకు నేను స్నానం చెయ్యట్లేదని అందరికీ చెప్పి నా పరువు తీసినవ్, తన్నులు తిన్నవ్ తాగిన నిషా అంత దిగిపోయింది) అంటాడు.

భద్రి కొడుకు ఐదేండ్లోడు తల్లిని పట్టుకొని "ఏ యాడి రో మతే బూక్ లాగ్రో ధళయా దే యాడీ"

(ఓ అమ్మ ఏడ్వకే, ఆకలయితాంది బువ్వేద్దువురా) అని ఏడుస్తాండు. సంగతర్థమయింది జానమ్మకు, తండ్రి చేతుల కట్టె పేడు పట్టుకొని అట్లనే ఉన్నడు.

తండ్రి కోపంగుంటె తల్లి నోరెత్తదు. బయట గాబు కాడ కాళ్ళు కడుక్కొని ఇంట్లకు బొయ్యింది తల్లి. జానమ్మ భద్రి కాడి కొచ్చి నువ్వు సారొండకుంట ఉంటె, నీ మొగడు తాగడు నిన్ను కొట్టడు కదనే అన్నది.

"యాడియే ఊకో జానమ్మ. నేనొండక పోతే తండల కరువు పోయింద సార , తినే జొన్నలు ఎత్తక పొయ్యి సారదా గొస్తడు వాడు. వాడినిప్పుడు అంగోళి చెయ్యమని ఉడుకు నీళ్ళు పెట్టిన గందుకు కట్టె తీస్కొని ఉరికిచ్చి కొడతాండు. మీ నాయన అడ్డం రాకుంటే సంపేసును" అని ఏయాడి అని రాగాలు మొదలు పెట్టింది.

ఎవరో వచ్చి భద్రిని లేపి ఆమె గుడిసె కెల్లి తీసక పొయిన్రు.

జానమ్మ తండ్రి కట్టె పేడు ఆడ పారేసి "లే లే , లేసి ఇంటికి పొయ్యి నీళ్ళు పోసుకొని పొడి గుడ్డలు కట్టుకుపో. నీళ్ళు పోసుకోమంటె పెండ్లాన్ని కొడతరారా తిక్కల సన్నాసి" అని గద్దిస్తే తడిచిన బట్టలతో లేచి గొనుక్కుంట సోలుక్కుంట గుడిసెకెల్లి పొయ్యిండు భద్రి మొగడు.

జానమ్మకు ఇదంతా రోజు చూసేడిదే అయినా చికాకుగ ఉంది. పొద్దున జరిగింది మళ్ళీ గుర్తుకొచ్చింది అన్నం తిన బుద్ది కాలే. ఆ భయంల, చికాకుల కూడా తండ్రి భద్రి మొగణ్ణి తిట్టిన తిట్టు అర్థం కాలేదు. ఆమె ధ్యాస ఆ మాట మీద పడ్డది. తల్లి దగ్గరకు నడిచింది.

తల్లి సాపలేసి పక్కలు పరుస్తాంది. తండ్రి అన్నం తిని బయట కూసొని బీడి కాలుస్తాండు.

అమ్మా అని పిలిచింది. ఆం ఏమాదికొచ్చింది ? తిండి తినలేదు ఆకలైతది. ఆ గిన్నెల గంజున్నది ఇంత ఉప్పుగల్లేసుకొని తాగుపో అన్నది.

పోపో బొల్లిప్పుడు తోముతవా పొద్దుగల్ల తోముతవా?" పని పురమాయించింది తల్లి"

"పొద్దుగాల తోమ్తలే" అనుకుంట సాప మీద ముడుసుకొని పండుకుంది. నిజమే ఎన్నడు జాస పెట్టలే. గిదేం ఆచారం అనుకున్నది. రేపెల్లుండి కిట్టునాయకుని బిడ్డ ధ్వాళి పట్నంకెల్లస్తది అన్ని అడగాలె అనుకుంది.

ధ్వాళి హాస్టల్ల చదువుకోసం పోయింది. ఇద్దరు కలిసి ఏడో తరగతి వరకు సదవుకున్నరు. మంచి దోస్తులు. సెలవులకొచ్చినప్పుడల్ల ధ్వాళి జానమ్మింటికొస్తది. ఇద్దరు కలసి ధ్వాళి వాళ్ళ మిరపతోట కాడికో, మామిడి తోటకో పోతరు. జానమ్మోళ్ళకు భూములు లేవు తండ్రి వడ్రంగం చేస్తడు.

జానమ్మ ఎదురు చూసిన ఆదివారం వచ్చింది. ధ్వాళి కూడ వచ్చింది. ఇద్దరు మామిడి తోటలకు పోయిన్రు ముచ్చట్లాడటానికి. ధ్వాళి తన హాస్టల్ సంగతులు చెప్పింది.

"మా హాస్టల్ ఇన్స్పెక్షన్ కు ఆఫీసరు

పక్కనే భద్రి మొగడు తడిసిన బట్టలతో కూలబడి భద్రికెల్లి సూసుకుంట"బొస్సి రోమత్, మనె అంగోళి కరె కోని కేన్ మార్ పరువు నికాళేన్ మార్ కాయి బోల్దేరో అంగోళి, బోల్డోర్ టాండ్రీ సారె ధారూర్ నిసా ఉతార్దీ" (ఏడ్వకు.. నేను స్నానం చెయ్యట్లేదని అందరికీ చెప్పి నా పరువు తీసినవ్, తన్నులు తిన్నవ్, తాగిన నిషా అంత దిగిపోయింది) అంటాడు. భద్రి కొడుకు ఐదేండ్లోడు తల్లిని పట్టుకొని " ఏ యాడి రో మతే బూక్ లాగ్రో ధళయా దే యాడీ" (ఓ అమ్మ ఏడ్వకే, ఆకలయితాంది బువ్వేద్దువురా) అని ఏడుస్తాండు.

వచ్చిండు. వాడు మా ఆడ పిల్లల్ని అవి ఇవి అడుక్కుంట భుజాల మీద ఆడీడ చేతులేసిండు. మా వార్డెన్ చూస్తనే ఉంది , ఏ మంటలే? వాడేమో మీ వార్డెన్ ప్యాడ్లు ఇస్తందా హిహి ఇంటికి కొంటపోతందా హిహి అనుకుంట ఎకిలెకిలి చేసిండు" అన్నది ధ్వాళి.

"మరి మీ వార్డెన్ ఏమనలేదా?" అనడిగింది జానమ్మ.

"వాడామె సుట్టమట ఏమంటది. మా వార్డెన్ మాకు ఇవ్వాలిసిన గుడ్లు స్వీట్లు అన్ని ఇంటికి తీసుకపోతది. పైగా నేను మంచిదాన్ని. వేరే వార్డెన్లయితే ఇండ్లల్ల పనిచేయించుకుంటరు , ఆఫీసర్ల రూములకు పిల్లలను పంపుతరని చెప్పుద్ది" అన్నది ధ్వాళి.

జానమ్మకు సుక్కి యాదికొచ్చింది. జరిగిందంత ధ్వాళికి చెప్పింది.

"ఔను మాకు పెదనాయినయితడు సర్పంచి. వాడి సంగతందరికి తెలుసు. ఎవరేమనరు , పోయినేడాది సోమ్లీ కోడలు వాడు సెయ్యబట్టే బాయిలపడి సచ్చింది" అన్నది ధ్వాళి.

"ఔను కని మీకు భూములున్నయి,

పదవులున్నయి, సదువులున్నయి గీ గలీజేంది'' అన్నదీ జానమ్మ.

"ఏం గలీజు మాదికూడా రాజుల జాతే రాజపుత్ వంశం మాది. భూములు, ఎకరాల కొద్దిపొలాలు ఉన్నవాళ్ళు భూస్వాములోతిగ దొరలోతిగ బుద్దులు జూపెట్టుకుంటరు. భూములు లేనోళ్ళు పశువుల మందలతో సంచార జాతులుగా తిరుగుతుంటరు. మాదాంట్ల లేనోడున్నడు ఉన్నోడున్నడు. ఉన్నోడు లేనోడిని పీడించుడున్నది. ఏం చేస్తాం'' అన్నది విచారంగా ధ్వాళి.

"అది సరే. బయిలుకు పోతే ఆకులే వాడుతరట కదా. గిదేందబ్బా'' జానమ్మ.

సిగ్గనిపచ్చింది ధ్వాళికి. అయినా దోస్తేగా అనుకుంది.

"చెప్పిన కదా ! మాది సంచార జాతి, రాజపుత్లమని. అంటే రాజస్థాన్ మా ప్రధాన స్థానం. నీటికోసం మైళ్ళ కోసం ప్రయాణం చెయ్యాలి. నీటి ఎద్దడిని ఎదుర్కొనే అలవాట్లలో ఇదొకటయ్యుంటది. మా వాళ్ళు ఇంకా అట్లుండుడు చికాకే. కొందరు మారుతున్నరు శుభ్రంగా ఉంటున్నరు. మిగిలినోళ్ళు కూడ మారతరు, ఒకళ్ళను చూసొకళ్ళు'' అన్నది.

మళ్ళీ తనే "నేను బాగ చదువుకొని కలెక్టర్ అయితా వీళ్ళందరికీ ఇంటింట పాయఖానాలు కట్టిస్తా'' అన్నది ఆలోచిస్తా.

"మరి మాకు కట్టిచ్చవా'' అడిగింది జానమ్మ.

"ఎందుకు కట్టించను? ఐనా నువుకూడా చదువు కోవచ్చు కదా! నువ్వాఫీసరైతే నువ్వు కూడా ఏదంటే అది చేయచ్చు'' అన్నది ధ్వాళి.

"ఔను నేను పోలీసునై సర్పంచను పట్టక పోతా. బొక్కలిరగ్గొట్టి టానాల పెడతా'' అని.

మళ్ళీ నీరసంగా "ఈ ఏడు నాకు పెండ్లి చేస్తరట మా వాళ్ళు'' జానమ్మ.

"అయితే ఈ సారి తీజ్ పండగకు బాగ ఆడుకోవాలె. మళ్ళ కలుస్తమో లేదో నీ పెళ్ళయితె'' అన్నది ధ్వాళి.

"ఏ ధ్వాళి తార్ యాడి బళ్ళారి( మీ అమ్మ పిలుస్తాంది)'' అనుకుంట వచ్చిండు వాళ్ళ జీతగాడు.

దోస్తులిద్దరు ఇంటి దారి పట్టిన్రు.

★ ★ ★

"అమ్మా... అమ్మా.... "

వంటామె పిలుపుకి ఈలోకంలకు వచ్చింది.

"వంటలు చాలా మిగిలినయి. రాత్రికి పనోళ్ళకు మాత్రం వండితే చాలు బియ్యమియ్యండి'' అంటాంది.

జానమ్మ ఆలోచిస్తూ లేచింది. బియ్యం వంటామెకిచ్చి వచ్చి టీవీ పెట్టింది వార్తలొస్తున్నాయి.

వార్తల్లో "జిల్లా కలెక్టర్ ధ్వాళి నాయక్ మరుగుదొడ్లు లేని ఇండ్లకు రేషన్ కార్డులు రద్దు చేస్తారని ప్రకటించారు. పల్లెల్లో తండాల్లో ప్రతి ఇంటికి ప్రభుత్వం మరుగుదొడ్లు మంజూరు చేసింది''. టీవీలో తన దోస్తు ధ్వాళిని చూపిస్తున్నరు.

"ఎంత బాగుందో ! తన దోస్తు... అనుకున్నది సాధించ గలిగింది కదా'' జానమ్మ తనే కలెక్టరైనంత సంబరపడ్డది.

# గజల్

గద్వాల కిరణ్ కుమారి



అమ్మగా అందరికీ ప్రేమను పంచాము.
అన్నదమ్ములను అప్తులను ఆదరించాము.

తాత తండ్రుల యింట కంటి పాపలమైనా
మా మెట్టినింటిలోనా శిలువను మోసాను

గుండెల్లో ఎన్నెన్ని గాయాలే వున్నా
తంగేడు పువ్వంటి చిరునవ్వును దాల్చాము

రాళ్ళల్లో ముళ్ళల్లో రాగాలు తీస్తూ
రైతు బిడ్డలమవుతూ పంటను తీసాము.

నాయకత్వములోనా నాగమ్మలైనాము
సమ్మక్క సారక్కల తెగువను నేర్చాము

కవి కోకిలమై కవనరంగాన గెలిచీ
స్వేచ్ఛ కోరుతూ సాయుధ పోరును నడిపాము

చిందు ఎల్లమ్మగా దేశ ఎల్లలు దాటీ
పెద్దమ్మ తల్లి బోనం మొక్కును దీర్చాము

కోమలులమైనా గానీ కోమినూరులు
వీర నారులమనే ఘనతను చాటాము

సేవలు చేసిన గొప్ప పదవులు పొందినా
కిరణా ఓర్పుతో జాతికి క్షమను చేర్చాము.

కథ

# చెల్లె

పురుషస్వామికంలో కూడా దానిగ
మానవత్వ కోణం గూర్చి చెబుతూ....



రోహిణి వంజరి

సుల్తాన్పూర్ బస్టాప్ నిర్మానుష్యంగా ఉండే. అర్ధగంట నుంచి చూస్తున్న ఒక్క బస్సు కూడా వస్తలేదు. అసలే అమాస పోయి మూడు రోజులే అయింది. చుట్టూ చిమ్మ చీకటి. మాటి మాటికీ వాచీ చూసుకుంటున్న. టైం తొమ్మిదైంది. అప్పటికి ప్రమీల చెప్తనే ఉంది "ఉపేంద్రా... ఇంత చీకటి పడ్డాక ఊరికి ఒక్కదానివే ఎట్లా పోతావే. ఈ రాత్రికి హాస్టల్లోనే ఉండు. పొద్దునే వస్తానని మీ ఆయనకు ఫోన్ చేసి చెప్పు అంది".

ఈ రోజు సుల్తాన్ పూర్ బి.ఎడ్. కాలేజీలో ఆఖరి రోజు. ఫేర్ వెల్ ఫంక్షన్. సాయంత్రం ఐదు గంటలకు ప్రోగ్రాం మొదలైంది. మధ్యలో నేను వచ్చేద్దాం అనుకుంటే ప్రోగ్రాం చివరలో నేను పాట పడాల్సి ఉండే. పోనీ హాస్టల్ లో ఉందాం అనుకుంటే ఇంటికి రాలేదని మా ఆయన చేసే లొల్లి కంటే, అమ్మ ఇంకా రాలేదని నిద్రపోకుండా ఎదురు చూసే నా చిన్నారి పోరి, పోరడు గురించే నా రంధి అంతా. వాళ్ళ బాబు అన్నం పెడితే వాళ్ళు మంచిగా తినరు. అదే నా బాధ. అందుకే ఎంత లేట్ అయినా ఊరికి వెళ్ళి పోవాలని బస్టాపుకి వచ్చా.

నాకూడా ఉన్న మా క్లాస్ అబ్బాయిలు ఇద్దరు సిద్దిపేట బస్సు రాగానే వెళ్లి పోయారు. ఇక బస్టాపులో ఒంటరిగా నేను మిగిలాను. బస్టాపు పక్కన ఉన్న స్తంభం మీద లైట్ వెలగాలా వద్దా అని పరేషాన్ అవుతున్నట్టు ఉండుండి ఆరిపోయి వెలగతా ఉంది. ఫంక్షన్ కోసం చేతులకు పెట్టుకున్న మైదాకు లైట్ వెలుతురు పడ్డప్పుడల్లా ఎర్రెర్రగా మెరుస్తా ఉంది. తొందరగా రాని బస్సును అప్పటికి వంద సార్లు తిట్టుకుంటా చీకట్లో బిత్తర బిత్తరగా నిలబడుకోని ఉన్నా.

ఏడనుంచో రెండు కుక్కలు అరుచుకుంటూ వస్తున్నాయి. ఎవరైనా వస్తారేమో అని చూసిన. మనిషి జాడ లేకుండె కానీ, నేను ఒక్కదాన్నే ఉండడం వాటికి వింతగా ఉందేమో మీద మీదకి వస్తున్నయ్. వంగి రాయి తీసుకుని "చే చే పో" అంటే దూరంగా పాయినై. చీకట్లో మిణుగురు పురుగులు స్తంభం మీది లైటుతో పోటీపడి మెరుస్తా, ఆరిపోతా ఉండగా బస్సు హారన్ వినపడింది నాకు. పోయిన ప్రాణం తిరిగొచ్చినట్లయింది.

ఇంతలోనే చీకటిని చీల్చుకుంటూ అతివేగంగా వచ్చిన ఓ కారు సిద్దిపేట వైపు దూసుకు వెళ్ళింది. కారులో నుంచి పెద్ద పెద్దగా అరుపులు, కేకలు వినిపిస్తా ఉండే. కారులోని వాళ్ళు నన్ను చూసినారేమో అని భయం వేసింది నాకు. ఐదు నిముషాలకు తాబేలుకు నీరసం వేసి నడవలేక నడిచినట్టు మెల్లగా వచ్చి ఆగింది బస్సు. కండక్టర్ బస్సుడోర్ తెరిచి అలవాటుగా పటాన్చెరు అని అరిచి నేను ఒక్కదాన్ని ఉండడంతో అరవడం ఆపేసాడు.

ఒక్క ఉదుటన బస్సులోకి గెంతినట్టు ఎక్కిన. గుప్పున ముక్కు పుటాలకు తాకింది గుడుంబా వాసన. బస్సులోకి తొంగి చూసిన నేను. డ్రైవర్, కండక్టర్ మరో ఇద్దరు మగవాళ్ళు తప్ప బస్సులో ఇంకెవరూ లేరు. ఒక్కక్షణం బస్సు దిగేద్దామనుకున్నాను. అప్పటికే టైం తొమ్మిది ముప్పావు అయింది. ఇంకో బస్సు ఎప్పటికి వస్తుందో ఏమో. ఎటూ తేల్చుకోలేక ఏదైతే అదైతదని బస్సు లోపలికి పోయి డ్రైవర్ సీట్ కి వెనుక రెండు సీట్ల అవతల కూర్చున్న. ఇక ఎవరు ఎక్కరని కండక్టర్ బస్సు డోర్ విసురుగా లాగి గట్టిగా మూసిండు.

బస్సు మరీ పాతది లాగా ఉంది. సీట్లన్నీ చినిగిపోయి పీచు బైటకు వచ్చి ఉండే. కండక్టర్ రైట్ రైట్ అనగానే కాసేపు ముందుకు, వెనక్కు ఊగి తర్వాత కదిలింది బస్సు మెల్లగా. పది నిముషాలకి సంగారెడ్డి ఊరు బస్టాండ్ బయటే ఆగింది బస్సు. రెండు చేతుల్లో ఉన్న బరువైన సంచులతో దిగిపోయిండు ఒకతను. చీకట్లో గల్లీ చివర ఓ షట్టర్ దగ్గర చిన్న లైట్ తప్ప ఇంకేమి కనిపిస్తా లేదు నాకు. ఇక బస్సులో డ్రైవర్, కండక్టర్ కాక ఇంకో

అతను సీట్లో ఒరిగిపోయి నిద్రలో ఉన్నడో, మత్తులో ఉన్నాడో తెలుస్తలేదు నాకు. డ్రైవర్ సీట్ పైన చిన్న లైట్ తప్ప బస్సు లో లైట్లు కట్టేసాడు కండక్టర్. గుడుంబా వాసన ఎవరి దగ్గర నుంచి వస్తోందో సమజైతలేదు నాకు.. ముక్కుకు రుమాలు అడ్డం పెట్టుకున్నాను. తెరిచిన కిటికీ లోనుంచి రివ్వున గాలి ముఖానికి కొడుతోంది. కిటికీ డోర్ సగంపైనా మూసిన. అయినా గాలి విసురు తగ్గుతలేదు.

త్వరగా ఇంటికి వెళ్ళాలి అనుకున్నాను. బస్సు మాత్రం నిండు చూలాలు అడుగులో అడుగు వేస్తున్నట్టు కదులుతోంది. కండక్టర్ లైట్ వేసి నా దగ్గరకి వచ్చి టికెట్ కొట్టాడు. అప్పుడు చూసాను కండక్టర్ ముఖంలోకి కాస్త పరీక్షగా. బుర్ర మీసాలు, గుబురు గడ్డం తో బుగ్గ మీద లోతైన గాటుతో చూడ్డానికి కండక్టర్‌లా కాక బందిపోటు దొంగ లా అనిపించాడు. బస్సు కంది చౌరస్తాలో ఆగింది. నిద్రలో ఉన్న అతన్ని కండక్టర్ తట్టి లేపిండు. అతను ఉలిక్కి పడి లేచి మళ్ళా సీట్ మీదకు ఒరిగిపోయాడు. గుడుంబా తాగింది అతనని అర్థమైంది నాకు.

మళ్ళీ కండక్టర్ గట్టిగా అరిచి లేపేసరికి తూలుతూ లేచి రెండడుగులు వేసి డోర్ దగ్గర మళ్ళా పడిపోఇండు. అతన్ని పట్టి లేపి డోర్ తీసి కిందకు గోకర కాయల బస్తాని విసిరినట్టు బయటకు నెట్టి బస్సు దిగి అతన్ని గల్లీపక్కగా వదిలి వచ్చి బస్సు ఎక్కిండు కండక్టర్.

"ఛీ ఛీ, ఎదవా గలీజు నాయాలు.. మస్తుగా తాగిండు అన్నా. ఇంటికి పోకుండా ఆడనే పడిపోయిండు" అని ఇంకేదో బూతు మాట అని గబుక్కున నా వంక చూసి గతుక్కుమన్నాడు కండక్టర్. బస్సులో ఇపుడు డ్రైవర్, కండక్టర్, నేను. మేము ముగ్గురమే. పటాన్చెరువు చేరనికి ఇంకా ముప్పావు గంట పట్టవచ్చేమో ఈ చీకట్లో. బస్సు ముందుకు కదిలింది. నా ఆలోచనలు వెనక్కి కదిలినై.

పెళ్ళి అయి, ఇద్దరు పిల్లలైనాక కూడా ఇపుడీ చదువెందుకు, ఊర్ల కానీ ఏలాలా అంటూ అత్తమ్మ, మా ఆయన రోజుకో సారి లొల్లి చేసినా వినకుండా పట్టు వదలని విక్రమార్కుడిలా బి.ఎడ్ ఎంట్రన్స్ ఐదు సార్లు రాసినా. ఈ సారి మంచి రాంక్ వచ్చి సుల్తాన్పూర్లో సీట్ వచ్చింది. చదువంతా అయిపోయింది. ఇంకో వారంలో పరీక్షలు.

కిటికీలో నుంచి పేడబుర్ర పురుగు అనుకుంట విసురుగా వచ్చి నా కంట్లో కొట్టడంతో ఆలోచనలు ఎగిరిపోయాయి. విపరీతంగా కన్ను నొస్తుంది, మండుతుంది. ఒంటి కన్ను నుంచే నీళ్ళు కారిపోతా ఉన్నయి. చున్నీ అంచు నోట్లో పెట్టుకుని ఊది కన్ను మీద పెట్టు కున్నాను. ఏడుపు వస్తుండే నాకు. కండక్టర్ ఏదో చెప్తుంటే డ్రైవర్ వెనక్కి వెనక్కి తిరిగి నా వంక చూస్తుండే. ఒంటి కన్ను తెరిచి చూస్తున్నాను భయంగా వాళ్ళ వంక. డ్రైవర్ కూడా కండక్టరుకి ఏ మాత్రం తీసిపోకుండా గుబురు గడ్డం, ఎర్రటి కళ్లతో భయం గొలిపేలా రౌడీ లెక్క ఉండే. నా మనసులో పరేషాను మొదలైంది.

ఐదు నిముషాలు గడవంగనే బస్సు ఒక్క కుదుపుతో ఆగింది. ఇంకా ఇస్నాపూర్ కూడా రాలే. ఇక్కడ బస్సెందుకు ఆపారు అనుకున్న క్షణమే



**గుర్తొచ్చిన దేవుళ్ళకంతా మొక్కతా ఉన్న. పది నిముషాల తర్వాత డ్రైవర్, కండక్టర్ బస్సు ఎక్కిన్రు. టైర్ మార్చినారేమో ఇప్పటిదాకా. బస్సు కదిలింది. కానీ నా భయం మాత్రం వదలలేదు. కన్ను మంట ఇంకా తగ్గలేదు. ఇది మెయిన్ రోడ్ కదా పోలీసులు తిరుగుతారని బస్సును దారి మళ్లించి ఇంకెక్కడికైనా తీసుకుపోతారేమో అని ఆలోచిస్తా బిక్కు బిక్కు మంటు చూస్తూ ఉండగానే బస్సు పటాన్చెరు బస్టాండ్‌లోకి వచ్చిఆగింది.**

నా మనసు ఆగమాగం అయింది. చుట్టూ చిమ్మ చీకటి. నా వంటిమీద ఎక్కువ బంగారం లేకపోయినా మెడలో ఉన్న పుస్తెల తాడు, చేతుల్లో ఉన్న రెండు గాజులు బంగారువే. ముక్కు పుడక కోసం, కాలి పట్టీల కోసం హత్యలు జరిగిన ముచ్చట్లు చాలా విని ఉండే నేను. ఇప్పుడు వీళ్ళు ఇద్దరు కుమ్మక్కై నా నగలు లాగేసుకుని ఆపైన నన్ను ఏమైనా చేస్తే...

ఆ ఆలోచన రాగానే వెన్నులో వణుకు మొదలైంది నాకు. గొంతు తడారిపోతుంటే లేని ధైర్యాన్ని ముఖమ్మీద ప్రదర్శిస్తూ బస్సు ఎందుకు ఆపారని కండక్టర్ని అడిగిన. "టైరు పంక్చర్

అయింది” అని విసుగ్గా చెప్పి కిందకు దిగిండు కండక్టర్. అతని వెనుకే డ్రైవర్ దిగిండు. 'మూలిగే నక్క మీద తాటి పండు పడ్డట్టు' అయింది నా పరిస్థితి. నిజంగా టైర్ ఫంచర్ అయిందో లేక వీళ్ళు అలా నాటకం ఆడుతున్నరో ఏమో అనిపించింది. ఎప్పుడు చాల ధైర్యంగా ఉండే నాకు మొదటిసారి భయం అంటే ఏంటో తెలిసింది. సెల్ ఛార్జింగ్ అయిపోయింది. వాటర్ బాటిల్ లో నీళ్ళు కూడాలేకుండె. దప్పిక, భయం మూకుమ్మడిగా నా మీద దాడికొచ్చినై. వీళ్ళు నిజంగా దుర్మార్గులు అయితే ఇప్పుడు నేనేం చేయాలి సమజైతలేకుండే నాకు. చుట్టూ చిమ్మ చీకటి. డోర్ లాగినా. రాలేదు. వాళ్ళు గట్టిగా డోర్ వేసిపోయినట్లు ఉన్నారు. చీకట్లో వాళ్ళు ఏం చేస్తున్నారో నాకు కనిపిస్తా లేదు. 'యాదగిరి నరసింహ స్వామి నన్ను వీళ్ళ బారినుంచి కాపాడు తండ్రి. అమ్మా పోచమ్మ తల్లి... ఈ సారి నీకు మంచిగా బోనాలు పెడతాను. ఈ గండం గట్టెకించు'.

గుర్తొచ్చిన దేవుళ్ళకంతా మొక్కతా ఉన్న. పది నిముషాల తర్వాత డ్రైవర్, కండక్టర్ బస్సు ఎక్కిన్రు. టైర్ మార్చినారేమో ఇప్పటిదాకా. బస్సు కదిలింది. కానీ నా భయం మాత్రం వదలలేదు. కన్ను మంట ఇంకా తగ్గలేదు. ఇది మెయిన్ రోడ్ కదా పోలీసులు తిరుగుతారని బస్సును దారి మళ్లించి ఇంకెక్కడికైనా తీసుకుపోతారేమో అని ఆలోచిస్తా బిక్కు బిక్కు మంటు చూస్తూ ఉండగానే బస్సు పటాన్చెరు బస్టాండ్‌లోకి వచ్చిఆగింది.

బతుకు జీవుడా అనుకుంటా బ్యాగ్ భుజానికి తగిలించుకుని సీట్ లో నుంచి లేచి డోర్ తీయబోయినా దిగేదానికి. వెనుక నుంచి "చెల్లె" అన్న మాట బిగ్గరగా వినపడి వెనక్కు తిరిగి శిలా ప్రతిమలా నిలబడ్డాను నేను. డ్రైవర్ నన్ను చూసి "ఏంది చెల్లె గీ టైంల ఏడికి పోతున్నావ్. ఇంత రాత్రి ఒక్క దానివి ఎందుకు వచ్చినవు చెల్లె" అని కండక్టర్ వైపు తిరిగి "ఇదిగో యాదగిరి.. చెల్లె ఒక్కటే ఉంది. బస్టాండ్ ముంగడ షేర్ ఆటో సాయిలు ఉంటాడు. చెల్లెను తీస్కపోయి ఆటో ఎక్కించు. చెల్లెను ఆటోలో తోలుకపోయి వాళ్ళ ఇంటి దగ్గర భద్రంగా వదలమని నా మాటగా చెప్పు. తేడా వస్తే ఈ డ్రైవర్ నర్సింగు మనిషిగాడని చెప్పు" అన్నాడు.

అంతే... అతని మాటలు విన్న నాకు అప్పటిదాకా ఒక కంటి నుంచి వచ్చిన నీరు రెండో కంటికి కూడా చేరి చెంపల మీదినుంచి ధారగా కారసాగింది. మనిషి బాహ్య రూపం చూసి వీళ్ళు మంచి వారు,వీళ్ళు చెడ్డ వారు అని ఎవరిని అంచనా వేయకూడదని, పురుషులందు పుణ్య పురుషులు వేరని ఆ క్షణం అనిపించింది వాళ్ళ మాటలు విన్న నాకు. అప్రయత్నంగా వారిద్దరికీ చేతులు జోడించి మొక్కిన నేను.

# తిరగబడు



**డా. సరోజ వింజామర**

ఎందుకు దుర్మార్గానికి బలి అవుతావు
నీ హత్య అమ్మాయిలను మరింత బేలగా చేయడం కన్నా
చేసిన పనికి వాడు జీవితాంతం పశ్చాత్తాప పడేటట్లు
ఒక్కడినన్నా కోలుకోలేకుండా నువ్ గాయ పరిచినా
నీతోపాటు చితికి నలుగురు దుర్మార్గులను
తీసుకుపోయావు అనే వార్త
మహిషాసుర మర్దినిలా నిన్ను నిలిపేది కదా

నిన్ను తొంబై ఏండ్ల వాడికి నాలుగో భార్యగా అమ్మినపుడు
నువు తినే మెతుకుకి లక్షల కట్నాలతో వెల కడుతున్నపుడు
నిన్ను సన్యాసినిగా చేసి వాడి ప్రకోపాలను తీర్చుకుంటున్నప్పుడు
ఆడ బ్రతుకు ఇంతే అని దిగులు పడుతూ కూర్చోకు

వారంతా ఇంట్లో నిన్ను సభ్యత, పరువులతో కప్పి పెట్టి
బయట నీతో అందాలు ఆరబోయిస్తూ, అర్ధ నగ్న
నృత్యాలు చేయిస్తూ నిన్ను దిగజార్చి చూస్తున్నవారే
రాత్రయితే ట్రిపుల్ సంస్కార వంతులే

అబలవు అనే నిర్వేదం వీడి ఇకనైనా నిర్భయంగా పోరాడు
ఈనాడైనా పోరాడకుంటే రేపటికి నువ్వు మిగలవు

నువ్వు కాపాడమని అరిస్తే
ఆదుకునే కృష్ణులు లేరు.
అడుగడుగునా దుర్యోధనులే ఇక్కడ
ధర్మం కోసం కొడుకునైనా సంహరించిన సత్యవు నువ్వే
బలంతో విర్రవీగినవాన్ని భస్మం చేసిన మోహినివి నువ్వే
యమునితో కూడా పోరాడి సాధించగల సావిత్రివి నువ్వే
నీ శక్తిని నువ్వు తెలుసుకో

నిర్భయ చట్టంతో నిన్ను దశాబ్దాలుగా ఆదుకున్నప్పుడు
ఈరోజు మనీషా నిన్న టేకుల పల్లి లక్ష్మి మొన్న దిశ
లెక్కకు అందని ఎన్నో కేసులతో
నిన్ను చిద్రం చేస్తున్నప్పుడు మౌనంగా రోదించకు
నీపై చూపు పడినప్పుడే
కన్నీళ్లకు బదులు నిప్పులు కురిపించు
మధిస్తున్న మహిషాలను మర్దించు పరాశక్తీ
రుద్రమ, ఝూన్సీవై కరవాలం చేతబూని
రావణ కాష్టం మరలా రగిలించు




## తెలంగాణ కవితా కల్హారాలు

ఆచార్య ఎల్లూరి శివారెడ్డి &
డా॥ జె.చెన్నయ్య
తెలంగాణ సారస్వత పరిషత్తు
హైదరాబాద్
ఫోన్: 040-24753724
వెల రూ: 170/-




## దృక్కోణాలు

అంపశయ్య నవీన్

ప్రత్యూష ప్రచురణలు
ఫోన్: 040-24652387
వెల రూ: 150/-




## నియంత్రణ

డా॥ కసప నరేందర్
తెలుగు అసోసియేషన్ ప్రచురణలు
నవోదయ బుక్ హౌస్

ఫోన్: 040-24652387
వెల రూ: 200/-




## రాయక్క మాన్యమ్

జూపాక సుభద్ర

దండోరా ప్రచురణలు
హైదరాబాద్
సెల్: 9441091305
వెల రూ: 150/-




## సుందరకాండము - ద్విపదకావ్యము

'అభినవమొల్ల'
డా॥ చక్రవర్తుల లక్ష్మీనరసమ్మ
శ్రీ రాఘవ ప్రచురణలు, భద్రాచలం
ఫోన్: 8978852385
వెల రూ: 150/-




## సమ్మెట ఉమాదేవి కథానికలు

సమ్మెట ఉమాదేవి

కవీర్ణ ప్రచురణలు
సికింద్రాబాద్

సెల్: 98494057
వెల రూ: 160/-




## యానాంలో ఒకరోజు

అంపశయ్య నవీన్
ప్రత్యూష ప్రచురణలు
నవోదయ బుక్ హౌస్,
నవచేతన పబ్లిషింగ్ హౌస్
ఫోన్: 040-24652387/24224458
వెల రూ: 150/-




## అడుగులు - కథల సంపుటి

డా॥ ఎం. దేవేంద్ర
విశాలసాహిత్య అకాడమి

శ్రీచందన మరోజు పబ్లికేషన్
సెల్: 8331966987
వెల రూ: 120/-




## బ్లాక్ బోర్డ్

ఎర్రోజు వేంకటేశ్వర్లు
ప్రణవి ప్రచురణలు
కరీంనగర్
సెల్: 9492557037
వెల రూ: 100/-




## గోర్ బంజార

డా॥ ధనంజయ్ నాయక్
డా॥ సూర్య ధనంజయ్

సికింద్రాబాద్
సెల్: 9949996902
వెల రూ: 999/-

